
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 208

గురువారం 13-4-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



చెన్నైకు చెక్

3 పరుగుల తేడాతో రాజస్తాన్ గెలుపు.. రాణించిన బట్లర్, అశ్విన్ - 12లో



7 వారాల గరిష్టానికి సూచీలు


సెన్సెక్స్ 235 పాయింట్ల లాభం.. 17,800 స్థాయి పైకి నిఫ్టీ - 13లో



సమైక్యంగా ఎన్నికలకు!

బీజేపీని ఓడించేందుకు విభేదాలను పక్కన పెట్టి కలసికట్టుగా ముందుకు సాగాలని కాంగ్రెస్, జేడీ(యూ), ఆర్జేడీ నిర్ణయించాయి.

వివరాలు 6లో ▸



పంజాబ్‌లో కాల్పుల కలకలం

పంజాబ్‌లోని భటిండా సైనిక శిబిరంలో ఆగంతకులు జరిపిన కాల్పుల్లో నలుగురు జవాన్ల ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



కర్ణాటక బీజేపీలో అసమ్మతి

తమకు కాకుండా కొత్త వారికి టికెట్లు లభించడంతో సీనియర్ నేతలు లక్ష్మణ్ సావది, దొడ్డప్ప బీజేపీకి గుడ్‌బై చెప్పారు.

వివరాలు 6లో ▸



25న కోర్టుకు హాజరుకండి

మోదీ ఇంటి పేరు వివాదం కేసులో 25న కోర్టు ఎదుట హాజరవ్వాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని పాట్నా కోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸



ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

అక్కచెల్లెమ్మలకు సెల్యూట్

వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత నగదు జమ కార్యక్రమంలో సీఎం జగన్

- ఇంటింటి దీపాలు బాగుంటేనే కుటుంబాలు బాగు
- అందుకే ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలనే తపన
- మహిళా సాధికారతే లక్ష్యంగా అడుగులు ముందుకు
- ఆర్థికంగా నిలదొక్కుకునేలా అన్ని విధాలా సహకారం
- ఓసీ వర్గాల్లోని పేదలనూ ఆదుకోవడానికే ఈబీసీ నేస్తం
- కమ్మ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వెలమ తదితర వర్గాలకు ప్రయోజనం.. 4,39,068 మంది అక్క చెల్లెమ్మలకు రూ.658.60 కోట్లు సాయం
- అక్టోబర్‌లో 'వెలిగొండ'కు ప్రారంభోత్సవం

2లో



ఇదీ చాలెంజ్

- ఎవరి హయాంలో మేలు జరిగిందో చూద్దామా?
- చంద్రబాబుపై నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- చేసిన మేలేంటో చెప్పే ధైర్యం మీకుందా?
- మేము కట్టిన ఇళ్ల వద్దకు వెళ్లి ఫేక్ సెల్ఫీలా?
- టిడ్కో ఇళ్లు కట్టలేక మీరు వదిలేస్తే.. మేం పూర్తి చేశాం
- ఈ అబద్ధాల బ్యాచ్‌ను నమ్మకండి.. నిలదీయండి
- ఇప్పుడున్న పథకాలు అప్పుడెందుకు లేవని ప్రశ్నించండి

2లో

'మార్గదర్శి' మోసాలివిగో

- చట్ట ఉల్లంఘనలపై దర్యాప్తు చేయండి
- జాతీయ దర్యాప్తు సంస్థలకు సీఐడీ సూచన
- చిట్‌ఫండ్ ముసుగులో జరుగుతున్న అతిపెద్ద ఆర్థిక మోసాన్ని అడ్డుకున్నాం.. చందాదారుల సొమ్మును అక్రమంగా మళ్లించారు
- మార్గదర్శి వ్యవహారాలు సత్యం, శారద, సహారాకు ఏమాత్రం తీసిపోలేదు.. మోసపూరిత ఆర్థిక సంస్థలను ఏమాత్రం ఉపేక్షించొద్దు
- గతంలోనే రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన 'సుప్రీం'

3లో




మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ ఏడీజీ సంజయ్

'చెక్కు'తో చిక్కారు!

- ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల చెక్కులు చూపిస్తున్న మార్గదర్శి
- బ్యాలన్స్ షీట్‌లో కనిపించిన చెక్కులు 90 రోజులు దాటినా నగదుగా మారని వైనం
- దారి మళ్లించిన రామోజీ.. రికార్డులు పరిశీలించేందుకు సమ్మతించని శైలజా కిరణ్
- తాజాగా ప్రధాన కార్యాలయంలో సీఐడీ విస్తృత సోదాలు..
- అసలు చెక్కులు వచ్చిందీ లేదు.. నగదుగా మార్చిందీ లేదు
- మరో రూ.500 కోట్లు ఏటా నగదు రూపంలో వసూలు

3లో

పిటిషనే లేకుండా వాదనలా?




తమ కేంద్ర కార్యాలయంలో కొనసాగుతున్న తనిఖీలను ఆపాలని, బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన మార్గదర్శికి ఎదురుదెబ్బ తగిలింది. ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేయకుండా మౌఖికంగా రిలీఫ్ కోరడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. పిటిషన్ దాఖలు చేస్తేనే వాదనలు వింటామని తేల్చి చెప్పింది. తనిఖీలపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది.

- వివరాలు 3లో

పాలమూరు-రంగారెడ్డికి నీటి కేటాయింపులు చట్టవిరుద్ధం

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీలను కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేసి దిగువ రాష్ట్రమైన తమ రైతుల హక్కులను పరిరక్షించాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించిన బచావత్ ట్రిబ్యునల్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు ఎలాంటి కేటాయింపులు చేయలేదని గుర్తు చేసింది. కేటాయింపులే



లేని ప్రాజెక్టుకు నీటిని కేటాయిస్తూ తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని కోరింది.

14లో

ఎక్కువ మార్కులొచ్చిన జవాబులే పరిగణనలోకి

- ఈ నెల 19 నుంచి పదో తరగతి మూల్యాంకనం.. టెన్త్ విద్యార్థులకు మేలు జరిగేలా ఎస్‌ఎస్‌సీ బోర్డు చర్యలు
- అధిక జవాబులు రాస్తే.. తక్కువ మార్కులొచ్చిన సమాధానం తొలగింపు
- రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌లో మార్పులుంటే మూల్యాంకనం చేసిన వారిపై చర్యలు
- అసిస్టెంట్ ఎగ్జామినర్లు రోజుకు 40 సమాధాన పత్రాలు మాత్రమే చేయాలి
- మార్కులను స్పెషల్ అసిస్టెంట్లు లెక్కించాలి.. చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, క్యాంప్ ఆఫీసర్ వాటిని పరిశీలించాలి
- ఆదేశాలు ఇచ్చిన విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్

14లో

ప్రతి ఇంటా విశ్వాసం



వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. బుధవారం కూడా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఇదివరకెన్నడూ లేని రీతిలో గత 46 నెలలుగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు, సుపరిపాలనతో మేలు చేశారంటూ అక్క చెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ములు ప్రశంసించారు. మళ్లీ జగనే అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ప్రజా మద్దతు పుస్తకంలో తమ అభిప్రాయాలను నమోదు చేయించి, రసీదు తీసుకున్నారు.

13లో

ఇదం జగత్



కష్టాల్లో ఉన్నాం.. పెళ్లొద్దు కానీ ఆ డబ్బులేవో మాకే ఇవ్వండని యువ రైతులొచ్చార్సార్!

ఆంధ్రా అరటికి గ్రాండ్ వెల్కమ్

అనంతపురం జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు భారీగా ఎగుమతి



రికార్డు స్థాయిలో 50 వేల టన్నుల ఎగుమతి

- అనంతపురం జిల్లా నుంచే 30 వేల టన్నులు
- నాణ్యత, నిల్వ విషయంలో అత్యుత్తమ రకంగా జీ9
- టన్నుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకూ ధర

రాష్ట్రంలో పండే జీ-9 (గ్రాండ్ నైన్) రకం అరటిపండ్లకు ప్రపంచవ్యాప్తంగా మంచి గిరాకీ ఏర్పడింది. గల్ఫ్ దేశాలు వీటిని బంగారం మాదిరిగా భావిస్తూ తన్నుకుపోతున్నాయి. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీ నుంచి రికార్డు స్థాయిలో 50 వేల టన్నుల అరటిపండ్లు ఎగుమతి అయ్యాయి. 2016-17లో కేవలం 246 టన్నుల అరటి పండ్లు మాత్రమే ఎగుమతి కాగా.. ఇప్పుడు 50 వేల టన్నుల మార్కును దాటి ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేశాయి. అందులో రమారమి 60 శాతం అంటే 30 వేల టన్నులు ఒక్క అనంతపురం జిల్లా నుంచే ఎగుమతి కావడం విశేషం. అనంతపురం, తాడిపత్రి, శింగనమల తదితర నియోజకవర్గాల్లో గ్రాండ్ నైన్ అరటిపండ్ల సాగు విపరీతంగా పెరిగినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అనంతపురంతో పాటు కడప, ప్రొద్దుటూరు, నంద్యాల ప్రాంతాల నుంచి కూడా జీ-9 అరటిపండ్లు ఎగుమతి అవుతున్నాయి.

-సాక్షి ప్రతినిధి, అనంతపురం

ఆ క్వాలిటీయే వేరు

గ్రాండ్ నైన్ అరటిపండ్ల నాణ్యతే వేరు. పండు మగ్గిన తర్వాత అత్యంత మధురంగా ఉంటుంది. పొడవుగా ఆకర్షణీయంగా ఉంటుంది. అన్నింటికీ మించి రవాణాకు అనువుగా ఎక్కువ రోజులు నిల్వ ఉండే సామర్థ్యం ఉంది. అందుకే ఈ రకం అరటిపండ్లను గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో ఎగుమతులు భారీగా పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. సౌదీ అరేబియా, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఈజిప్ట్, కువైట్ తదితర దేశాలకు భారీగా ఎగుమతి అవుతున్నాయి.



తోట వద్దే అరటి కాయలను గ్రేడింగ్ చేసి రవాణాకు సిద్ధం చేస్తున్న దృశ్యం

టిష్యూ కల్చర్ రకమిది



జీ-9 అరటి టిష్యూ కల్చర్ ద్వారా రూపొందించబడింది. వివిధ కంపెనీలు రూపొందించిన ఈ మొక్కలపై ఇక్కడి రైతులకు అవగాహన కల్పించాం. ఈ పంటపై దృష్టి పెట్టేలా చేశాం. మంచి దిగుబడులు వచ్చాయి. రుచి, నాణ్యత, రంగు.. ఇలా అన్నింటిలోనూ జీ-9 అనేది బెస్ట్ క్వాలిటీ. మంచి ధర కూడా ఉండటంతో అనంతపురం జిల్లాలో రైతులకు మంచి లాభదాయక పంటగా ఉంది.

– రఘునాథరెడ్డి, సహాయ సంచాలకులు, ఉద్యాన శాఖ, అనంతపురం

ప్రకృతి ఒడిలో.. పంట భద్రుడు.!

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు
నాణ్యమైన మామిడి దిగుబడి లక్ష్యంగా అడుగులు
సహజసిద్ధమైన రంగు, రుచి, వాసనతో మామిడి ఫలాలు
నంబర్ వన్ క్వాలిటీతో విదేశాలకు ఎగుమతి

పీలేరు: కేవీపల్లె మండలం నూతనకాల్వ గ్రామానికి చెందిన శివకుమార్ బీటెక్ చదివాడు. గతంలో సాఫ్ట్‌వేర్ రంగంలో బెంగళూరు తదితర ప్రదేశాల్లో ఉద్యోగం చేసేవాడు. తిరుపతిలో కొన్నేళ్లుగా ఉద్యోగం చేస్తున్న ఆయనకు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ కల్గింది. ప్రజలకు సహజసిద్ధమైన పంట ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో తనకున్న 15 ఎకరాల మామిడి తోటను కొత్తపద్ధతిలో అభివృద్ధి చేసేందుకు సంకల్పించాడు. పట్టభద్రుడు కాస్తా 'పంట'భద్రుడిగా మారాడు. 2019లో ప్రకృతి వ్యవసాయ నిపుణుడైన బోదేషావలి సూచనలు, సలహాలు తీసుకుని అప్పటి నుంచి తన మామిడి తోటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు ప్రారంభించాడు. ప్రతి ఏటా మామిడి చెట్లకు పిచికారీ రూపంలో జీవ పురుగు మందులను, జీవ శిలీంద్రాలను అందిస్తూ వస్తున్నాడు.

నాణ్యమైన దిగుడే లక్ష్యం

పండ్లలో రారాజు అయిన మామిడి సాగులో నాణ్యమైన పంట దిగుబడే లక్ష్యంగా రైతు శివకుమార్ వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టాడు. ప్రధానంగా సహజ సిద్ధమైన రంగు, రుచి, వాసనతో మామిడి పండ్ల దిగుబడే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంట సాగు చేస్తున్నాడు. జిల్లా వ్యవసాయ సలహామండల సభ్యుడు బోదేషావలి పర్యవేక్షణలో మామిడి సాగు చేస్తూ నంబర్ వన్ క్వాలిటీతో విదేశాలకు ఎగుమతి చేయడానికి సిద్ధం చేస్తున్నాడు.

సేంద్రియ ఎరువులతో సాగు..

గత నాలుగేళ్లుగా మామిడి తోటకు ప్రకృతి వ్యవసాయ వైద్య నిపుణుడు బోదేషావలి సొంతంగా తయారు చేసి అందజేసిన అనిమిల్ (స్థూల, సూక్ష్మ పోషకాలు కల్గిన) ద్రావణాన్ని మాత్రమే వాడుతూ వచ్చాడు. చెట్టుకు వేరు ద్వారా అందాల్సిన పోషకాలను ఒక ఎకరానికి 10 కిలోల జనుము, 10 కిలోల నవ ధాన్యాలను చల్లి పూత దశలో భూమిలోకి కలియదున్నడం చేశాడు.

మామిడికి కవర్లు...

ప్రకృతి వ్యవసాయంతో భూసారాన్ని పెంచటం, నాణ్యమైన పంటను తీసుకోవటం జరుగుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకోవడానికి మామిడికి కవర్లు కట్టే పద్ధతి తీసుకొచ్చాడు. శాస్త్ర వేత్తలు, ఉద్యాన శాఖాధికారుల సూచనలు, సలహాల మేరకు ప్రతి ఏటా మామిడి కాయలకు కవర్లు కడుతున్నాడు. ఒక్కో మామిడి కాయకు కవరుతో కలిపి కట్టేందుకు రూ. 2.50 ఖర్చు అవుతున్నట్లు రైతు తెలిపాడు.

కవర్లతో ప్రయోజనాలు...

కవర్లు వాడటం వలన పండు ఈగ ప్రభావాన్ని నివారించవచ్చు. తామర పురుగు, పిండినల్లి, పేనుబంక, తెల్లదోమ వలన కలిగే నష్టాన్ని నివారించవచ్చు. టెంక పురుగు వలన కలిగే నష్టాన్ని నియంత్రించవచ్చు. ఏప్రిల్, మే మాసాలలో సంభవించే అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మామిడి కాయలు రాలకుండా చేయవచ్చు. మామిడి కాయ రంగు, రుచి, వాసన సహజ సిద్ధంగా ఉండే విధంగా పంటను పండించవచ్చు. కవర్లు కట్టిన మామిడి కాయలు మార్కెట్‌లో అధిక ధర పలుకుతాయి.

విదేశాల్లో మంచి గిరాకీ...

ప్రకృతి వ్యవసాయ పద్ధతితో పాటు కవర్లు కట్టిన మామిడి కాయలు అత్యంత నాణ్యత కలిగి ఉంటాయి. దీంతో మన దేశంతోపాటు విదేశాల్లోనూ ఈ కాయలకు మంచి గిరాకీ లభిస్తోంది. రైతు శివకుమార్ పండించే నంబర్ వన్ క్వాలిటీ కల్గిన మామిడి కాయలను ప్రతి ఏటా అమెరికా, కువైట్, దుబాయ్ లాంటి దేశాలకు ఎగుమతి చేస్తూ అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు.

కవర్లతో నాణ్యమైన పంట దిగుబడి

మామిడి కాయలకు కవర్లు కట్టడం ద్వారా నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. కాయలకు చీడపీడల నుంచి రక్షణ కవచంలా కవర్లు పని చేస్తాయి. కాయలపై మచ్చలు, గీతలు పడకుండా మంచి నాణ్యతతో ఆకర్షణీయంగా ఉంటాయి. దీంతో రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది. మామిడి రైతులు కవర్లు కట్టే పద్ధతిపై ఆసక్తి చూపాలి.

– రవిచంద్ర, జిల్లా ఉద్యానశాఖ అధికారి

22న పీఎస్ఎల్వీ సీ-55 ప్రయోగం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెల 22న సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ-55 ప్రయోగం చేపట్టేందుకు శాస్త్రవేత్తలు సిద్ధం చేస్తున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న పీఐఎఫ్ భవనంలో పీఎస్ఎల్వీ మొదటి, రెండు దశలు రాకెట్ అనుసంధానం పూర్తి చేశారు. మూడు, నాలుగు దశలను మొబైల్ సర్వీస్ టవర్‌లో అనుసంధానం చేసి సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రయోగంలో సింగపూర్‌కు చెందిన ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్నారు.

ఎమ్మెల్సీలుగా 9 మంది ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ మోషేన్‌రాజు



సాక్షి, అమరావతి: శాసనమండలి సభ్యులుగా ఇటీవల ఎన్నికైన తొమ్మిదిమంది బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో వారితో శాసనమండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు ప్రమాణం చేయించారు. మిట్టవెంకటగారి రామచంద్రారెడ్డి, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, పోతుల సునీత, బొమ్మి ఇస్రాయిల్, జయమంగళ వెంకటరమణ, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పెనుమత్స సూర్యనారాయణ రాజు, ఎస్.మంగమ్మ శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, అసెంబ్లీలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, శాసనమండలిలో చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీగా వి.వినోద్‌కుమార్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ సీఈవోగా డాక్టర్ వినోద్‌కుమార్ బుధవారం తాడేపల్లిలోని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

'అంబేడ్కర్' వర్సిటీ డైరెక్టర్‌గా ఎల్వీకే

సాక్షి, అమరావతి: హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అభ్యాసక సహాయ, సేవా విభాగం డైరెక్టర్‌గా డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి(ఎల్వీకే) నియమితులయ్యారు. ఆయనను డైరెక్టర్‌గా నియమిస్తూ యూనివర్సిటీ వీసీ బుధవారం ఉత్తర్వులిచ్చారు. గతేడాది జూలై నుంచి ఆయన ఇన్‌చార్జి డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. ఇటీవల జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించగా.. తాజాగా పూర్తిస్థాయి డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులపై నిరంతర పర్యవేక్షణ

- వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశం

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా నిరంతర పర్యవేక్షణ ఉంచాలని జిల్లా కో-ఆర్డినేటర్‌లను వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదేశించారు. మంగళగిరిలోని వైద్య శాఖ ప్రధాన కార్యాలయంలో అన్ని జిల్లాల కో-ఆర్డినేటర్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు.

ఈవో పోస్టుల ఎంపిక జాబితా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని దేవదాయ శాఖ పరిధిలోని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను ఏపీపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. ఈ జాబితాను కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను ఈ నెల 26న కమిషన్ కార్యాలయంలో పరిశీలన చేయనున్నారు. ఇదిలా ఉండగా ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగానికి సంబంధించి అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితానూ విడుదల చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

జయ రకం ధాన్యం సేకరణకు లైన్ క్లియర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జయ రకం (బొండాలు) ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఫలితంగా ఉభయ గోదావరి జిల్లాల్లో జయ రకం పంట పండించే రైతులకు సంపూర్ణ మద్దతు ధర భరోసా లభించనుంది. ప్రస్తుతం బయట మార్కెట్‌లో జయ రకం ధాన్యం మంచి రేటు పలుకుతోంది. కేరళలో సైతం ఎక్కువగా ఏపీలో పండిన జయ రకం దొడ్డు బియ్యాన్ని ఆహారంగా వినియోగిస్తుంటారు. ఈ క్రమంలోనే గతేడాది కేరళ ప్రభుత్వం సైతం దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసేలా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. కొన్నేళ్లుగా రేటు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు సైతం దొడ్డు రకాల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. కేంద్రం నిర్ణయంతో ప్రస్తుత రబీలో ఈ-క్రాప్ డేటా ఆధారంగా జయ రకం పంట పండించిన రైతుల నుంచి ప్రత్యేకంగా ధాన్యాన్ని సేకరించనున్నారు. రాష్ట్రంలో ఎఫ్‌సీఐ అవసరాల మేరకు 3.40 లక్షల టన్నుల దొడ్డు బియ్యం అందించాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం రైతుల నుంచి ఐదులక్షల టన్నుల జయ రకం ధాన్యం సేకరణకు సమాయత్తం అవుతోంది.

జోనల్ వ్యవస్థ, స్థానికతపై మంత్రుల బృందం భేటీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాల్లో చేపట్టాల్సిన మార్పులకు సంబంధించి 1975 రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ అంశాలపై బుధవారం సచివాలయంలో మంత్రుల బృందం సమావేశమయ్యింది. పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన దృష్ట్యా పాత జోనల్ విధానంలో మార్పులు, స్థానికత తదితర అంశాలపై మంత్రుల బృందం ప్రాథమికంగా చర్చించింది. ఈ అంశాలపై ఉద్యోగ సంఘాలు, ఇతర వర్గాలతో కూడా చర్చించి వారి సూచనలు తీసుకుని దీనిపై ఒక ముసాయిదాను రూపొందించి ప్రజల అభిప్రాయాలను సేకరించాల్సి ఉంది. పూర్తిస్థాయి కసరత్తు అనంతరం.. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపి తద్వారా రాష్ట్రపతి ఆమోదంతో ఉత్తర్వులను పొందాల్సి ఉంటుంది. కాగా, ఇది తొలి సమావేశం కావడంతో మంత్రుల బృందం బుధవారం సమీప రాష్ట్రాల్లో జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాలు ఎలా అమలవుతున్నాయో అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంది. రాష్ట్ర సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రస్తుతం ఉన్న జోనల్ వ్యవస్థ, స్థానికత తదితర అంశాలను వివరించారు. సమావేశంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు(ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, ఉన్నతాధికారులు రజత్ భార్గవ, చిరంజీవి చౌదరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు సెల్యూట్

వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత నగదు జమ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్



సభకు హాజరైన అశేష జనవాహినిలోని ఓ భాగం



సభాప్రాంగణం నిండిపోవడంతో రోడ్డు మీదే నిలుచున్న జనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: 'సన్మానాలు అందుకునే వాళ్లు మాత్రమే గొప్ప వాళ్లు కాదు. నిత్యం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ.. వారి జీవితాలను మాత్రమే కాకుండా ఇంట్లో ఉన్న వారందరి బాగు కోసం నిత్యం చిరునవ్వుతో, గొప్ప బాధ్యతతో శ్రమించే ప్రతి అక్క, చెల్లెమ్మ కూడా గొప్ప వాళ్లే. అందుకే వారందరికీ సెల్యూట్ చేస్తున్నా' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇంటింటి దీపాలైన అక్క చెల్లెమ్మలు బాగుంటేనే ఆయా కుటుంబాలు బాగుంటాయని చెప్పారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో బుధవారం ఆయన వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద రెండో విడత నగదు పంపిణీని కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. 4,39,068 మంది అక్క చెల్లెమ్మలకు రూ.658.60 కోట్లు లబ్ధి చేకూర్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యంత బరువు బాధ్యతలు భుజాన వేసుకున్న 45-60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అక్క చెల్లెమ్మల చేతిలో డబ్బులు పెడితే ప్రతి రూపాయి తమ కుటుంబం బాగోగుల కోసమే ఖర్చు పెడతారని దృఢంగా నమ్ముతున్నామన్నారు. అందుకే వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా అన్ని విధాలా తోడుగా నిలిచామని తెలిపారు. 'ఇప్పటికే వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు మంచి చేస్తున్నాం. అంతటితో ఆగిపోకుండా కాపు అక్కచెల్లెమ్మల కోసం వైఎస్సార్ కాపు నేస్తం పథకం ప్రారంభించాం. వీరందరితో పాటు ఓసీ వర్గాల్లోని పేద అక్కచెల్లెమ్మలకు మంచి చేయడం కోసం ఈబీసీ నేస్తం పథకానికీ శ్రీకారం చుట్టాం' అని చెప్పారు. ఈ రెండేళ్లలోనే వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా పేద అక్క చెల్లెమ్మలకు రూ.1,258 కోట్లు వాళ్ల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశామన్నారు. రెడ్లు, కమ్మ, ఆర్య వైశ్యులు, క్షత్రియులు, వెలమలు, బ్రాహ్మణులు తదితర ఓసీ కులాల్లో ఉన్నపేద అక్కచెల్లెమ్మలకూ ఇలా మేలు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టక పోయినా ఈబీసీ నేస్తం, కాపు నేస్తం పథకాలు తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఏం చెప్పారంటే..

> మీ బిడ్డ ప్రభుత్వం, మీ అన్న ప్రభుత్వం, మీ తమ్ముడి ప్రభుత్వం గత 46 నెలల కాలంలో అక్క చెల్లెమ్మలకు సాధికారత కల్పించే దిశగా వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. తల్లి గర్భంలో ఉన్న శిశువు మొదలు 60-100 ఏళ్ల వయస్సులో ఉన్న అవ్వల వరకు అందరికీ మంచి చేస్తున్నాం. సంపూర్ణ ఆరోగ్య పోషణతో మొదలు పెడితే వృద్ధాప్య పెన్షన్ వరకు అన్ని విధాలా మంచి చేయాలనే తపన, తాపత్రయంతో ముందుకెళ్తున్నాం. రాజకీయంగా నా అక్కచెల్లెమ్మలు పైకి రావాలని, సామాజికంగా, విద్యాపరంగా కూడా సాధికారతను సాధించాలని అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం.
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అన్ని విధాలా అండగా నిలిచాం

- ఈ 46 నెలల మీ బిడ్డ ప్రభుత్వంలో అమ్మ ఒడి మొదలు వైఎస్సార్ ఆసరా.. వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం.. వైఎస్సార్ ఈబీసీ నేస్తం, విద్యా దీవెన, వసతి దీవెన, షాదీతోఫా, కళ్యాణమస్తు.. విదేశీ విద్యా దీవెన వంటి అనేక పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచాం.
- అక్కచెల్లెమ్మలకు ఇప్పటి వరకు రూ.2 లక్షల 7 వేల కోట్ల లబ్ధి చేకూర్చాం. ఇందులో రూ.లక్షా 42 వేల కోట్లు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా లంచాలు, వివక్షకు తావు లేకుండా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా వెళ్లాయని చెప్పడానికి గర్వపడుతున్నాను.
- వైఎస్సార్ చేయూత ద్వారా 26,39,703 మందికి రూ.14,129 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తం కింద 3.56 లక్షల మందికి రూ.1,518 కోట్లు, వైఎస్సార్ పెన్షన్ కానుక కింద 41.77 లక్షల మందికి రూ.40,094 కోట్లు, అమ్మ ఒడి కింద 44 లక్షల 48 వేల మందికి రూ.19,674 కోట్లు జమ చేశాం. ఒక్క వైఎస్సార్ ఆసరా ద్వారా మాత్రమే 78 లక్షల 75 వేల మందికి ఇప్పటికే రూ.19,178 కోట్లు వాళ్ల ఖాతాల్లో వేశాం.
- ఏకంగా 30 లక్షల ఇళ్ల పట్టాలు అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాం. అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ ఇళ్లు పూర్తయితే ఒక్కో ఇంటి విలువ కనీసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఉంటుంది. మొత్తంగా 30 లక్షల మందికి మంచి చేస్తూ రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల ఆస్తి నా అక్కచెల్లెమ్మల చేతిలో పెట్టినట్లవుతుంది. పొదుపు సంఘాల్లో ఉన్న 1.02 కోట్ల మంది అక్క చెల్లెమ్మలకు సున్నా వడ్డీ కింద రూ.3,615 కోట్లు ఇచ్చాం.



జగనన్నే మా భవిష్యత్తు: చెల్లెమ్మల ఉత్సాహం

మార్కాపురానికి వరాల జల్లు

మీ బిడ్డ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ ఇప్పటికే పూర్తయింది. రెండో టన్నెల్ ఈ సెప్టెంబర్, అక్టోబరులో పూర్తి కాగానే (1.8 కిలోమీటర్ పూర్తవ్వాలి) మళ్లీ వచ్చి ప్రారంభిస్తాను. గతంలో నాన్న గారు 36 కిలోమీటర్ల ఈ సొరంగాలను 20 కిలో మీటర్లు పూర్తి చేస్తే, ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం ఐదు కిలో మీటర్లు కూడా చేయలేదు. మీ బిడ్డ అధికారంలోకి వచ్చాక యుద్ధ ప్రాతిపదికన ఆ మిగిలిపోయిన 11 కిలోమీటర్లు పూర్తి చేసి, ఆ ప్రాజెక్టును అక్టోబర్‌లో ప్రారంభించబోతున్నాడు. మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి నా సోదరుడు ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి నా దృష్టికి తెచ్చిన వాటికి ఇప్పుడే ఇక్కడే శంకుస్థాపన చేశాం. ఎన్ఎస్‌పీ కెనాల్ నుంచి పొదిలి దాకా అంటే 17 కిలోమీటర్ల పైపులైను ద్వారా పొదిలికి తాగునీరు అందించే కార్యక్రమానికి రూ.50 కోట్లతో ఫౌండేషన్ స్టోన్ వేశాం. మార్కాపురం మున్సిపాలిటీలో నీటి పనులకు రూ.5.20 కోట్లతో శ్రీకారం చుట్టాం. ఇవికాక రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ పనులు వేగంగా జరుగుతున్నాయి. మెడికల్ కాలేజీ కోసం భూమిలిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయంగా ఇచ్చిన 13 ఎకరాల అభివృద్ధికి సంబంధించి ఎకరాకు మరో రూ.3 లక్షలు ఇచ్చేందుకు అంగీకరిస్తున్నాం.



వైఎస్సార్ ఈబీసీ నేస్తం లబ్ధిదారులతో సీఎం వైఎస్ జగన్

మన ఇంటి నుంచే ఆధునిక భారతీయ మహిళ

- విద్యా దీవెన, వసతి దీవెన కింద పిల్లల చదువుల కోసం రూ.13,351 కోట్లు ఖర్చు చేయగలిగాం. సంపూర్ణ పోషణ ద్వారా 35 లక్షల మంది బాలింతలు, గర్భిణులకు.. 6 నుంచి 72 నెలల చిన్నారులకు మంచి చేస్తూ రూ.6,131 కోట్లు ఖర్చు చేశాం.
- అక్కచెల్లెమ్మలకు భద్రత పరంగా 'దిశ' ద్వారా అండగా నిలిచాం. కోటి 17 లక్షల మంది దిశ యాప్ వారి ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నారు. నామినేటెడ్ పదవుల్లో, నామినేటెడ్ ద్వారా ఇచ్చే పనుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏకంగా చట్టం చేశాం. 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ మన రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి, ప్రతి ఇంటి నుంచి రావాలని తపన పడుతూ పాలన సాగిస్తున్నాం.
- ఈ కార్యక్రమంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నాయకులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్



కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత నగదు జమ చేస్తున్న సీఎం జగన్

ఇదీ చాలెంజ్

- 30 లక్షల ఇళ్ల స్థలాల వద్దకొచ్చి సెల్ఫీ దిగమని అడగండి
- ఇప్పుడున్న పథకాలన్నీ అప్పుడెందుకు లేవని ప్రశ్నించండి
- ఆ డబ్బును ఎవరికి దోచిపెట్టావని నిగ్గదీయండి
- మనందరి ప్రభుత్వ పాలనకు, గత పాలనకు తేడా గమనించండి
- నాకున్నదల్లా దేవుడి దయ, మీ దీవెనలే
- నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: 'అయ్యా.. చంద్రబాబూ.. సెల్ఫీ ఛాలెంజ్ అంటే నాలుగు ఫేక్ ఫొటోలు కాదు.. ఈ రాష్ట్రంలో ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతరత్రా ప్రతి పేద ఇంటి ముందు నిలబడి.. ఈ ఇంటికి మా ప్రభుత్వం వల్ల జరిగిన మంచి ఇదీ అని చెప్పగలగాలి. అది మన ప్రభుత్వం వల్లే జరిగిందని ఆ అక్కచెల్లెమ్మలు చిరునవ్వుతో ఆశీర్వదిస్తున్నప్పుడు తీసుకునే ఫొటోను సెల్ఫీ అంటారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో, నాలుగేళ్ల తమ ప్రభుత్వ పాలనలో ప్రతి ప్రాంతానికి, గ్రామానికి, ప్రతి సామాజిక వర్గానికి జరిగిన మేలు గురించి బేరీజు వేసుకునే సత్తా మీకు ఉందా.. ఇదీ ఛాలెంజ్ అని చంద్రబాబుకు సవాలు విసురుతూ నిప్పులు చెరిగారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో బుధవారం ఆయన వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద రెండో విడత నగదు పంపిణీని కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'చంద్రబాబు టిడ్కో ఇళ్లు కట్టకుండా వదిలేశాడు. అలా వదిలేసిన ఇళ్లను మీ బిడ్డ హయాంలో పూర్తిగా కట్టిన చోటుకు, వేగంగా పనులు జరుగుతున్న ఇళ్ల వద్దకు వెళ్లి ఈ 75 ఏళ్ల ముసలాయన నాలుగు ఫేక్ ఫొటోలు దిగి సెల్ఫీ ఛాలెంజ్ అంటున్నాడు' అని ఎద్దేవా చేశారు. సెల్ఫీ ఛాలెంజ్ అంటే ఫేక్ ఫొటోలు కాదన్నారు.

బాబు బృందాన్ని ఇలా నిలదీయండి

- ఈ నిజాలు ప్రజలందరికీ తెలుసు. అయినా చంద్రబాబు, ఎల్లోమీడియా నిందలు, అబద్ధాలతో దుష్ప్రచారం చేస్తున్నారు. నిజంగా ఈరోజు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 లు ఒక అబద్ధాన్ని నిజమని నమ్మించేందుకు దిక్కుమాలిన ఆలోచనలతో ముందుకు వెళ్తున్నాయి. ఇలాంటి అబద్ధాల బ్యాచ్‌ని నమ్మకండి. వారిని నిలదీయండి.
- గత ఐదేళ్లలో ఒక్క ఇంటి స్థలం ఇవ్వని మీరు.. ఈ ప్రభుత్వంలో ఏకంగా 30 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చి.. అందులో కట్టిస్తున్న ఇళ్ల వద్ద సెల్ఫీ దిగే ధైర్యం, స్టిక్కర్ అంటించే దమ్ము ఉందా అని నిలబెట్టి అడగండి.
- మనందరి ప్రభుత్వంలో అమ్మ ఒడి ద్వారా 45 లక్షల మంది తల్లులకు.. 84 లక్షల మంది పిల్లలకు మంచి జరిగిందని చెబుతూ.. మీరేం చేశారని ప్రశ్నించండి.
- 53 లక్షల మంది రైతు కుటుంబాలకు వరుసగా నాలుగేళ్లుగా ప్రతి ఏటా రూ.13,500 రైతు భరోసాగా అందిందని చెప్పండి. గతంలో బేషరతుగా రుణమాఫీ చేస్తామని ఎందుకు మోసం చేశావని చంద్రబాబును అడగండి.
- అయ్యా.. చంద్రబాబూ.. రుణమాఫీ చేస్తానని మోసం చేశావు.. బ్యాంకుల్లో పెట్టిన బంగారం విడిపించి ఇంటికి ఇప్పిస్తానని చెప్పి మోసం చేశావు. చివరకు సున్నా వడ్డీ పథకాన్ని కూడా ఎగురగొట్టావ్.. మమ్మల్ని రోడ్ల మీద నిలబెట్టావ్.. అలాంటి మనిషివి నువ్వు మా ఇంటి ముందు నిలబడి సెల్ఫీ దిగే నైతికత, స్టిక్కర్ అంటించే అర్హత ఉందా.. అని పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు అందరూ గట్టిగా నిలబెట్టి అడగండి.
- వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం, ఈబీసీ నేస్తం .. ఇంకా అనేక పథకాలు మా జగనన్న ఇచ్చాడు.. ఈ పథకాలకు సంబంధించిన డబ్బులు నీ పాలనలో ఎక్కడికి పోయాయి.. ఎవరు తిన్నారు.. అని 45-60 ఏళ్ల వయస్సులో ఉన్న నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, ఈబీసీ అక్కచెల్లెమ్మలు చంద్రబాబును అడగండి.
- ప్రభుత్వ బడి గురించి, మధ్యాహ్న భోజనం, 8వ తరగతి పిల్లలకు ట్యాబ్స్, 6వ తరగతి నుంచి ప్రతి క్లాస్‌లో డిజిటల్ బోర్డ్, ఇంగ్లిష్ మీడియం.. సీబీఎస్‌సీ సిలబస్, బైలింగ్వల్ టెక్స్ట్‌బుక్స్, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక.. ఇలాంటి ఆలోచనలు మీకు ఎప్పుడైనా తట్టాయా అని చంద్రబాబును గట్టిగా నిలదీస్తూ అడగండి.
- మీ పాలనలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు ముష్టి ఇచ్చినట్లు రూ.వెయ్యి పింఛన్ ఎందుకిచ్చావని ఇప్పుడు రూ.2,750 పెన్షన్ తీసుకుంటున్న నా అవ్వాతాతలు, వితంతు అక్కచెల్లెమ్మలు, దివ్యాంగ అక్కచెల్లెమ్మలు నిలదీయండి. పింఛన్ మూడు వేలు కాబోతోందని చెప్పండి. ఇంత మేలు చేసిన మా బిడ్డతో కాకుండా మీతో సెల్ఫీ ఎలా దిగుతాము అని ప్రశ్నించండి.
- ఇంటింటికీ మంచి చేయడం అభివృద్ధా.. లేక రామోజీ ఇంటికి, రాధాకృష్ణ ఇంటికి, టీవీ-5 ఇంటికి.. చంద్రబాబు ఇంటికి దత్తపుత్రుడు ఇళ్లకు.. మూటలు పంపడం అభివృద్ధా.. అని గట్టిగా అడగండి. సామాజిక న్యాయం అంటే అన్ని కులాలకు మంచి చేయడమా...లేక చంద్రబాబు బృందం భోజనం చేయడమా అని ప్రశ్నించండి.
- భక్తి ఉంటే విజయవాడలో 45 గుళ్లను కూల్చేయడమా... మైనార్టీల మీద దేశ ద్రోహం కేసులు పెట్టడమా.. అని కూడా గట్టిగా అడగండి. జన్మభూమి కమిటీలు మంచివా.. లేక ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ మంచిదా అని చంద్రబాబు బృందాన్ని అడగండి.
- చంద్రబాబుకు సీఎం పదవి అంటే.. అరడజన్ దొంగలు.. గజదొంగలుగా దోచుకోవడం.. పంచుకోవడం... తినడం. అదే మీ బిడ్డ జగన్‌కు సీఎం పదవి ఇవ్వడమంటే.. ఇంటింటా అభివృద్ధి అని చెప్పండి.

అన్నీ గుర్తు పెట్టుకోండి..

- గతంలో 600 పేజీలతో ఒక మేనిఫెస్టో తీసుకొచ్చాడు. ఎన్నికలు అయిపోగానే దానిని చెత్తబుట్టలో పడేశాడు. అక్కచెల్లెమ్మలు, రైతులు, విద్యార్థులకు ఇచ్చిన మాటలు గాలికి ఎగిరిపోయాయి. ఆ మేనిఫెస్టో వాళ్ల వెబ్‌సైట్‌లో కూడా కనబడని పరిస్థితి. అదే మీ బిడ్డ ప్రభుత్వంలో మేనిఫెస్టో అంటే ఒక బైబిల్.. ఒక ఖురాన్.. ఒక భగవద్గీత. ప్రతిరోజూ, ప్రతిక్షణం ఆ మేనిఫెస్టో కోసం తపించిన మీ బిడ్డ పాలన ఎలాంటిదో ఆలోచించమని కోరుతున్నా.
- రాబోయే రోజుల్లో ఇంకా చాలా డ్రామాలు చూస్తాం. చాలా చాలా అబద్ధాలు వింటాం. వాళ్లకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 ఉంది. తోడుగా వాళ్ల దత్తపుత్రుడు కూడా ఉన్నాడు. కానీ మీ బిడ్డకు ఇవేమీ లేవు. మీ బిడ్డ వీళ్ల మాదిరి గజ దొంగల ముఠాను నమ్ముకోలేదు. మీ బిడ్డ నమ్ముకుంది ఆ దేవుడి దయను, మిమ్మల్ని. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా మద్దతుగా నిలవండి.

తేడా మీరే చెప్పండి..

- ఈ నాలుగేళ్ల మనందరి ప్రభుత్వంలో ఎక్కడా లంచాలు, వివక్షకు చోటు లేకుండా డీబీటీ ద్వారా మీ బిడ్డ బటన్ నొక్కుతున్నాడు. నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు వెళ్తున్నాయి. ఇంటింటికీ ఎంత మంచి చేశామో మీ అందరికీ తెలుసు. అదే గత ప్రభుత్వంలో 2014-2019 మధ్య ఒక ముసలాయన సీఎంగా ఉండేవాడు. అప్పట్లో ఈ పథకాలు ఉండేవా? ఈ బటన్ నొక్కే డీబీటీ పద్ధతి ఉండేదా? ఆ రోజు దోచుకో.. పంచుకో.. తినుకో.. (డీపీటీ).
- 2 లక్షల 7 వేల కోట్ల రూపాయలు మనందరి ప్రభుత్వంలో మన అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నేరుగా జమ అయింది. గత చంద్రబాబు పాలనలో ఈ డబ్బును ఎవరు దోచుకున్నారు?
- గత చంద్రబాబు పాలనలో అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ఒక్క రూపాయి అయినా వేశారా? (లేదు లేదు అని మహిళలు చేతులు పైకెత్తి చెప్పారు). ఇవాళ ఏ పథకం తీసుకున్నా నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో సొమ్ము జమ అవుతోంది. గతంలో జరగనిది.. మీ బిడ్డ జగన్ ఎలా ఇవ్వగలుగుతున్నాడో రాష్ట్రంలోని ప్రతి అన్నను, తమ్ముడ్ని.. ప్రతి అక్కను, చెల్లెమ్మను.. మొత్తంగా 1.56 కోట్ల కుటుంబాలను ఆలోచించాలని కోరుతున్నా.

మా అమ్మాయి మీకు థ్యాంక్స్ చెప్పమంది



అన్నా.. నా భర్త చిన్న ఉద్యోగస్తుడు. ఓసీల్లోని పేదలను గుర్తించి ఈబీసీ నేస్తం ద్వారా ఏటా రూ.15 వేలు నేరుగా మా అకౌంట్‌లో వేస్తున్నారు. ఈ డబ్బుకు మరికొంత కలుపుకుని కిరాణా షాపు పెట్టుకోవాలనుకుంటున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. అమ్మఒడి సాయం అందింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నాడు-నేడు ద్వారా మా పిల్లలు చదువుకునే పాఠశాలను బాగు చేశారు. 8వ తరగతి చదువుతున్న మా పాపకు ట్యాబ్ ఇచ్చారు. మా అమ్మాయి మీకు థ్యాంక్స్ చెప్పమంది. సొంతింటి కలను కూడా నిజం చేస్తున్నారు. ప్రజల దగ్గరకు వచ్చి పాలన అందిస్తున్న మీరు కలకాలం చల్లగా ఉండాలి. - కాసుల వెంకట అరుణ, పదో వార్డు, మార్కాపురం

మీ మేలు ఎవరూ మరచిపోరు

మహిళలంతా ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడేలా ఎన్నో పథకాలు తీసుకొచ్చిన మీ మేలును అక్కచెల్లెమ్మలు ఎవరూ మరచి పోరు. జగనన్న పాలనలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు. నారీ లోకమంతా మిమ్మల్ని దీవిస్తోంది. నాలుగేళ్లుగా సకాలంలో వర్షాలు పడి ప్రాజెక్టులు నిండాయి. పంటలు బాగా పండాయి. దిగుబడులు బాగా వచ్చాయి. పేదరికం అనే పెద్ద రోగాన్ని తరిమేయాలని మీరు తపస్సు చేస్తున్నారు. ముందు తరాలకు కూడా భరోసా ఇచ్చేలా పాలన అందిస్తున్న మీకు అన్ని వర్గాల వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారు.
- చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భరోసా



శ్రీనివాసులు సమస్య వింటున్న సీఎం

మార్కాపురం: అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారి పట్ల సీఎం జగన్ సానుకూలంగా స్పందించి వారిపై వాత్సల్యం చూపారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వచ్చిన ఆయన్ను పలువురు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణానికి వెళ్తుండగా రోడ్డు పక్కన వీల్ చైర్‌లో ఉన్న కుమార్తెతో కనిపించిన వ్యక్తిని చూసి సీఎం చలించిపోయారు. వెంటనే కాన్వాయ్ ఆపి కిందకు దిగి వివరాలడిగారు. 'సార్.. నా పేరు మిరియంపల్లి శ్రీనివాసులు. మార్కాపురం స్వస్థలం. అయితే తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను. నా కుమార్తె చంద్రగౌరి, కుమారుడు దివ్యాంగులు. ఈ దృష్ట్యా నన్ను అక్కడ నుంచి ఇక్కడికి బదిలీ చేయించండి. నా పిల్లలకు తగిన వైద్య సాయం చేయండి' అని వేడుకున్నాడు. వారికి వెంటనే సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను ఆదేశించారు. తన కుమారుడు రమేష్ ఇటీవల మరణించటంతో ఇబ్బందులు పడుతున్నానని అర్ధవీడు మండలం యాచవరానికి చెందిన సాల్మన్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. తన కోడలు సచివాలయ ఉద్యోగి కావడంతో తనకు వికలాంగుల పెన్షన్ ఆగిపోయిందని తర్లుపాడు మండలం గోరుగుంతలపాడుకు చెందిన బొబ్బరాజు నరసయ్య సీఎంకు విన్నవించారు. రెండు నెలల క్రితం తాము రెండు కుటుంబాలుగా ఏపీ సచివాలయ పోర్టల్‌లో మార్పులు చేయించామని, తిరిగి పింఛన్ వచ్చేలా చూడాని కోరారు. న్యాయం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. తన కుమారుడికి కిడ్నీ పాడైందని, సాయం అందించి ఆదుకోవాలని కొనకనమిట్ల మండలం నాగిరెడ్డిపల్లికు చెందిన వి.మార్తమ్మ సీఎంకు విన్నవించారు. తక్షణ సాయంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రతిపాదనలు పంపిస్తే సీఎంఆర్ఎఫ్ నుంచి సహాయం అందిస్తామని, ఉద్యోగం కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.



సాల్మన్, బొప్పరాజు, మార్తమ్మల సమస్యలు తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్

క్లుప్తంగా...

ఓట్ల కోసం బాబు అండ్‌కో దొంగ యాత్రలు

927వ రోజు రిలే దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అధికారంలో ఉన్నప్పుడు పేద వాడికి జానెడు జాగా ఇవ్వకుండా, సంక్షేమాన్ని కేవలం తన పార్టీ నాయకులకే పరిమితం చేసిన చంద్రబాబు.. నేడు ఓట్ల కోసం రాష్ట్రంలో దొంగయాత్రలు చేస్తుండడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో 927వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చంద్రబాబు ఏం మేలు చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు పంటలు పండే భూములను సర్వనాశనం చేసి ప్రపంచ రాజధానిని నిర్మిస్తానని చెప్పిన చంద్రబాబు చేసిన మోసాలకు నేడు 29 గ్రామాల్లో రైతులు చేసేందుకు పనిలేక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, జోషి, పులి దాసు, వెరప్రసాద్, ఆదాం, సాంబయ్య పాల్గొన్నారు.

ఆడిటర్ శ్రావణ్‌కు 14 రోజుల రిమాండ్

విశాఖ లీగల్: మార్గదర్శి చిట్‌ఫండ్ కేసులో కీలకమైన వ్యక్తిని సీఐడీ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. బ్రహ్మయ్య అండ్ కంపెనీ విజయవాడలో ఆడిటర్‌గా పనిచేస్తున్న కుదరవల్లి శ్రావణ్ (44) అమరావతి పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం విశాఖ తీసుకొచ్చి మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. తిరుమలరావు ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. కాగా, శ్రావణ్ తరఫు న్యాయవాది ఎం.రవి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

తప్పుడు లెక్కలు ఇచ్చినట్టు గుర్తింపు

విజయవాడ, ఇతర ప్రాంతాల్లోని మార్గదర్శి శాఖల్లో జరిగిన అవకతవకలపై అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ రిజిస్ట్రేషన్స్ ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, గత నెలలో ఎన్టీఆర్ జిల్లాలోని మార్గదర్శి శాఖకు సంబంధించి శ్రావణ్ ఆడిట్ చేశారు. ఇందులో పలు రికార్డులను మార్చి తప్పుడు లెక్కలు సమర్పించినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. దీంతో సీఐడీ పోలీసులు ఆడిటర్ శ్రావణ్‌కు సెక్షన్ 91 కింద నోటీసులు జారీ చేశారు. ఆయనను సీఐడీ అధికారులు 22 ప్రశ్నలు అడగ్గా.. ఒక్క దానికి కూడా సరైన సమాధానం ఇవ్వలేదు. ప్రతి ప్రశ్నకు సమాధానం దాటవేసినట్టు సీఐడీ అధికారులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. 5వ నిందితునిగా అరెస్టయిన శ్రావణ్‌ను అమరావతి పోలీసులు బుధవారం తెల్లవారుజామున ట్రాన్సిట్ రిమాండ్‌పై విశాఖ తీసుకువచ్చారు. రిమాండ్ రిపోర్టును పరిశీలించిన కోర్టు ఆయనకు ఈ నెల 26 వరకు రిమాండ్ విధించగా.. పోలీసులు కేంద్ర కారాగారానికి తరలించారు.

తెలంగాణ


అక్కా.. ఇచ్చేశా...

లిక్కర్ స్కామ్‌లో మరో సంచలన లేఖ విడుదల చేసిన చేసిన సుకేశ్

- తెలంగాణ ఎమ్మెల్సీ కవితతో వాట్సాప్ చాట్ అంటూ స్క్రీన్‌షాట్లు విడుదల
- చాటింగ్‌లలోని కోడ్ నేమ్‌ల వ్యక్తుల పేర్ల ప్రస్తావన
- ఏకే అంటే కేజ్రీవాల్.. ఎస్‌జే అంటే సత్యేంద్రజైన్..
- మనీశ్ అంటే మనీశ్ సిసోడియా.. ఏపీ అంటే అరుణ్ పిళ్లై
- కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్‌ల సూచన మేరకే కవితకు హైదరాబాద్‌లో రూ.15 కోట్లు ఇచ్చాను
- నా దగ్గర 703 స్క్రీన్‌షాట్లు ఉన్నాయి.. రెండింటిని విడుదల చేస్తున్నా..
- దీనిపై దర్యాప్తు చేయాలని సీజేఐ, కేంద్ర హోంమంత్రి, సీబీఐ, ఈడీ డైరెక్టర్లకు విజ్ఞప్తి







సాక్షి, న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో జైలులో ఉన్న సుకేశ్ చంద్రశేఖర్.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి మరో సంచలన లేఖ విడుదల చేశారు. హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యాలయంలో ఏపీ అనే వ్యక్తికి రూ.15 కోట్లు అందజేశానంటూ గతంలో లేఖ రాయగా.. తాజాగా నేరుగా పేర్లను ప్రస్తావిస్తూ మరో లేఖను, వాట్సాప్ చాటింగ్‌ల స్క్రీన్ షాట్లను విడుదల చేశారు. ఆ సొమ్ము అందజేసే క్రమంలో తెలంగాణ ఎమ్మెల్సీ కవితతో పలుసార్లు కోడ్ పేర్లతో వాట్సాప్ చాటింగ్ చేశానని లేఖలో పేర్కొన్నారు. అంతేగాకుండా ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆప్ నేతలకు, ఎమ్మెల్సీ కవితకు మధ్య ఆర్థిక సంబంధాలకు సంబంధించి తాను బయటపెట్టే అంశాల ఆధారంగా.. దర్యాప్తులో మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయని వెల్లడించారు. తన దగ్గరున్న 703 వాట్సాప్ స్క్రీన్ షాట్‌లలో.. రెండింటిని విడుదల చేస్తున్నానని.. వీటిపై దర్యాప్తు చేయాలని సుప్రీం సీజే, కేంద్ర హోంమంత్రి, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, సీబీఐ, ఈడీ డైరెక్టర్లను కోరారు.

సుకేశ్ లేఖలో పేర్కొన్న అంశాలివీ..

''ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన, అధికారంలో ఉన్న వ్యక్తులతోపాటు అవినీతిపై పలు ఏజెన్సీలు దర్యాప్తు చేస్తున్న వ్యక్తులకు మధ్య జరిగిన వాట్సాప్ చాటింగ్‌ల స్క్రీన్‌షాట్లను మీ దృష్టికి తీసుకొచ్చాను. నేను విజిల్ బ్లోయర్‌గా ఉండి ఇప్పటికే స్టేట్‌మెంట్లు ఇచ్చాను. నా దగ్గరున్న 703 వాట్సాప్ స్క్రీన్‌షాట్ల నుంచి రెండింటిని అందిస్తున్నా. దీనిపై లోతుగా దర్యాప్తు చేయాలని కోరుతున్నా. ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, మాజీ మంత్రులు సత్యేంద్ర జైన్, మనీశ్ సిసోడియా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత, కైలాశ్ గెహ్లోత్‌లతో 2015 నుంచీ పలు లావాదేవీల్లో భాగస్వామిని అయ్యాను. దర్యాప్తు చేయదగిన పత్రాల్లో నేను చెప్తున్న అంశాలు కూడా కీలకమైనవే. అరవింద్ కేజ్రీవాల్, ఆయన సహచరులు.. సౌత్ గ్రూపు, ఇండోస్పిరిట్స్ సంస్థ యజమానులు అరుణ్ పిళ్లై, ఎమ్మెల్సీ కవితలతో చురుకుగా సంప్రదింపులు చేసినట్టు స్పష్టమవుతోంది. 2020లో కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్‌ల సూచన మేరకు హైదరాబాద్‌లోని నా సిబ్బంది ద్వారా బీఆర్‌ఎస్‌కు చెందిన కవితకు డెలివరీ చేసిన లావాదేవీ చాటింగ్‌లు ఇవి. సత్యేంద్ర జైన్‌తో నా చాట్ వివరాలు జత చేశాను. కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్‌ల సూచన మేరకు ఎమ్మెల్సీ కవితకు హైదరాబాద్‌లో రూ.15 కోట్లు ఇచ్చిన దానికి చెందిన చాటింగ్‌లు ఇవి. ఢిల్లీ మద్యం లైసెన్సుల నిమిత్తం కేజ్రీవాల్‌తో కవిత ఆర్థిక లావాదేవీలు జరిగాయి. కిక్‌బ్యాక్ అయిన మొత్తం హైదరాబాద్ నుంచి హవాలా రూపంలో పలు ఆసియా దేశాలకు (ఆప్‌కు అనుకూలంగా ఉన్న) పంపారు. ఢిల్లీ నుంచి ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని కేజ్రీవాల్ ప్రత్యేకంగా పేర్కొన్నారు. దీంతో అన్ని క్యాష్ లావాదేవీలు కరోనా కాలంలో హైదరాబాద్ నుంచి చేపట్టారు'' అని సుకేశ్ తన లేఖలో పేర్కొన్నారు.

నాపై ఒత్తిడి ఉంది.. వెంటనే దర్యాప్తు చేయాలి..

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ల నుంచి తనపై, తన కుటుంబంపై తీవ్ర ఒత్తిడి ఉందని.. అందువల్ల తాను వెల్లడించిన అంశాలపై వెంటనే దర్యాప్తు చేయాలని సుకేశ్ లేఖలో కోరారు. దర్యాప్తునకు తాను పూర్తిగా సహకరిస్తానన్నారు. తనకు, ఆమ్‌ఆద్మీ పార్టీ, అర్వింద్ కేజ్రీవాల్‌కు మధ్య అనేక రకాల ఒప్పందాలు, వ్యాపార లావాదేవీలు ఉన్నాయన్నారు. ఢిల్లీ మద్యం విధానంపై దర్యాప్తు కొనసాగుతున్నందున.. అందులో ప్రమేయమున్న ఆప్, కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవిత మధ్య సంబంధాలను ఈ చాటింగ్ వివరిస్తుందని.. దర్యాప్తునకు తోడ్పడుతుందని వివరించారు. ఆప్ సీనియర్ నేతలతో జరిపిన అన్ని లావాదేవీల వాయిస్ రికార్డులు, ఇతర చాటింగ్‌లను అందించడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా సొంతంగానే చాటింగ్‌ల వివరాలు అందిస్తున్నానని.. దీనిపై జోక్యం చేసుకోవాలని సీజేఐ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, కేంద్ర హోంమంత్రి, సీబీఐ, ఈడీ డైరెక్టర్లకు విజ్ఞప్తి చేశారు.

పౌరసరఫరాల సంస్థలో నలుగురు డైరెక్టర్ల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ బోర్డు డైరెక్టర్లుగా నలుగురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాగమణి (కాకినాడ రూరల్), పి.సుబ్బారెడ్డి (రాయచోటి), భోగడి సన్యాసిరావు (గాజువాక), టి.చంద్రశేఖర్ (విజయవాడ వెస్ట్) నియమితులయ్యారు. వీరు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్ల పాటు డైరెక్టర్లుగా కొనసాగుతారని పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ, కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సత్వరమే నాణ్యమైన వైద్య సేవల కల్పనపై దృష్టి

ఏపీవీవీపీ నూతన కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రజలకు సత్వరమే నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ఆస్పత్రుల్లో డాక్టర్లు, డ్రగ్స్, డయగ్నోస్టిక్స్, డైట్‌పై ప్రత్యేక దృష్టి ఉంచుతామని ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) నూతన కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇటీవల సాధారణ బదిలీల్లో కమిషనర్‌గా నియమితులైన వెంకటేశ్వర్ గొల్లపూడిలోని ఏపీవీవీపీ ప్రధాన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రాధాన్యత అంశాల్లో వైద్యం ఒకటన్నారు. గతంలో ఐటీడీఏ పీవోగా, జేసీగా పనిచేసిన తనకు ఆస్పత్రుల పనితీరుపై సమగ్ర అవగాహన ఉందని తెలిపారు.

'మార్గదర్శి' మోసాలివిగో

- చట్ట ఉల్లంఘనలపై దర్యాప్తు చేయండి
- జాతీయ దర్యాప్తు సంస్థలకు సీఐడీ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మోసాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు క్షుణ్నంగా విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం సూచించింది. మనీ లాండరింగ్, నిధుల స్వాహా, కార్పొరేట్ మోసాలు, బినామీ లావాదేవీలతో పన్ను ఎగవేత లాంటి కీలక అంశాలను తమ విచారణలో కనుగొన్న నేపథ్యంలో మరింత లోతుగా దర్యాప్తు చేయడం అవసరమని పేర్కొంది. సీఐడీ ఏడీజీ సంజయ్ బుధవారం ఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడారు. చిట్‌ఫండ్ పేరుతో జరిగిన అతిపెద్ద ఆర్థిక మోసాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అడ్డుకున్నట్లు వెల్లడించారు. చట్టవిరుద్ధంగా డిపాజిట్లు స్వీకరించిన చరిత్ర కలిగిన మార్గదర్శి చిట్ గ్రూప్ 1982 చిట్ ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి అమాయక చందాదారులను దోపిడీ చేస్తోందన్నారు. మార్గదర్శి ఉల్లంఘనలన్నీ కేంద్ర దర్యాప్తు సంస్థల పరిధిలో ఉన్నందున రెండు రోజుల పాటు ఢిల్లీలో ఆయా విచారణ సంస్థలను కలుసుకుని వివరాలు అందచేసినట్లు చెప్పారు. మోసపూరిత ఆర్థిక సంస్థలు చట్టాలను ఉల్లంఘిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ప్రేక్షకపాత్ర వహించరాదని సుప్రీంకోర్టు ఓ కేసు విచారణ సందర్భంగా వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు.

సత్యం, సహారా, శారదా తరహాలో..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఉల్లంఘనలు, మోసపూరిత పద్ధతులు సత్యం కంప్యూటర్స్, సహారా, శారదా చిట్స్ మోసాలకు చాలా దగ్గరగా ఉన్నట్లు సంజయ్ తెలిపారు. ఈ దోపిడీని అరికట్టేందుకు మార్గదర్శి ఖాతా పుస్తకాలపై లోతైన విచారణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ దిశలోనే తమ దర్యాప్తు కొనసాగుతోందని, తదుపరి వివరాలు తగిన సమయంలో వెల్లడిస్తామన్నారు.

రహస్యంగా నిధుల మళ్లింపు..

డిపాజిట్ల ద్వారా మార్గదర్శి సేకరించిన నిధులను అనుబంధ కంపెనీలు, షేర్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్ లాంటి ఇతర పెట్టుబడులకు రహస్యంగా మళ్లించడంతోపాటు అధిక మొత్తంలో సభ్యత్వాలు స్వీకరిస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడుతోందన్నారు. వడ్డీ, భద్రత అందించే పేరుతో చందాదారుల సొమ్మును మార్గదర్శి వద్దే ఉంచాలని బలవంతం చేయడం, 'చెక్స్ ఆన్‌హ్యాండ్, క్యాష్ ఆన్‌హ్యాండ్' పేరుతో నగదు నిల్వల్ని పెంచడం లాంటి మోసపూరిత అకౌంటింగ్ పద్ధతుల ద్వారా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. ఈమేరకు ఎఫ్‌ఐఆర్‌లలో ఏ–1గా మార్గదర్శి చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఏ–2గా కంపెనీ ఎండీ శైలజా కిరణ్, ఏ–3గా బ్రాంచి మేనేజర్లు, ఏ–4గా కంపెనీ, ఏ–5గా ప్రిన్సిపల్ ఆడిటర్ కె.శ్రవణ్ పేర్లను నమోదు చేసినట్లు తెలిపారు. ఏ–1 నుంచి ఏ–5 వరకూ అందరినీ ఒక్కోసారి ప్రశ్నించినా తప్పించుకునే సమాధానాలు వచ్చాయని చెప్పారు. అవసరమైన సమాచారం, పత్రాలను చిట్ రిజిస్ట్రార్, సీఐడీకి మార్గదర్శి ఇవ్వడం లేదన్నారు.

సీఐడీ ప్రాథమిక విచారణలో ఏం తేలిందంటే...

- ▲ చిట్‌ఫండ్ చట్టంలోని పలు నిబంధనలను మార్గదర్శి గ్రూప్ ఉల్లంఘించింది.
- ▲ చందాదారుల సొమ్మును హెచ్‌యూఎఫ్ నియంత్రిత సంస్థలకు మళ్లించింది.
- ▲ చట్ట విరుద్ధంగా చందాదారుల సొమ్మును ఎక్కువ రిస్క్ ఉన్న మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్‌కు మళ్లించారు.
- ▲ నాలుగు నుంచి ఐదు శాతం వార్షిక వడ్డీ రేటు అందిస్తూ భవిష్యత్తు సభ్యత్వాల రసీదు ముసుగులో అక్రమ డిపాజిట్లను బలవంతంగా తీసుకుంటోంది.
- ▲ చిట్‌ఫండ్ చట్టం 1982 ప్రకారం కంపెనీ బ్యాలెన్స్ షీట్, ఖాతాల వివరాలను అందించలేదు.
- ▲ ఖాతాలకు మసిపూసి మారేడు కాయ చేస్తూ అవసరమైన సమాచారాన్ని ఇవ్వడం లేదు.
- ▲ నిందితులు విచారణకు సహకరించకుండా వివిధ మార్గాల ద్వారా సీఐడీ పరువు తీయడం, నిందలు మోపేందుకు యత్నిస్తున్నారు.

'సుప్రీం' ఏం చెప్పిందంటే...

''చిట్ ఫండ్స్ చట్టాన్ని ప్రధానంగా చందాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు రూపొందించారు. కొన్ని మోసపూరిత ఆర్థిక సంస్థలు చందాదారులు/డిపాజిటర్లను మోసం చేయడమే కాకుండా నిధులను పక్కదారి పట్టించడం లేదా మళ్లించడం చేస్తున్నాయి. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వాల విధి. ప్రజల సంక్షేమానికి సంరక్షకుడిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం దీనికి పరిష్కారాన్ని కనుగొనకుండా మౌన ప్రేక్షకుడిగా ఉండరాదు'' అని శ్రీరామ్ చిట్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని సంజయ్ తెలిపారు.

పిటిషనే లేకుండా వాదనలా?



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేయకుండా మౌఖికంగా రిలీఫ్ కోరడాన్ని తప్పుబట్టింది. అప్లికేషన్ (పిటిషన్) దాఖలు చేస్తేనే వాదనలు వింటామని తేల్చి చెప్పింది. మార్గదర్శి కేంద్ర కార్యాలయంలో కొనసాగుతున్న తనిఖీలను ఆపాలని, బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టును మార్గదర్శి ఆశ్రయించింది. బుధవారం ఉదయం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఎదుట ఈ అంశాన్ని ప్రస్తావించగా.. రోజువారీ కేసుల విచారణకు ఇబ్బంది ఎదురవుతుందని, సాయంత్రం 4.30 గంటలకు దీన్ని మెన్షన్ చేయాలని ఆదేశించారు. సాయంత్రం విచారణ ప్రారంభం కాగానే మార్గదర్శి తీరును ఏపీ స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి తప్పుబట్టారు. 'ఉద్యోగుల నుంచి ఎలాంటి ప్రత్యేక అప్లికేషన్ లేకుండా రిలీఫ్ పొందాలని భావించడం సరికాదు. ఇది సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుంది. మౌఖికంగా ప్రస్తావించే వాటిని పరిగణలోకి తీసుకుని ఆర్డర్ ఇవ్వకూడదని గతంలో ఇదే కోర్టు ద్విసభ్య ధర్మాసనం (యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ ఎస్‌ఎం హుస్సేన్ రషీద్ కేసు) తీర్పునిచ్చింది. అత్యవసర పరిస్థితి అంటే.. ఉరితీత, భవనాలను కూల్చడం లాంటివి మాత్రమే. చిన్న అంశాలను మౌఖికంగా మెన్షన్ చేయడం సమర్థనీయం కాదు. తనిఖీలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటికే చాలా పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వానికి కౌంటర్ వేసే అవకాశం కూడా ఇవ్వకుండా ఆర్డర్ కోసం పట్టుబడుతున్నారు. చట్టపరంగా తనిఖీలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉంది. తనిఖీలు కొనసాగుతున్నప్పుడు కోర్టు జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు కూడా గతంలో ఆదేశించింది. తనిఖీలు పారదర్శకంగా సాగుతున్నాయి. ప్రజల నుంచి సేకరిస్తున్న నగదు నిర్వహణ నిబంధనల మేరకు జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకూడదనే ఈ చర్యలు చేపడుతున్నాం. పిటిషనర్ చెబుతున్నట్లుగా ఇతర రాష్ట్రాలకు సంబంధించిన ఎలాంటి డేటాను దర్యాప్తు అధికారులు సేకరించడం లేదు. కేసుకు సంబంధించి డేటా మాత్రమే తీసుకుంటున్నారు. గత నెల 21న కోర్టు ఆ పిటిషన్ వేసిన వారికి మాత్రమే రిలీఫ్ ఇచ్చింది. ఇది ఉద్యోగులందరికీ వర్తించదు' అని వాదనలు వినిపించారు. జీపీ వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం.. ఉద్యోగుల నుంచి ప్రత్యేక అప్లికేషన్‌తో రావాలని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ సమయంలో మార్గదర్శి తరఫు న్యాయవాది జోక్యం చేసుకునే ప్రయత్నం చేయగా.. 'ఇప్పటికే పలు పిటిషన్లలో అరెస్టు సహా బలవంతపు చర్యల నుంచి ఉపశమనం పొందారు. ఈ మౌఖిక ప్రస్తావనలో ఎలాంటి ఉపశమనం ఇవ్వలేం. పిటిషన్ దాఖలు చేస్తేనే వాదనలు వింటాం' అని ధర్మాసనం తేల్చిచెప్పింది.

'చెక్కు'తో చిక్కారు!

మార్గదర్శి ప్రధాన కార్యాలయంలో సీఐడీ విస్తృత సోదాలు

- చైర్మన్, ఎండీ, డైరెక్టర్ల హోదాలో అక్రమంగా నిధుల మళ్లింపు
- మార్గదర్శి ఆర్థిక అక్రమాలను ఈడీ, సీబీడీటీకి నివేదించిన సీఐడీ

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ దర్యాప్తు వేగవంతమైంది. మనీ లాండరింగ్‌కు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) దృష్టికి సీఐడీ తీసుకొచ్చింది. చట్టాలను ఉల్లంఘించి రామోజీరావు, ఆయన కుటుంబం పాల్పడుతున్న ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా వివరించింది. మరోవైపు సీఐడీ అధికారులు హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలో బుధవారం విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కొనసాగిన సోదాల్లో అక్రమ పెట్టుబడులు, చందాదారుల సొమ్ము నిబంధనలకు విరుద్ధంగా బదిలీకి సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. ప్రధానంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి శైలజ కిరణ్, సంస్థ డైరెక్టర్ల పాత్రకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంస్థ బ్యాలన్స్ షీట్లు, నగదు–చెక్కు వ్యవహారాలకు సంబంధించిన రికార్డులు, నిధుల మళ్లింపునకు సంబంధించిన రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో వెలుగు చూసిన ఆర్థిక అక్రమాలకు మూలం అంతా హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయమేనని వెల్లడైంది.

బెడిసికొట్టిన ఏ-1 రామోజీ, ఏ-2 శైలజ పన్నాగం

ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ–2గా ఉన్న చెరుకూరి శైలజ కిరణ్ ఈ కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నాలను సీఐడీ తాజా సోదాలతో అడ్డుకుంది. ఈ నెల 3న రామోజీరావును, శైలజను ఈ నెల 6న సీఐడీ అధికారులు విచారించిన విషయం విదితమే. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నుంచి నిధులు మళ్లించామని అంగీకరిస్తూనే ఆ వ్యవహారాలతో తనకు సంబంధం లేదని, అంతా బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) చూసుకుంటారని ఈ సందర్భంగా రామోజీరావు అడ్డగోలుగా వాదించారు. మరోవైపు శైలజా కిరణ్ కూడా అదే రీతిలో విచారణకు సహకరించకుండా సహాయ నిరాకరణ చేశారు.

అక్రమంగా బదిలీ చేసింది వారిద్దరే

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును అక్రమంగా మళ్లించింది సంస్థ చైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజా కిరణేనని సీఐడీ సోదాల్లో వెల్లడైంది. ఆ నిధులను రామోజీరావు కుటుంబానికి చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)– బెంగళూరు, మార్గదర్శి(తమిళనాడు)–చెన్నై సంస్థల్లోకి మళ్లించారు. కంపెనీ చైర్మన్ హోదాలో రామోజీరావు, ఎండీ హోదాలో శైలజతోపాటు డైరెక్టర్ల ఆమోదంతోనే ఆ నిధులు మళ్లించారనేందుకు కీలక ఆధారాలు సీఐడీకి లభ్యమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు కేసు దర్యాప్తులో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారని విశ్వసనీయ సమాచారం.

ఆ చెక్కులు ఎక్కడ..?

ఏటా సరిగ్గా.. మార్చి 31న రూ.వందల కోట్ల విలువైన చెక్కులు వస్తున్నట్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ తన బ్యాలన్స్ షీట్‌లో చూపిస్తోంది. 2022 మార్చి 31న కూడా రూ.550 కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్లు చూపించారు. కానీ నిర్ణీత 90 రోజుల్లోగా ఆ చెక్కులను నగదుగా మార్చడం లేదని సీఐడీ అధికారుల సోదాల్లో వెలుగులోకి వచ్చింది. చెక్కుల్లో చూపిస్తున్న నిధులను రామోజీ తన కుటుంబ ప్రయోజనాల కోసం అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపైనే సీఐడీ అధికారులు ప్రశ్నించడంతో శైలజా కిరణ్ షాక్‌కు గురయ్యారు. ఆ చెక్కులు నగదుగా మారాయో లేదో రికార్డులు తమ వద్ద లేవని చెప్పడంతో ప్రధాన కార్యాలయానికి వెళ్లి పరిశీలిద్దామని సీఐడీ అధికారులు సూచించారు. అందుకు ఆమె అంగీకరించకపోగా సీఐడీ అధికారులు అక్కడకు వెళ్లేందుకు కూడా సమ్మతించలేదు. ప్రధాన కార్యాలయంలోని కీలక రికార్డులను సీఐడీ పరిశీలించేందుకు శైలజా కిరణ్ ఒప్పుకోకపోవడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు బుధవారం నిర్వహించిన సోదాల్లో ఏటా బ్యాలన్స్ షీట్‌లో చూపిస్తున్న చెక్కులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అసలు చెక్కులు రావడంగానీ, వాటిని నగదుగా మార్చడం గానీ జరగడం లేదని గుర్తించారు.

నగదు రూపంలో ఏటా రూ.500 కోట్లు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిబంధనలకు విరుద్ధంగా ఏటా రూ.500 కోట్లను నగదు రూపంలో వసూలు చేస్తున్నట్లు బ్రాంచి కార్యాలయాల్లో గతంలో నిర్వహించిన సోదాల్లో వెలుగు చూసింది. కానీ ఆ నిధులను బ్రాంచి కార్యాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంలేదు. ఆ నగదు నిల్వలేవీ ప్రధాన కార్యాలయంలోని రికార్డుల్లో కూడా లేనట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. అంటే ఆ డబ్బులను నల్లధనం రూపంలో అక్రమంగా తరలిస్తున్నట్లు రూఢీ అయింది. అందుకు సంబంధించిన కీలక ఆధారాలు కూడా సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రామోజీ బెంబేలు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను సీఐడీ ఆధారాలతో సహా జాతీయ దర్యాప్తు సంస్థల దృష్టికి తేవడంతో ఈ కేసులో ఏ–1గా ఉన్న రామోజీరావు బెంబేలెత్తుతున్నారు. సీఐడీ దర్యాప్తుపై మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చిన ఆయన తొలిసారిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిట తాజాగా పత్రికా ప్రకటన జారీ చేశారు. ఈడీ, సీబీడీటీ దర్యాప్తు తప్పదేమోనన్న ఆందోళన అందులో వ్యక్తమైంది. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యకలాపాలు నిలిచిపోయాయని ఆ ప్రకటనలో అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏపీలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు ఏపీ ప్రారంభించడం లేదని పేర్కొనడం గమనార్హం.

భూసార పరీక్షలకు శ్రీకారం

- నేటినుంచి మండల స్థాయి శిక్షణ
- ఈ నెల 17 నుంచి ఆర్బీకే స్థాయిలో శాంపిళ్ల సేకరణ

సాక్షి, అమరావతి: గ్రామస్థాయిలో భూసార పరీక్షలకు అధికార యంత్రాంగం శ్రీకారం చుడుతోంది. జిల్లాస్థాయి అవగాహన సదస్సులు ముగియడంతో నేటి నుంచి (గురువారం నుంచి) మండలస్థాయిలో శిక్షణ ఇవ్వబోతున్నారు. జిల్లాస్థాయిలో 26 వర్కుషాపులను నిర్వహించిన అధికారులు మండలస్థాయిలో 637 వర్కుషాపులను నిర్వహించనున్నారు. మట్టి నమూనాలు ఎలా సేకరించాలి, ఎలాంటి పద్ధతులు పాటించాలి, ఎలా భద్రపర్చాలి, ల్యాబ్‌కు ఏ విధంగా పంపించాలి, ఫలితాలపై రైతులకు ఏ విధంగా అవగాహన కల్పించాలి, సిఫార్సు చేసిన ఎరువులను తగిన మోతాదులో వినియోగించేలా రైతులను ఏ విధంగా చైతన్యపర్చాలి.. వంటి అంశాలపై ఈ వర్కుషాపుల్లో అవగాహన కల్పిస్తున్నారు. మండలస్థాయి వర్కుషాపుల తరువాత ఈ నెల 17వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు ఆర్బీకే పరిధిలో గ్రామస్థాయిలో మట్టినమూనాలు సేకరిస్తారు. ప్రస్తుతం జిల్లాకు ఒకటి చొప్పున సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌ను అనుసంధానం చేశారు. నియోజకవర్గస్థాయిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లలో 127 చోట్ల భూసార పరీక్ష కేంద్రాలను ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో మే 1 తేదీ నుంచి ల్యాబ్‌ల సంఖ్య పెరగనుండడంతో ఆ మేరకు మట్టినమూనాల పరీక్షలు కూడా పెంచనున్నారు. నమూనాల వివరాల నమోదుకు ప్రత్యేకంగా సాయిల్ శాంపిల్ కలెక్షన్ ఫారాలను ఆర్బీకే సిబ్బందికి అందజేశారు. ఇందులో మట్టినమూనా సేకరించే ఆర్బీకే సిబ్బందితోపాటు రైతు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి.



దావలికవు మౌనం హేయమైనది.
నిశ్శబ్ద సత్యాలన్నీ విషతుల్యమే.
– జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, 13 ఏప్రిల్ 2023

'జ్యూస్' అన్వేషణకు అంకురార్పణ

ఈ విశాల విశ్వంలో మనం ఒంటరివాళ్లమా లేక మనలాగే మనుగడసాగించే బుద్ధిజీవులు వేరే గ్రహాలపై కూడా ఉన్నారా అన్న విచికిత్స ఈనాటిది కాదు. ఆ ప్రయత్నంలో గురువారం మరో అడుగు ముందుకుపడబోతోంది. యూరొపియన్ స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ) నేతృత్వంలో రూపొందిన 'జ్యూస్' (జూపిటర్ అయిసీ మూన్స్ ఎక్స్‌ప్లోరర్) అంతరిక్ష నౌక దక్షిణ అమెరికాలోని కౌరు దీవి నుంచి ఎనిమిదేళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని ప్రారంభించబోతోంది. 2031లో అక్కడికి చేరుకున్నాక గురుగ్రహానికున్న లెక్కకు మిక్కిలి చందమామల్లో మూడింటిని ఎంచుకుని వాటిల్లో జీవుల ఉనికి సంగతిని తేల్చడం ఈ అంతరిక్ష నౌక లక్ష్యం. అంగారక గ్రహం ఆవల జీవం ఉండటానికి ఏమాత్రం అవకాశం లేదని ఒకప్పుడు ఖగోళ శాస్త్రవేత్తలు నిర్ధారణకొచ్చారు. కానీ అంతటితో ఆగిపోతే మానవ జిజ్ఞాసకు అర్థం లేదు. 'వేరెక్కడో ఒక మహాద్భుతం తనను తాను వ్యక్తపరుచుకోవటానికి వేచిచూస్తూ వుండొచ్చ'ని ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త కార్ల్ సెగాన్ ఒక సందర్భంలో అన్నారు. ఒక్క ఖగోళ శాస్త్రం అనేమిటి...సమస్త రంగాల్లోనూ మానవాళి సాధిస్తున్న విజయపరంపరకు ఈ భావనే మూలం. 1990లో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా గురుగ్రహంపైకి ప్రయోగించిన గెలీలియో ఉపగ్రహం, ఈమధ్యకాలంలో శనిగ్రహానికి పోయిన కేసినీ ఉపగ్రహం శాస్త్రవేత్తల అంచనాలను తలకిందులు చేశాయి. గురుడు, శుక్రుడు, బుధుడు వంటి ఇతరేతర గ్రహాలపై జీవం ఉండక పోవచ్చుగానీ, గురుడు, అంగారకుడు మధ్య కనబడుతున్న చందమామలపై ఏదోమేర, ఏదో రూపంలో జీవం ఉండటానికి అవకాశం ఉన్నదని అవి పంపిన డేటా ఆధారంగా నిర్ధారణకొచ్చారు. ఆ తర్వాతే ఈ మూడు చందమామలనూ అన్వేషించాలన్న నిర్ణయానికొచ్చారు.

గ్రహాలన్నిటిలోనూ గురుగ్రహం చాలా పెద్దది. సంక్లిష్టమైనది కూడా. ఎందుకంటే దీనికి ఒకటీ రెండూ కాదు...ఏకంగా 92 చందమామలున్నాయి. వీటిలో కొన్ని వ్యతిరేక కక్ష్యలో కూడా తిరుగుతుంటాయి. అలాంటి చందమామల్లో పెద్దగా ఉండే యూరోపా, క్యాలిస్టో, గానిమీడ్ అనే మూడింటిని ఎంచుకుని వాటిచుట్టూ జ్యూస్ 35 ప్రదక్షిణలు చేస్తుంది. ఆ తర్వాత 2034లో గానిమీడ్ చుట్టూ నిర్దేశిత కక్ష్యలో కుదురుకుంటుంది. ఈ మూడు చందమామలూ మంచుతో నిండివున్నాయి. ఆ పొరల వెనక మహా సముద్రాలు నిక్షిప్తమైవున్నాయని శాస్త్రవేత్తల అంచనా. అదే నిజమైతే ఏదో రూపంలో అక్కడ జీవం ఉండటానికి ఆస్కారం ఉంటుంది. ముఖ్యంగా గానిమీడ్‌పై లవణసముద్రం ఉన్నదని గుర్తించారు. నిజానికి సూర్యకాంతి పడే అవకాశం లేదు గనుక ఈ మూడు చందమామల్లో జీవం ఉనికికి అవకాశం లేదు. కానీ గురుగ్రహానికుండే గురుత్వాకర్షణ ఆ లోటు తీరుస్తోంది. ఈ చందమామల్లోని సముద్రాలు వేడెక్కడానికి దోహదపడుతోంది. గురుగ్రహానికి మన దగ్గర బృహస్పతి అనే నామాంతరం ఉంది. పురాణాల్లో బృహస్పతి దేవగురువు. యాదృచ్ఛికమే కావొచ్చు గానీ... బృహస్పతికి ప్రీతిపాత్రమైన గురువారం రోజునే గురుగ్రహానికి జ్యూస్ ప్రయాణం కడుతోంది. నిజానికి ఇంతవరకూ గురుగ్రహం గురించి మానవాళికి తెలిసింది గోరంతే. దాన్ని దట్టంగా చుట్టుముట్టివుండే వాయుమేఘాలే అందుకు కారణం. అందులో అత్యధికం, అంటే...90 శాతం హైడ్రోజన్ అయితే, మిగిలిన పదిశాతంలో హీలియం, మీథేన్, గంధకం, అమోనియా వంటివి ఉన్నాయి. అయితే ఈ మూలకాల్లో ఎన్ని వాయురూపంలో ఉన్నాయో, మరెన్ని ఘనరూపం దాల్చాయో శాస్త్రవేత్తలు ఇంకా తేల్చలేదు. అసలు గురుగ్రహం నెన్నొసట సిందూరంలా ఎర్రగా మెరిసే బింబం ఒకటుంటుంది. దాని పరిమాణమే మన భూమి కన్నా మూడింతలు కాగా, అది కుదురుగా ఒకచోట ఉండక తిరుగాడుతుంటుంది. గురుగ్రహంపై నిత్యం రేగే పెను అలజడే ఇలా కనబడుతోందని శాస్త్రవేత్తలంటారు.

మనం భూమ్మీద క్షేమంగా ఉండగలుగుతున్నామంటే అది గురుగ్రహం చలవే. ఎందుకంటే భూమివైపు దూసుకొచ్చే గ్రహశకలాల్లో, ఉల్కల్లో చాలాభాగాన్ని గురుగ్రహం తనవైపు ఆకర్షించుకుని వాటివల్ల కలిగే కష్టనష్టాలను తానే భరిస్తుంటుంది. నిజానికి గురుగ్రహం చుట్టూ తిరుగాడుతున్న చందమామల్లో అనేకం అటువంటి గ్రహశకలాలే. ఇందులో ఒకటైన గానిమీడ్‌కు అయస్కాంత క్షేత్రం ఉన్నా, అది బుధుడి కన్నా చాలా పెద్దదైనా గురుడి ప్రభావానికి లోనై చందమామగానే మిగిలిపోయింది. గురుగ్రహం ఆనుపానులు రాబట్టేందుకు ఇంతవరకూ 4 అంతరిక్షనౌకలు వెళ్లాయి. 1972 మార్చిలో ప్రయోగించిన పయొనీర్-10 గురుగ్రహం చుట్టూ 2003 వరకూ చక్కర్లు కొడుతూనే ఉంది. ఆ తర్వాత దాన్నుంచి సంకేతాలు లేవు. మన సౌర వ్యవస్థను దాటి ముందు కెళ్లడానికి 1977లో ప్రయోగించిన వాయేజర్ గురుగ్రహాన్ని దాటుకుంటూ వెళ్తూ దాని ఛాయా చిత్రాలు పంపింది. ఆ తర్వాత 1990లో వెళ్లిన గెలీలియో, 2000లో వెళ్లిన కేసినీ వ్యోమనౌకలు సైతం గురుగ్రహ ఛాయాచిత్రాలు పంపాయి. ఇక 2016లో నాసా ప్రయోగించిన జునో అంతరిక్ష నౌక నిరుడు యూరోపా ఛాయాచిత్రాలు పంపింది. ఇప్పుడు జ్యూస్ ప్రదక్షిణలు చేయబోయే 3 చందమామల్లో యూరోపా ఒకటి. అది 2031–34 మధ్య యూరోపాను రెండుసార్లు, క్యాలిస్టోను 21సార్లు, గానిమీడ్‌ను 12 సార్లు చుట్టివస్తుంది. అంతరిక్ష నౌకలు పంపే డేటాలో కేవలం రంగుల పొందికే ఉంటుంది. వీటి ఆధారంగా అక్కడ ఏమేం వాయువులున్నాయో, మూలకాలున్నాయో అంచనా కొస్తారు. విశ్వరహఃపేటిక తెరుచుకోవాలంటే నిత్యం ప్రయోగాలు కొనసాగుతూనే ఉండాలి. ఖగోళ శాస్త్ర ఆవిష్కరణలు విశ్వానికి సంబంధించిన మన జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు విస్తృతపరుస్తుంటాయి.

డిజిటల్ అగ్రగామిగా భారత్!

ఆధార్, ఏకీకృత చెల్లింపు వ్యవస్థలు, డేటా పంపిణీ... ఈ మూడూ కలిసి భారత్‌ను 'ప్రపంచ డిజిటల్ అగ్రగామి'గా నిలబెట్టాయని 'స్టాకింగ్ ఆఫ్ ది బెనిఫిట్స్ : లెసన్స్ ఫ్రమ్ ఇండియాస్ డిజిటల్ జర్నీ' అనే శీర్షికతో తాజాగా విడుదల చేసిన కార్యాచరణ పత్రంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించింది. ఈ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని ఉపయోగించడం ద్వారానే భారత్ మహమ్మారి కాలంలో నిరుపేద కుటుంబాలకు చెప్పుకోదగిన వాటాతో మద్దతును వేగంగా అందివ్వగలిగిందని, డిజిటల్ అకౌంట్ అగ్రిగేటర్ ద్వారా ఆర్థిక సేవల సులభ సంప్రాప్యత నుంచి దాదాపు 45 లక్షల మంది వ్యక్తులు, కంపెనీలు లబ్ధి పొందారని, దీన్నింకా వేగంగా తమ సొంతం చేసుకుంటున్నారని ఆ పత్రం ప్రశంసించింది. అదే సమయంలో భారత్‌లో సమగ్ర డేటా రక్షణ చట్టం ఇప్పటికీ లేదని ఐఎమ్ఎఫ్ పత్రం పేర్కొంది. పౌరుల గోప్యతను కాపాడటానికి డేటా ఉల్లంఘనలకు పాల్పడిన వారిని జవాబుదారీగా చేయడానికి దృఢమైన డేటా పరిరక్షణ చట్టం రూపకల్పన తప్పనిసరి అని సూచించింది.

మానవ జీవితాలను, ఆర్థిక వ్యవస్థను మార్చివేస్తున్న ప్రపంచ స్థాయి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని భారతదేశం నిర్మించిందని, ఇది అనేక దేశాలు అనుసరించాల్సిన పాఠం అవుతుందని తాజా ఐఎమ్ఎఫ్ కార్యాచరణ పత్రం పేర్కొంది. 'ఇండియా స్టాక్' అనేది భారత్‌లో సాధారణంగా ఉపయోగిస్తున్న డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐలు) సెట్‌కి సామూహిక పేరు. దీంట్లో మూడు విభిన్నమైన పొరలు ఉంటున్నాయి. అవి, 1. ప్రత్యేక గుర్తింపు (ఆధార్), 2. కాంప్లిమెంటరీ చెల్లింపు వ్యవస్థలు (ఏకీకృత చెల్లింపు ఇంటర్‌ఫేస్, ఆధార్ పేమెంట్స్ బ్రిడ్జ్, ఆధార్ ఆధారిత పేమెంట్ సర్వీస్), 3. డేటా పంపిణీ (డిజీలాకర్, అకౌంట్ అగ్రిగేటర్). ఇవన్నీ కలిసి అనేక పబ్లిక్, ప్రైవేట్ సేవలకు.. ఆన్‌లైన్, కాగిత రహిత, నగదు రహిత, గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చే డిజిటల్ సంప్రాప్యతను కల్పించాయని 'స్టాకింగ్ ఆఫ్ ది బెనిఫిట్స్ : లెసన్స్ ఫ్రమ్ ఇండియాస్ డిజిటల్ జర్నీ' అనే శీర్షికతో కూడిన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కార్యాచరణ పత్రం తెలిపింది. ఈ మదుపు ప్రయోజనం భారత్ వ్యాప్తంగా అనుభవంలోకి రావడమే కాకుండా కోవిడ్ 19 మహమ్మారి కాలంలో దేశానికి ఎంతో సేవచేసిందని ఆ పత్రం వెల్లడించింది. ప్రభుత్వ ఖజానా నుంచి లబ్ధిదారుల బ్యాంక్ అకౌంటుకు నేరుగా సామాజిక భద్రతా చెల్లింపుల పంపిణీని సులభతరం చేయడంలో ఆధార్ సహకరించిందని అది పేర్కొంది. దీనివల్ల లీకేజీలను తగ్గించడం, అవినీతిని అరికట్టడం, విస్తృతిని పెంచడం, సమర్థంగా కుటుంబాల వద్దకు చేరుకోవడానికి ఒక సాధనాన్ని అందించడంలో ఇది సహకరించింది అని వ్యాఖ్యానించింది.



విస్తృతంగా డిజిటల్ చెల్లింపులు

డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇతర ప్రభుత్వ సంస్కరణల కారణంగా 2021 మార్చి వరకు జీడీపీలో 1.1 శాతం వ్యయాన్ని ఆదా చేసినట్లు భారత ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌ని ఉపయోగించడం ద్వారా భారత్ మహమ్మారి కాలంలో నిరుపేద కుటుంబాలకు చెప్పుకోదగిన వాటాతో మద్దతును వేగంగా అందించగలిగింది. మహమ్మారి ఆవహించిన తొలి నెలల కాలంలో నిరుపేద కుటుంబాల్లో 87 శాతం కనీసం ఒక లబ్ధి పథకాన్నయినా అందుకున్నారు. సృజనాత్మక ఆవిష్కరణను, పోటీని పెంచడానికి, మార్కెట్లను విస్తరించడానికి, ప్రభుత్వ ఆదాయ సేకరణను పెంచుకోవడానికి, ప్రభుత్వ వ్యయ సమర్థతను మెరుగుపర్చుకోవడానికి ఇండియా స్టాక్ ఒక ప్లాట్‌ఫామ్‌గా ఉపయోగపడింది. డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు సర్వవ్యాప్తమయ్యాయి. దేశంలో అన్ని చెల్లింపుల లావాదేవీల్లో యూపీఐ చెల్లింపులు 68 శాతంగా ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల ఉపయోగం చిన్న వర్తకుల కస్టమర్ పునాదిని విస్తరించింది, వారి నగదు ప్రవాహాన్ని నమోదు చేసి, ద్రవ్య సంప్రాప్యతను మెరుగుపర్చింది.

పెరిగిన ప్రభుత్వ రాబడి

2021 ఆగస్టులో మొదటిసారి ప్రారంభించినది మొదలు 'అకౌంట్ అగ్రిగేటర్' ద్వారా ఆర్థిక సేవల సులభ సంప్రాప్యత నుంచి దాదాపు 45 లక్షల మంది వ్యక్తులు, కంపెనీలు లబ్ధి పొందారని, దీన్ని వేగంగా తమ సొంతం చేసుకుంటున్నారని ఆ పత్రం తెలిపింది. డిజిటలీకరణ అనేది ఆర్థిక వ్యవస్థ అధికారికీకరణను కూడా బలపర్చింది. 2017 జూలై నుంచి 2022 మార్చి మధ్యలో జీఎస్టీ కోసం 88 లక్షల మంది కొత్త పన్ను చెల్లింపుదారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. దీంతో ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వ రాబడులు గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వ సర్వీస్ ప్రొవిజన్‌ను కూడా క్రమబద్ధీకరించారు. ఉదాహరణకు... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన డాక్యుమెంట్లను ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా పౌరులు పొందవచ్చు. అదేవిధంగా, ఇండియా స్టాక్ 'నో యువర్ కస్టమర్' నిబంధనలను డిజిటలీకరించి, సులభతరం చేసింది. ఖర్చులను తగ్గించింది. ఇ-కేవైసీని ఉపయోగిస్తున్న బ్యాంకులు సమ్మతి ఖర్చును 12 అమెరికా డాలర్ల నుంచి 6 అమెరికన్ సెంట్లకు తగ్గించుకున్నాయి.

మహిళలే లక్ష్యంగా జన్‌ధన్

ఖర్చుల్లో ఈ తగ్గుదల తక్కువ ఆదాయం ఉన్న క్లయింట్‌లు కొత్త ఉత్పత్తుల అభివృద్ధి కోసం సేవలను మరింతగా ఆకర్షిస్తూ, లాభాలు ఆర్జించడానికి వీలు కల్పించింది. ఆర్థిక అభివృద్ధిలో అందర్నీ భాగస్వామ్యం చేయడానికి సంబంధించి ఒక ఉదాహరణను ప్రస్తావిస్తూ ఆ పత్రం ఇలా చెప్పింది. ''తక్కువ ఖర్చుతో కూడిన బ్యాంక్ ఖాతాకు అవకాశం కల్పించడం వల్ల బ్యాంక్ ఖాతాలతో వ్యక్తుల కవరేజీ రెట్టింపు అయింది. జన్‌ధన్ పథకం ఆర్థికంగా అర్హత లేనివారిని, ప్రత్యేకించి గ్రామీణ మహిళలను లక్ష్యంగా చేసుకుంది. ఈ పథకం కింద 2022 ఆగస్టు నాటికి 46 కోట్లకు పైగా బ్యాంక్ ఖాతాలను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తెరిచారు. డిజిటల్ బ్యాక్‌బోన్‌ను ఉపయోగించడం వల్ల భారత్ తన వ్యాక్సిన్ పంపిణీని శరవేగంగా చేయగలడమే కాదు... భారీస్థాయి అంతర్గత వలసలు వంటి సవాళ్లను అధిగమించింది'' అని ఐఎమ్ఎఫ్ కార్యాచరణ పత్రం పేర్కొంది. కో-విన్‌లో పొందుపర్చిన టెక్నాలజీని ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, శ్రీలంక, జమైకాలలో కూడా అమలుపర్చారు. ఇది ఆయా దేశాల వ్యాక్సినేషన్ ప్రోగ్రాంను సులభతరం చేసింది.

డేటా పరిరక్షణ తప్పనిసరి

సవాళ్ల విషయానికి వస్తే, భారత్‌లో సమగ్ర డేటా రక్షణ చట్టం ఇప్పటికీ లేదని ఐఎమ్ఎఫ్ పత్రం పేర్కొంది. పౌరుల గోప్యతను కాపాడటానికి; కంపెనీలు, ప్రభుత్వాలు విచక్షణారహితంగా డేటా సేకరించడాన్ని నిరోధించడానికి; డేటా ఉల్లంఘనలకు పాల్పడిన కంపెనీలు, ప్రభుత్వాలను జవాబుదారీగా చేయడానికి దృఢమైన డేటా పరిరక్షణ చట్ట రూపకల్పన తప్పనిసరి. సముచితమైన రీతిలో డేటా నిర్వహణకు, సైబర్ భద్రత రంగంలో తగిన మదుపులు పెట్టడానికి ఇది చాలా అవసరం.

సామాజిక సహాయం మరింత దృఢంగా, స్వీకరించదగినదిగా చేసే ప్రయత్నాలకు మద్దతు ఇచ్చే విషయంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) కూడా సహకరిస్తుంది. ఉదాహరణకు, రాష్ట్రాల వ్యాప్తంగా వివిధ పథకాల మధ్య డేటా పంపిణీకి ఆధార్‌ను ఉపయోగించవచ్చని ఐఎమ్ఎఫ్ కార్యాచరణ పత్రం పేర్కొంది. చివరగా, డీపీఐ (డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)ని ప్రభావితం చేయడానికి కాలక్రమాలు, నాణ్యత, సాధారణ ప్రభుత్వ ద్రవ్య నివేదికల కవరేజీ వంటివాటిని భారత్ గణనీయంగా మెరుగుపర్చుకుంది. అదే సమయంలో తన పౌరుల కోసం ప్రభుత్వ రంగ జవాబుదారీతనాన్ని మెరుగుపర్చుకోవడంలో ద్రవ్యపరమైన పారదర్శకతను విస్తరించడం అనేది కీలక అంశంగా ఉంటోంది.

– ఎమ్. ముఖేశ్ రాణా,
ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మిల్లీ బాబీ బ్రౌన్



ఆ పిల్లకు 19. అప్పడే ఎంగేజ్‌మెంట్ అయిపోయింది! నాకు 24. బెడ్ మీద పడుకుని బనానా చిప్స్ తింటూ. 'పి ఈజ్ 19' హ్యాష్‌ట్యాగ్‌తో ఇండియాలో ట్రెండ్ అవుతున్న ట్వీట్స్ చూస్తున్నాను. ('స్ట్రేంజర్ థింగ్స్' నటి మిల్లీ బాబీ బ్రౌన్‌కు తన ప్రియుడు జేక్‌తో నిశ్చితార్థం జరిగిందన్న వార్తపై).

– రియా చోప్రా, కాలమిస్ట్

ఇంట్లో పెంచొచ్చు



భూతాపాన్ని నిరోధించడానికి చెట్లు, మొక్కలను నాటడమొక్కటే మార్గం. ఇంటి బయట మీకు తగినంత స్థలం లేకుంటే కనీసం ఇంటి లోపలైనా అలో వెరా, మాన్‌స్టెరా, మనీ ప్లాంట్ వంటి కొన్ని మొక్కలు పెంచండి.

– రితుపర్ణారాయ్, పర్యావరణ కార్యకర్త

ఎప్పుడూ వినే మాటలే!



నలంద, ససారాంలో ముస్లిం వ్యతిరేక హింసకు బీజేపీయే కారణం అని నితీశ్ కుమార్, తేజస్వీ యాదవ్ అంటున్నారు. మరి బిహార్ ప్రభుత్వం బీజేపీ / హిందుత్వ నాయకులపై ఏ విధమైన చర్యలు తీసుకుంది? వారిలో అరెస్టు చేసిన వ్యక్తుల జాబితాను వెల్లడించగలదా?

– ఆసిఫ్ ఖాన్, భారతీయ ముస్లిం

వచ్చీ రాగానే...



జపాన్ పర్యటన నుండి తిరిగి వచ్చిన ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఏ మాత్రం కాలయాపన చేయకుండా వెంటనే పనిలోకి దిగిపోయారు! వేడిగాలులు, ప్రజారోగ్య పరిస్థితులపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.

– డా॥ గోపబంధు దాస్, సీఎం ఓఎస్డీ

అతి తెలివి



భారీ ఎదురు దెబ్బ తగిలాక బాలీవుడ్ గాయకుడు లక్కీ అలీ తన వివాదాస్పద ఎఫ్‌బీ పోస్టుకు క్షమాపణలు చెప్పాడు. 'బ్రాహ్మణ' అనే పదం 'అబ్రహాం' లేదా 'ఇబ్రహీం' నుండి వచ్చిందని, బ్రాహ్మణులు ఇబ్రహీం వంశం వారని అలీ ఆ పోస్ట్‌లో రాశాడు.

– దీక్షా నేగీ, జర్నలిస్ట్

ప్రగతిశీల విద్యార్థి ఉద్యమ నిర్మాత

విద్యార్థి ఉద్యమాల గడ్డ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఒకనాడు విప్లవ విద్యార్థి ఉద్యమాలను నడిపించి, చివరకు అదే విశ్వవిద్యాలయంలో ఆధిపత్య ఉన్మాదశక్తులచే దారుణంగా హత్యచేయబడ్డ ప్రగతిశీల విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి. 'జీనా హైతో మర్నా సీఖో – కదం కదం పర్ లడ్నా సీఖో' జార్జిరెడ్డి సమర నినాదం. మరో ప్రపంచ స్వప్నాన్ని సాకారం చేసుకోవాలని, దోపిడీ, పీడన, అంటరానితనం, అసమానతల వ్యవస్థను కూల్చి, సమ సమాజ స్థాపన జరపాలని ఉవ్విళ్లూరుతోన్న ఎందరో విద్యార్థులకు పోరుకు రహదారులు వేశారు జార్జిరెడ్డి. చేగువేరా జీవితం, వియత్నాం ఉద్యమాలు జార్జిరెడ్డికి ప్రేరణగా నిలిచి ఎంతగానో ఆయన జీవితాన్ని ప్రభావితం చేశాయి. అందుకే జార్జిని అంతా 'హైదరాబాద్ చేగువేరా', 'ఉస్మానియా అరుణతార' అని పిలిచేవారు.



జార్జి రెడ్డి

1962 నుంచి 1972 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థి ఉద్యమాల్లో జార్జి రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆనాటి ఆధిపత్య విద్యార్థి రాజకీయాలకు, ఉస్మానియా యూనివర్శిటీలోని కుల, మత దురహంకారానికి వ్యతిరేకంగా జార్జి పోరాడారు. విద్యార్థి దశలోనే జార్జిరెడ్డి ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థులు (పీడీఎస్) ఏర్పాటు చేశారు.


ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులపై సంపన్న వర్గాలు, ఆధిపత్య వర్గాల విద్యార్థులు చేస్తున్న దాడులకు అడ్డుగా నిలిచారు. కేవలం ఉద్యమాలు మాత్రమే కాదు, చదువులోనూ జార్జిరెడ్డి తన ప్రతిభా పాటవాలు కనపరిచారు. ఫిజిక్స్‌లో పీజీ చేసి, గోల్డ్ మెడల్ సంపాదించుకున్నారు. ఉస్మానియాలోనే పరిశోధక విద్యార్థిగా ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ కూడా చేశారు. విద్యార్థి ఉద్యమాల ద్వారా సామాజిక అవగాహన పొందిన విద్యార్థులంతా జార్జిరెడ్డితో ముందుకు కదులుతున్నారని కొన్ని శక్తులు ఓర్వలేకపోయాయి. యూనివర్సిటీ విద్యార్థి రాజకీయాల్లో ముందుండి ఆర్ట్స్ కాలేజీ ఎన్నికల్లో జార్జిరెడ్డి బలపరిచిన వ్యక్తులు గెలుపొందడంతో ఆయనను భౌతికంగా నిర్మూలించడం ద్వారానే తమ ఆగడాలు, అకృత్యాలు సాగుతాయని నిర్ణయించుకున్నాయి. పథకం ప్రకారం విద్యార్థుల ప్రియతమ నాయకుడిని భౌతికంగా తొలగించాలని 1972 ఏప్రిల్ 14 సాయంత్రం ఇంజనీరింగ్ కాలేజీ ఎన్నికల ప్రచారానికి వెళ్లి తిరిగొస్తున్న సమయంలో ఒంటరిగా ఉన్న జార్జిపై 30 మందికి పైగా మతోన్మాద, అరాచక వాదులు దాడి చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ హాస్టల్ వద్ద కత్తులతో కిరాతకంగా పొడిచి హత్య చేశారు. ఆయన అమరులై 51 ఏళ్లు యింది. ఐదు దశాబ్దాలు గడిచినా జార్జి ఇంకా సజీవ జ్ఞాపకంగా, విప్లవ వేగుచుక్కలాగా పలువురి మస్తిష్కాలలో మెదు లుతున్నాడు. అసామాన్య త్యాగాలతో జార్జి వారసత్వాన్ని కొనసాగిస్తున్న ప్రగతిశీల విప్లవ విద్యార్థి శక్తులు శాస్త్రీయ విద్యావిధానాన్ని సాధించే లక్ష్యంగా పోరాటాలు చేస్తున్నాయి.

జార్జి రెడ్డిని అంతమొందించిన మతోన్మాద మూకలు రాజ్యాధికారంతో, ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడం కోసం రాజ్యాంగ సంస్థలైన సీబీఐ, ఈడీలను ఉసిగొల్పుతున్నాయి. అన్యాయమే న్యాయమై రాజ్యమేలుతున్న తరుణంలో న్యాయాన్ని గెలిపించుకోవడం కోసం, నిబద్ధతతో నిలబడడం కోసం ప్రగశీల శక్తులు కలిసి పోరాడటమే జార్జి రెడ్డికి అర్పించే నిజమైన నివాళి.

– నామాల ఆజాద్,
పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
మొబైల్: 94407 58760

నానాటికీ తీసికట్టుగా... మన ఔన్నత్యం

అభిప్రాయం



సి. రామచంద్రయ్య


పార్లమెంట్ సమావేశాలు ఒక తంతుగా, మొక్కుబడిగా సాగడం ఓ రివాజుగా మారి చాలాకాలం అయింది. ఇటీవల అర్ధంతరంగా ముగిసిన బడ్జెట్ సమావేశాలు ఆ సంప్రదాయాన్ని కొనసాగించాయి. పార్లమెంట్ అధికారిక లెక్కల ప్రకారం 134 గంటల పాటు జరగాల్సిన లోక్‌సభ సమావేశాలు కేవలం 46 గంటలపాటు, 130 గంటలపాటు నిర్వహించాల్సిన రాజ్యసభ సమావేశాలు అతి తక్కువగా 31 గంటలపాటు జరిగాయి. లోక్‌సభ ప్రొడక్టివ్ (ఉత్పాదకత) పని 34 శాతం కాగా, రాజ్యసభ ఉత్పాదకత 24.4 శాతం మాత్రమే. 6 బిల్లులు ఉభయ సభల ఆమోదం పొందాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో ఇంత తక్కువ సంఖ్యలో బిల్లులు ఉభయ సభల ఆమోదం పొందడం చాలా అరుదు. ముఖ్యంగా ద్రవ్య వినిమయ బిల్లుపై అతి తక్కువ చర్చ జరిగింది. 12 నిమిషాలలో రూ. 50 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఆమోదింపజేసుకొన్నారని విపక్షనేతలు విమర్శించడంలో అర్థం ఉంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించే సమయంలో దేశానికి అమెరికా తరహా ప్రజాస్వామ్యం ఉండాలా, లేక బ్రిటిష్ తరహా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం మంచిదా అనే చర్చ జరిగింది. మెజారిటీ నేతలు, మేధావులు భారతదేశానికి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమే ఉత్తమమని తేల్చి దానికే మొగ్గు చూపారు. ఎందుకంటే, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు చట్టసభలలో ప్రజలవాణిని వినిపిస్తారనీ, ఫలితంగా చట్టసభల ప్రయోజనం నెరవేరుతుందనీ భావించారు.

చట్టసభల ప్రయోజనంపై పాలకపక్షానికి స్పష్టత ఉండాలి. చట్టసభల్లో సభ్యుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలి. దానినే కలెక్టివ్ విజ్‌డమ్ (సమిష్టి జ్ఞానం) అంటారు. పార్టీల సిద్ధాంతాలు, విధానాలు వేర్వేరు అయినప్పటికీ ప్రజల విశాల ప్రయోజనాలకు సంబంధించి అన్ని పార్టీలూ కొన్ని అంశాలపై ఏకాభిప్రాయానికి వస్తాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని గొప్పతనం అదే. కానీ, తమమాట మాత్రమే నెగ్గాలన్న ధోరణి పాలక పార్టీలో ఉన్న ప్పుడు, పట్టు విడుపులు లేకుండా తమ మాటనే నెగ్గించుకొన్నప్పుడు పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఉద్దేశ్యమే దెబ్బతిన్నట్టు కాదా?

'అదానీ' వ్యవహారాన్నే తీసుకొంటే... హిండెన్‌బర్గ్ నివేదిక దరిమిలా 'అదానీ' వ్యవహారంలో 'జాయింట్ పార్లమెంటరీ కమిటీ' (జేపీసీ)ని వేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. బీజేపీ ప్రభుత్వం అందుకు నిరాకరించింది. పైగా, గతంలో ఎన్నడూలేని విధంగా పార్లమెంట్ ఉభయసభలను పాలకపార్టీ సభ్యులే అడ్డుకోవడం ఓ వింత. ఓ వ్యక్తి లోక్‌సభకో, రాజ్యసభకో ఎన్నిక కావాలంటే దానికి సుదీర్ఘ ప్రక్రియ అవసరం అవుతోంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, ఎంతోమంది సహాయ సహకారాలతో ఎన్నికయ్యే వ్యక్తి.. లోక్‌సభలో పట్టుమని 45 గంటలైనా కూర్చొని పార్లమెంట్ బిజినెస్‌లో భాగస్వామి కాకపోతే, కలిగే ప్రయోజనం ఏముంటుంది?

కనీస స్థాయిలో కూడా చర్చలు జరక్కుండానే బిల్లులు చట్టాలుగా రూపొందితే అవి ప్రజల పాలిట శాపాలుగా మారతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఉదాహరణకు వివాదాస్పద వ్యవసాయ బిల్లుల్ని అడ్డుకోవడం వల్లనే అవి చట్టాలు కాలేకపోయాయి. ఒకవేళ, అవి చట్టాలుగా రూపొంది ఉంటే దేశ రైతాంగం ఏమయ్యి ఉండేది? చర్చలకు కేటాయించే సమయం ఇటీవల కాలంలో తగ్గిపోయింది.



మన పార్లమెంటరీ వ్యవస్థ బ్రిటిష్ తరహా విధానాన్ని పోలి ఉన్నప్పటికీ... బ్రిటన్ అనుసరిస్తున్న విధానాలు మనవద్ద లేవు. బ్రిటన్ పార్లమెంట్‌లో ప్రతిపక్షాల చర్చలకు ప్రత్యేకంగా 20 రోజులు కేటాయించే అవకాశాన్ని వారి రాజ్యాంగం కల్పించింది. 20 రోజుల్లో ప్రధాన ప్రతిపక్షానికి 17 రోజులు; ఇతర విపక్ష పార్టీ సభ్యులకు 3 రోజులు కేటాయిస్తారు. ఇక సభలో చర్చించే అంశాలను మన వద్ద స్పీకర్ సమక్షంలో బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) నిర్ణయిస్తుంది. బీఏసీలో అధికార పార్టీ, విపక్ష పార్టీల వారు ఉంటారు. పరస్పర అంగీకారంతో ఎజెండాను రూపొందించడం సంప్రదాయంగా వస్తోంది. కానీ, బ్రిటన్‌లో విపక్షాలు తమ ఎజెండాను తామే నిర్ణయించుకొంటాయి. అంతేకాదు 40 మంది సభ్యులు కనుక ఓ అంశాన్ని తీసుకొని దానిపై చర్చించాలని స్పీకర్‌కు నోటీసు ఇస్తే దానిని స్పీకర్ తిరస్కరించడానికి వీలు లేదు. అలాగే కొన్ని దేశాలలో ప్రజాప్రతినిధులు తగిన కారణం లేకుండా చట్టసభలకు హాజరు కాకపోతే, వారిపై చర్యలు తీసుకొనే విశిష్టాధికారాలు చట్ట సభలకు ఉన్నాయి. చట్టసభలు క్రియాశీలకంగా ఉన్న దేశాలలో ప్రజా స్వామ్యం పరిపుష్టం అవుతోంది. 'నో వర్క్ నోపే' అనే విధానం పలు దేశాలలో అమలు అవుతోంది. పైగా, ఎన్నో అంశాలపై, బిల్లులపై క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి పార్లమెంటరీ కమిటీలు ఉంటాయి.

ప్రభుత్వంలో పారదర్శకత లేకుంటే, పార్లమెంట్ పని సజావుగా సాగదు. గుప్పిట మూసివుంచే విధానాలను అమలు చేసే ప్రభుత్వాలు పార్లమెంట్‌ను పరిగణనలోకి తీసుకోవు. నిజానికి, కేంద్రంలో సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అనుసరించిన లోప భూయిష్ఠ విధానాల వల్లనే పార్లమెంట్ ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది.

అయితే, పార్లమెంట్ ఔన్నత్యం నిలబెడతామని, రాజ్యాంగం దిక్సూచిగా చట్టసభలను నడుపుతామని ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఔన్నత్యాన్ని నిలబెట్టడానికి అన్ని పార్టీల సూచనలు, సలహాలు కోరుతూ 2016లో ప్రత్యేకంగా 2 రోజుల పాటు పార్లమెంట్ సమావేశాలు నిర్వహించారు. కానీ, ఇపుడు ఎన్డీఏ-2 పాలనలో పార్లమెంట్ ఔన్నత్యం పడిపోతోంది. బిల్లులు ఎక్కువగా గిలెటిన్ అవుతున్నాయి. సభలు అర్ధంతరంగా, నిరవధికంగా వాయిదా పడటం ఎక్కువైంది. ఇక, లోక్‌సభలో కంటే పెద్దల సభగా పిలవబడే రాజ్యసభలోనే అర్థవంతమైన చర్చకు ఆస్కారం ఉంది. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, విద్యావంతులను రాజ్యసభకు పంపిన సమయంలో... మన రాజ్యసభ ప్రపంచానికే ఆదర్శప్రాయంగా నిలిచిందంటే అతిశయోక్తి కాదు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

దేశంలో ప్రైవేటీకరణ మొదలయ్యాక... వివిధ కీలకరంగాలలో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పిస్తూ నిర్ణయాలు తీసుకొంటున్న నేపథ్యంలో, వాటిపై ర్యాసభలో కూలంకషంగా చర్చ జరిగినపుడే ప్రజల ప్రయోజనాలు కాపాడబడతాయి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎప్పుడైతే ఓ తంతుగా, తమాషాగా మారిపోయిందో, అప్పటి నుంచే సామాన్య ప్రజల్లో ప్రజా ప్రతినిధుల పట్ల గౌరవం సన్నగిల్లి పోయింది.

పార్లమెంట్ ప్రాముఖ్యతను తగ్గించకుండా తగిన కార్యాచరణను రూపొందించడంలో అన్ని రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉండాలి. లేదంటే పార్లమెంట్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుంది.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.అష్టమి రా.12.24 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.9.51 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: సా.5.20 నుండి 6.50 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.55 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.11.

ఏయూలో ఐసీడీటీ కేంద్రం ప్రారంభం

డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణకు ఏర్పాట్లు



ఏయూ విద్యార్థినులతో కలిసి ఐసీడీటీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ(ఐసీడీటీ) విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ ఇస్తుందని ఏయూ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఏయూ హెలీపాడ్ గ్రౌండ్‌ను ఆనుకుని నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీడీటీ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రోసిస్ టెక్నాలజీస్ భాగస్వామ్యంతో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తొలిసారిగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డ్రోన్ సాంకేతికతపై శిక్షణ, నిర్వహణ, తయారీ అంశాలపై పరిశోధనలు చేసే కేంద్రంగా దీనిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ఏయూలో ఏ కోర్సు చదివే విద్యార్థులైనా ఇక్కడ అందించే కోర్సులలో చేరి తమ నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య శశిభూషణరావు, శ్రీనివాసరావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు, సెంటర్ సీఈవో వెంకటసతీష్ పాల్గొన్నారు.

నకిలీ నోట్ల డిపాజిట్ కేసులో ఇద్దరు అరెస్ట్

- మరో రూ.35,500 విలువైన నకిలీ నోట్లు స్వాధీనం
- నిందితుల్లో ఒకరు రవాణా శాఖలో కానిస్టేబుల్



సవర ప్రమోద్



అమృతసాగర్

టెక్కలి రూరల్ : ఏటీఎం డిపాజిట్ మెషీన్‌లో నకిలీ నోట్లు డిపాజిట్ చేసిన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిలో ఒకరు రవాణాశాఖలో కానిస్టేబుల్. గత నెల 29న శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో యాక్సిస్ బ్యాంక్ డిపాజిట్ మిషన్‌లో రూ.44వేలు విలువైన 88 నకిలీ ఐదువందల నోట్లు డిపాజిట్ చేయగా.. అవి యంత్రంలోని రిజక్ట్ బాక్సులోకి వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సీసీ ఫుటేజ్, బ్యాంకు అకౌంట్ ద్వారా నిందితులు టెక్కలి కోదండరామ వీధికి చెందిన పట్నాన అమృతసాగర్, శ్రీనివాస నగర్‌కు చెందిన సవర ప్రమోద్ (పాలకొండ రవాణా శాఖలో కానిస్టేబుల్)గా గుర్తించినట్లు టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. వీరిని బుధవారం అరెస్ట్ చేసి వారి ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. అక్కడ రూ.35,500 విలువైన నకిలీ రూ.500 నోట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా పలాసకు చెందిన ఓ వ్యక్తి ద్వారా నోట్లు వచ్చినట్లు తెలిపారు. అనంతరం వీరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

స్టీల్‌ప్లాంట్ సందర్శించిన సింగరేణి అధికారులు



స్టీల్‌ప్లాంట్ కోక్ఓవెన్ విభాగంలో సింగరేణి అధికారులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాలను తెలంగాణకు చెందిన సింగరేణి అధికారులు బుధవారం సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ విడుదల చేసిన ఈవోఐ అంశంపై మంగళవారం స్టీల్ ప్లాంట్‌కు వచ్చిన సింగరేణి డైరెక్టర్లు, జీఎంల బృందం ఉక్కు డైరెక్టర్లతో సమావేశమైన విషయం విదితమే. రెండో రోజు పర్యటనలో భాగంగా వారు స్టీల్ ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్, అవార్డు గ్యాలరీలను తిలకించారు. పీపీఎం విభాగాధిపతి డాక్టర్ జి.రమాదేవి వారికి ప్లాంట్ లేఅవుట్, ముడి పదార్థాలు, ఉత్పత్తుల రవాణా గురించి వివరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సాధించిన అవార్డులను పరిశీలించారు. అనంతరం వారు కోక్ఓవెన్స్, బ్లాస్ట్‌ఫర్నేస్, స్టీల్ మెల్ట్ షాప్-2, స్ట్రక్చరల్ మిల్ విభాగాల్లో పర్యటించి అక్కడ ఉత్పత్తి ప్రక్రియను గమనించారు.

పోలవరం ఎఫ్ఆర్ఎల్ సర్వేరాళ్లు 2008లోనే ఏర్పాటు

విభజన నేపథ్యంలో ఆ రికార్డులు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయన్న పోలవరం సీఈ సుధాకర్‌బాబు



- వాటిని సమీకరించి పీపీఏకు అందజేస్తామని స్పష్టీకరణ
- ముంపు ప్రభావంపై నివేదిక, రికార్డులు పీపీఏ ద్వారా ఏపీకి ఇచ్చిన తెలంగాణ అధికారులు
- వాస్తవాలను ఏపీ దాస్తోందని, అందువల్లే రికార్డులు ఇవ్వడం లేదని తెలంగాణ ఈఎన్‌సీ ఆరోపణ
- ఎఫ్ఆర్ఎల్ మ్యాప్, సర్వే రాళ్లకు సంబంధించిన రిపోర్టు సీడబ్ల్యూసీ, తెలంగాణ వద్ద ఉందన్న పోలవరం సీఈ
- వాస్తవాలను దాయాల్సిన అవసరం ఏపీ ప్రభుత్వానికి లేనేలేదని స్పష్టీకరణ
- ఈనెల 14న ఎఫ్ఆర్ఎల్ మ్యాప్, సర్వే రాళ్ల నివేదిక ఇస్తామని వెల్లడి
- ఆ తర్వాత రెండు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్న పీపీఏ సభ్య కార్యదర్శి

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో గరిష్ట మట్టం (ఎఫ్ఆర్ఎల్) 45.72 మీటర్ల స్థాయిలో నీరు నిల్వ చేసినప్పుడు ముంపునకు గురయ్యే ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో 2008లోనే గుర్తించి, సర్వేరాళ్లు ఏర్పాటుచేశామని తెలంగాణ అధికారులకు ఆ ప్రాజెక్టు సీఈ సుధాకర్‌బాబు మరోసారి తేల్చిచెప్పారు. ఇందుకు సంబంధించిన రికార్డులు ఈనెల 14లోగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి ఇస్తామన్నారు. ఆ రికార్డులను పరిశీలించాక కూడా ఏమైనా అనుమానాలుంటే క్షేత్రస్థాయిలో ఎఫ్ఆర్ఎల్ సర్వేరాళ్లను చూపించడానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. ఎఫ్ఆర్ఎల్ మ్యాప్, ముంపు ప్రాంతాల్లో వేసిన సర్వేరాళ్ల (అక్షాంశాలు, రేఖాంశాలతో కూడిన) వివరాలను ఏపీ ప్రభుత్వం అందజేశాక మరోసారి సమావేశం నిర్వహిస్తామని పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం రెండు రాష్ట్రాల అధికారులకు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ (వెనుక జలాలు) ప్రభావం వల్ల ముంపుపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేయడానికి ఈ నెల 3న కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోహ్రా అధ్యక్షతన సాంకేతిక కమిటీ మూడోసారి సమావేశమైంది. గోదావరికి గరిష్ఠంగా 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందనే అంచనాతో పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై సీడబ్ల్యూసీ అధ్యయనం చేసిందని, అందులో ఎలాంటి ముంపు ముప్పు ఉండదని తేలిందని ఎత్తిచూపుతూ ఛత్తీస్‌గఢ్, ఒడిశా అభ్యంతరాలను తోసిపుచ్చారు. సుప్రీంకోర్టు గతంలో గోపాలకృష్ణన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సాధికార కమిటీ కూడా సీడబ్ల్యూసీ అధ్యయన నివేదికనే ఖరారు చేసిందని గుర్తుచేశారు. పోలవరం ఎఫ్ఆర్ఎల్‌పై ఏపీ, తెలంగాణ అధికారులు అధ్యయన నివేదికలను మార్చుకుని, చర్చించి.. తెలంగాణ అభ్యంతరాలను నివృత్తి చేయాలని పీపీఏను సీడబ్ల్యూసీ చైర్మన్ వోహ్రా ఆదేశించారు. ఆ మేరకు బుధవారం పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం రెండు రాష్ట్రాల అధికారులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఏపీ తరఫున పోలవరం సీఈ సుధాకర్‌బాబు, ఎస్ఈ నరసింహమూర్తి, తెలంగాణ తరఫున ఈఎన్‌సీ కె.నాగేంద్రరావు, ఆ రాష్ట్ర అంతర్‌రాష్ట్ర జలవనరుల విభాగం అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మరోసారి భేటీ..

పోలవరం ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ మ్యాపు, సర్వేరాళ్లకు సంబంధించిన రికార్డులు ఏపీ అధికారులు అందజేసిన తర్వాత.. రెండు రాష్ట్రాల అధికారులతో భౌతికంగా సమావేశం నిర్వహించాలని తెలంగాణ ఈఎన్‌సీ నాగేంద్రరావు చేసిన ప్రతిపాదనను పీపీఏ సభ్య కార్యదర్శి రఘురాం ఆమోదించారు. ఏపీ అధికారులు ఇచ్చే రికార్డులను తెలంగాణ అధికారులకు పంపుతామన్నారు. ఆ తర్వాత రెండు రాష్ట్రాల అధికారులతో చర్చిస్తామని చెప్పారు. అప్పటికీ తెలంగాణ సర్కార్ సంతృప్తి చెందకపోతే.. ఎఫ్ఆర్ఎల్ రాళ్లను క్షేత్రస్థాయిలో చూపించడానికి సంయుక్తంగా వెళదామని ఆయన పేర్కొన్నారు.

ఎఫ్ఆర్ఎల్ అందరికీ తెలిసిందే..

పోలవరం ఎఫ్ఆర్ఎల్ పరిధిలోకి కిన్నెరసాని, ముర్రేడు వాగులతోపాటు మరో ఆరువాగులు వస్తాయని.. వాటిలోకి బ్యాక్‌వాటర్ ఎగదన్ని తమ రాష్ట్రంలో బూర్గుంపహాడ్ మండలంలో 899 ఎకరాల భూమి ముంపునకు గురవుతోందని తెలంగాణ ఈఎన్‌సీ నాగేంద్రరావు చెప్పారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పీపీఏ ద్వారా ఏపీ అధికారులకు అందజేశారు. కిన్నెరసాని, ముర్రేడువాగులపై పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సీడబ్ల్యూసీ అధ్యయనం చేసిందని, ఆ నివేదిక తెలంగాణ అధికారుల వద్ద కూడా ఉందని పోలవరం సీఈ సుధాకర్‌బాబు గుర్తుచేశారు. పోలవరం ఎఫ్ఆర్ఎల్‌ను 2008లోనే గుర్తించి.. ముంపునకు గురయ్యే ప్రాంతాలను అక్షాంశాలు, రేఖాంశాలతో గుర్తించి.. సర్వేరాళ్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులు రాష్ట్ర విభజన నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్నాయని, వాటిని సమీకరించి ఈనెల 14న అందజేస్తామని చెప్పారు. దీనిపై తెలంగాణ ఈఎన్‌సీ స్పందిస్తూ పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల ముంపు ప్రాంతంపై ఏపీ ప్రభుత్వం వాస్తవాలను దాచేస్తోందని, అందువల్లే రికార్డులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎఫ్ఆర్ఎల్‌కు సంబంధించిన రికార్డులన్నీ సీడబ్ల్యూసీ వద్ద, తెలంగాణ అధికారుల వద్ద ఉన్నాయని.. వాస్తవాలను దాచాల్సిన అవసరం తమకు లేదని పోలవరం సీఈ సుధాకర్‌బాబు స్పష్టం చేశారు. బూర్గుంపహాడ్‌లో ముంపునకు గురయ్యే 899 ఎకరాల భూమిని కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిందని, దాన్ని ఏపీకి అప్పగించే ప్రక్రియలో జాప్యం జరుగుతోందని గుర్తుచేశారు.

ఆస్తులు కూడబెడతామని రూ.10 కోట్లు కాజేశారు

- అన్న, తమ్ముడు, అక్కా, బావపై ఎన్ఆర్ఐ ఆరోపణ
- డబ్బులు అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారు



మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట(తిరుపతి జిల్లా): ఆస్తులు కూడబెడతామని తనను తన అన్న, తమ్ముడు, అక్కా, బావ రూ.10 కోట్లకు మోసం చేశారని ఎన్ఆర్ఐ మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేణిగుంట మండలంలోని కొత్రమంగళంలో బుధవారం ఆయన విలేకరుల ఎదుట తన ఆవేదన వ్యక్తం చేశారు. తాను 23 ఏళ్ల కిందట అమెరికాలో స్థిరపడి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని కొత్రమంగళం మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు అయిన తన సోదరుడు దామోదర్‌రెడ్డి, మరో సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి, సోదరి గంపా ఉషారాణి, బావ గంపా వెంకటరమణారెడ్డి తదితరులు తిరుపతి చుట్టుపక్కల భూముల ధరలు విపరీతంగా పెరిగాయని, ఇక్కడ ఆస్తులు కూడబెడతామని నమ్మించి విడతల వారీగా తన వద్ద నుంచి రూ.10 కోట్లు వరకు బ్యాంకు ద్వారా వేయించుకున్నట్లు తెలిపారు. అయితే తాను స్వస్థలానికి వచ్చి పంపిన రూ.10కోట్లకు సంబంధించిన ఆస్తుల గురించి అడిగితే ఏమీ లేవని, ఎక్కువ మాట్లాడితే చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తన వద్ద ఉన్న ఆధారాలతో ఇప్పటికే కోర్టు ద్వారా కేసు పెట్టానని, అలాగే రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేయడంతో విచారణ జరుగుతోందన్నారు.

నేడు కేంద్ర ఉక్కు సహాయమంత్రి విశాఖ రాక

- స్టీల్‌ప్లాంట్ అధికారులు, యూనియన్లతో చర్చలు
- విశాఖపట్నం పోర్టు సందర్శన

సాక్షి, విశాఖపట్నం/ఉక్కునగరం : కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే విశాఖపట్నంలో గురువారం పర్యటించనున్నారు. ఉదయం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్న మంత్రి ఫగ్గన్ సింగ్ పోర్టు కళావాణి ఆడిటోరియంలో నిర్వహించే రోజ్‌గార్‌మేళాలో పాల్గొననున్నారు. అనంతరం విశాఖపట్నం పోర్టు అథారిటీని సందర్శించి.. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి మధ్యాహ్నం 3 గంటలకు ముందుగా స్టీల్ ప్లాంట్ అధికారులతో సమావేశం కానున్నారు. 45 నిమిషాల పాటు ప్రస్తుత పరిణామాలపై చర్చించనున్నారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ యూనియన్ ప్రతినిధులతోనూ 30 నిమిషాల పాటు చర్చించి.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వారి అభిప్రాయాల్ని సేకరించనున్నారు. అనంతరం రాత్రి తిరిగి న్యూఢిల్లీకి పయనం కానున్నారు. ఫగ్గన్ సింగ్‌తో సమావేశం ఉన్న నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్‌ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నదే ప్రధాన లక్ష్యంగా ముక్త కంఠంతో ఉక్కు కార్మిక సంఘాల ప్రతినిధులు నినదించనున్నారు. కానిపక్షంలో ప్రభుత్వ రంగ సంస్థల్ని మాత్రమే బిడ్‌లో పాల్గొనేలా చూడాలనీ.. ఉక్కు రంగంలో పోటీదారులైన జేఎస్‌డబ్ల్యు, జేఎస్‌పీఎల్, భూషణ్ స్టీల్స్, ఎస్సార్ తదితర సంస్థలకు బిడ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వకూడదన్న డిమాండ్‌ని కూడా కేంద్ర మంత్రి ముందు ఉంచనున్నారు.

కొమ్మకొమ్మకూ తేనెపట్టు



ఒకే చెట్టుకు 300 పట్లు

సాధారణంగా చెట్లు, కొమ్మలకు ఒకటి, లేదా రెండు తేనెపట్లు పడుతుంటాయి. కానీ అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం ఆర్వీనగర్ సమీపంలోని బాడితపాకలులో ఒక రావి చెట్టుకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు వందలకు పైగా తేనెపట్లు పట్టి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ చల్లని వాతావరణమే దీనికి కారణమని గిరిజనులు చెబుతున్నారు. అవే తమ ఆదాయ వనరుగా పేర్కొంటున్నారు.

-గూడెంకొత్తవీధి(అల్లూరి సీతారామరాజు జిల్లా)

కైలాసగిరుల్లో అగ్నికీలలు

- కిలోమీటర్ మేర అగ్నికి ఆహుతైన వృక్ష సంపద
- ఆర్పడానికి ప్రయత్నిస్తున్న అగ్నిమాపకశాఖ, ఆలయ ఉద్యోగులు



కైలాసగిరుల్లో ఎగసిపడుతున్న మంటలు

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థం నుంచి 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కైలాసగిరుల్లో బుధవారం సాయంత్రం అగ్నికీలలు చెలరేగాయి. కిలోమీటర్ మేర భారీగా మంటలు వ్యాపించి వృక్ష సంపద కాలిపోయింది. ఎండలకు గడ్డి ఎండిపోవడంతో మంటలను అదుపు చేయడం కష్టమైంది. గోశాల సమీపంలోకి మంటలు రావడంతో అక్కడివారు భయభ్రాంతులకు గురయ్యారు. నాయుడుపేట, రేణిగుంట, తిరుపతి నుంచి అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. ఒకవైపు నుంచి మంటలను అదుపు చేస్తుండగా మరోవైపు చెలరేగడంతో ఇబ్బంది ఏర్పడింది. అగ్నిమాపక వాహనాలు అంత దూరం వెళ్లలేకపోవడంతో మంటలను అదుపు చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. 15అడుగుల ఎత్తు వరకు మంటలు చెలరేగడంతో కొండపైన గల ట్యాంకు పైపులైను పగులగొట్టి కొంతమేర అదుపుజేశారు. అయితే కన్నప్ప కొండపై శివపార్వతుల విగ్రహం వెనుక వైపు మంటలు చెలరేగాయి. రాత్రి వరకు అగ్నిమాపక సిబ్బంది, ఆలయ సిబ్బంది మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాలను నివారిద్దాం

- అన్ని రంగాల్లో మెరుగైన విద్యుత్ భద్రతా ప్రమాణాలు తప్పనిసరి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రి పెద్దిరెడ్డి

తిరుచానూరు(తిరుపతి జిల్లా): రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా.. మెరుగైన భద్రతా ప్రమాణాలు పాటించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై బుధవారం తిరుచానూరులో జరిగిన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా పరికరాలు దెబ్బతినకుండా, సబ్‌స్టేషన్ల పవర్ లైన్లకు నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే 15 వేల మంది ఎనర్జీ అసిస్టెంట్లను నియమించామని, వారి సేవలను సక్రమంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. ఒక పటిష్టమైన కమ్యూనికేషన్ వ్యవస్థ సిద్ధం చేయాలన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఇప్పటికే సేఫ్టీ కమిటీలు, రాష్ట్రస్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కమిటీలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు సహకరించాలని.. వారి సంస్థలకు విద్యుత్ సరఫరా చేసే ప్రక్రియను సులభంగా మార్చాలన్నారు. భద్రత విషయంలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో విద్యుత్ శాఖ ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో విద్యుత్ శాఖకు సంబంధించి రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. చంద్రబాబు హయాంలో సమ్మిట్ పెట్టినా.. ఎక్కడా ఒక పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ రిటైర్డ్ సీఎండీ గోపాల్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు శివప్రసాద్‌రెడ్డి, సుబ్బరాజు, ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, సీపీడీసీఎల్ డైరెక్టర్ జయభారత్‌రావు, ఎస్పీడీసీఎల్ తిరుపతి ఎస్ఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ 5.3 కోట్లమంది ప్రజల సెంటిమెంట్

- ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ, రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకం
- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సింహాచలం: విశాఖ స్టీల్‌ప్లాంట్ రాష్ట్రంలో ఉన్న 5.3 కోట్ల మంది ప్రజల సెంటిమెంటని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. విశాఖ జిల్లాలోని వేపగుంట నుంచి పినగాడి వరకు రూ.13.92 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ, రాష్ట్ర ప్రభుత్వం పూర్తివ్యతిరేకమని స్పష్టం చేశారు. చంద్రబాబు 1995 నుంచి 2004 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో 64 కంపెనీలు అమ్మేశారన్నారు. విశాఖలోని హిందుస్థాన్ జింక్‌ని అమ్మేస్తే చంద్రబాబు ఏంచేశారని ప్రశ్నించారు. అలాగే హిందుస్థాన్ షిప్‌యార్డుని, బీహెచ్‌పీవీని అమ్మకానికి పెట్టేస్తే చంద్రబాబు ఏంచేశారని నిలదీశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చిన తర్వాత బీహెచ్‌పీవీని బీహెచ్ఈఎల్‌లో విలీనం చేసి కాపాడారని, హిందుస్థాన్ షిప్‌యార్డుకి పూర్వవైభవం తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఒక స్టాండ్ తీసుకున్నామంటే దానికి కట్టుబడి ఉండటం చాలా ముఖ్యమని చెప్పారు. దానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగడానికి వీలు లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పాల్గొన్నారు.

టీడీపీతో పొత్తులాంటి నిర్ణయాలు తీసుకుంటే కాంగ్రెస్‌కు మనుగడ ఎలా?

- ప్రజాజీవితంలో కొనసాగాలనే బీజేపీలో చేరా
- బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తా
- మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: విభజన తర్వాత కూడా ఒక దశలో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు 8 శాతానికి పెరిగినట్లు ఓ సర్వేలో తేలిందని, ఆ సమయంలో ఆ పార్టీ పెద్దలు హఠాత్తుగా టీడీపీతో పొత్తు పెట్టుకున్నారని, ఇలాంటి నిర్ణయాల వల్ల ఆ పార్టీ ఎలా ముందుకు పోతుందని మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రెండోసారి తాను కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తానన్నా.. తాను నిరాకరించానని తెలిపారు. ఇటీవలే బీజేపీలో చేరిన ఆయన బుధవారం విజయవాడ వచ్చారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఉండే వారికి ప్రజాజీవితంలో కొనసాగే పరిస్థితి లేదని.. తాను ఇంకా ప్రజాజీవితంలో కొనసాగాలనే బీజేపీలో చేరినట్టు వివరించారు. ఈ అంశంలో ప్రాంతీయ పార్టీల గురించి అస్సలు ఆలోచించలేదన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యేక హోదా కోరుకుంటున్నప్పటికీ.. గతంలో కేంద్రం హోదాకు బదులు ప్యాకేజీ ఇవ్వడానికి సిద్ధపడగా అప్పటి ప్రభుత్వం దానికి అంగీకరించిందని పరోక్షంగా చంద్రబాబు నిర్ణయాన్ని గుర్తుచేశారు. మూడు రాజధానులపై పార్టీ అభిప్రాయమే తన అభిప్రాయమని తెలిపారు. తన తమ్ముడు టీడీపీలో కొనసాగుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఏ పార్టీలో కొనసాగాలన్నది వారి వ్యక్తిగత నిర్ణయమన్నారు. ఏపీ, తెలంగాణ, ఇంకా ఎక్కడయినా తన అనుభవం మేరకు బీజేపీని బలోపేతం చేసేందుకు పనిచేస్తానని చెప్పారు. పోటీ విషయంలో కూడా పార్టీ ఏం చెప్తే అదే చేస్తానన్నారు. తాను సీఎంగా ఉన్నప్పటికంటే ఇప్పుడే రాష్ట్రానికి కేంద్ర సాయం ఎక్కువ మొత్తంలో అందుతోందని చెప్పారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకూరు ఇప్పటికి గుర్తొచ్చిందా బాబూ?

- ఎన్టీఆర్‌కు వెన్నుపోటుపై గ్రామస్తులకు జవాబు చెప్పాలి
- చేసిన పాపాలు, ద్రోహాలకు క్షమాపణ చెప్పాలి
- చంద్రబాబుకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ డిమాండ్



పామర్రు: ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరు ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే.. గ్రామంలో అడుగు పెట్టాలని ప్రతిపక్ష నేత చంద్రబాబును పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. నిమ్మకూరు ఇప్పటికి గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన బుధవారం కృష్ణా జిల్లా పామర్రులో చంద్రబాబును ఉద్దేశించి రాసిన బహిరంగ లేఖను మీడియాకు విడుదల చేశారు. కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా నిమ్మకూరులో బస చేస్తున్న చంద్రబాబు.. ఎన్టీఆర్‌కు వెన్నుపోటుపై గ్రామస్తులకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ కష్టపడి నిర్మించుకున్న టీడీపీని, అధికారాన్ని లాగేసుకున్న చంద్రబాబు.. చివరకు ఆయన మరణానికి కూడా కారణమయ్యారని మండిపడ్డారు. తన కుమార్తెను ఇవ్వడమే కాకుండా.. రాజకీయంగా జీవితాన్ని ఇచ్చిన ఎన్టీఆర్‌ను మనోవేదనకు గురిచేసినందుకు క్షమాపణ చెప్పాలని గ్రామస్తులు కోరుకుంటున్నారని వివరించారు. క్షమాపణ చెప్పకుండా నిమ్మకూరులో బస చేస్తే ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు.. ఎన్నడూ నిమ్మకూరును పట్టించుకోలేదని మండిపడ్డారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నిమ్మకూరులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి.. జగనన్న కాలనీ ఏర్పాటు చేశామన్నారు. నాడు-నేడు పథకం ద్వారా జెడ్పీ పాఠశాలను రూ.70 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని.. ఎస్సీ కాలనీలోని స్కూల్‌ను రూ.20 లక్షలతో అభివృద్ధి చేశామని చెప్పారు. రూ.40 లక్షల వ్యయంతో గోడౌన్ నిర్మాణం చేపట్టామన్నారు. రూ.40 లక్షలతో గురుకుల పాఠశాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇలా.. వైఎస్ జగన్ ప్రభుత్వంలో నిమ్మకూరులో చేసిన అభివృద్ధి పనులన్నింటినీ చూడాలని చంద్రబాబుకు సూచించారు. ఎన్టీఆర్‌కు చంద్రబాబు తీరని అన్యాయం చేస్తే.. సీఎం జగన్ ఓ జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టి గౌరవించారని గుర్తు చేశారు. నాలుగేళ్లుగా కృష్ణా డెల్టా పచ్చని పొలాలతో కళకళలాడుతోందని, రైతులంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. నిమ్మకూరులో ఉన్నప్పుడైనా రాజకీయాలను వదిలి, ప్రజల సంతోషాన్ని చూడాలని సూచించారు.

శ్రీవారి హుండీలో చోరీ చేసిన వ్యక్తికి జైలు

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి ఆలయంలోని ప్రధాన హుండీలో సొమ్మును అపహరించిన కేసులో పశ్చిమ గోదావరి జిల్లా గన్నవరం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎం.దుర్గారావుకు మూడు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. గత నెల 8వ తేదీ నిందితుడు దుర్గారావు శ్రీవారి ఆలయంలోని ప్రధాన హుండీలో రూ.810 అపహరించాడు. సీసీ టీవీ ఆపరేటర్ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది దీనిని గుర్తించి టీటీడీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కు తెలిపారు. దీంతో విజిలెన్స్ అధికారి నిందితుడు దుర్గారావును అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. బుధవారం అతను నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

దిగొచ్చిన నారాయణ యాజమాన్యం

- విద్యార్థి వైద్యానికి అయ్యే పూర్తి ఖర్చు భరిస్తామని వెల్లడి
- ఘటనకు కారణమైన పీఈటీని విధుల నుంచి తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస/పెద్దిపాలెం నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యం 8వ తరగతి విద్యార్థి ఎం.గౌతం విషయంలో ఎట్టకేలకు దిగొచ్చింది. విజయనగరానికి చెందిన ధనుంజయనాయుడు, మీనాల కుమారుడు గౌతంను ఈ నెల 2న పీఈటీ స్వామినాయుడు చిత్రహింసలకు గురి చేసి తీవ్రంగా కొట్టడంతో భుజంపై గాయాలతో పాటు చేయి విరిగిన సంగతి తెలిసిందే. దీనిపై తల్లి మీనా ఈ నెల 11న 'సాక్షి'తో తన గోడు వెళ్లబోసుకుంది. ఈ వివరాలతో 'విద్యార్థి చెవి మెలిపెట్టి.. చేయి విరిచి' శీర్షికతో సాక్షి ప్రధాన సంచికలో వార్త ప్రచురితమైంది. దీంతో నారాయణ యాజమాన్యం రాజీబాట పట్టింది. ఈ నెల 4న భీమిలి పోలీసులు, ఎంఈవోలకు ఫిర్యాదు చేసినా స్పందించని యాజమాన్యం.. సాక్షి కథనంతో బుధవారం తల్లి మీనాతో సంప్రదింపులు జరిపింది. గౌతం వైద్యానికి అయ్యే పూర్తి ఖర్చులు భరించడంతో పాటు భవిష్యత్‌లో అవసరమైన వైద్యం అందించడానికి అంగీకరించింది. పీఈటీ స్వామినాయుడును విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో నారాయణ స్కూల్ యాజమాన్యంపై కేసు ఉపసంహరించుకుంటున్నట్లు మీనా తెలిపారు. తమ బిడ్డ గౌతంకు అండగా నిలిచిన 'సాక్షి' పత్రికకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

క్లుప్తంగా...

కింది ఉద్యోగితో షూ మోయించిన కలెక్టర్!



కళ్లకురిచి(తమిళనాడు): తమిళనాడులో ఓ జిల్లా కలెక్టర్ అధికార దర్పం ప్రదర్శిస్తూ కిందిస్థాయి ఉద్యోగితో షూ మోయించారనే వార్త చర్చనీయాంశమైంది. వేలాదిమంది లింగమార్పిడి (ట్రాన్స్‌జెండర్) వర్గీయులు సమూహంగా వేడుక జరుపుకునే ప్రముఖ కోవాంగం కుతందవార్ ఆలయం వద్ద ఈ ఘటన జరిగింది. ఆలయంలో కోవాంగం వేడుక ఏర్పాట్లను సమీక్షించేందుకు కళ్లకురిచి కలెక్టర్ శ్రవణ్‌కుమార్ జతావత్ అక్కడికి చేరుకున్నారు. ఆలయంలోకి వెళ్లేపుడు ఆయన షూ విప్పివెళ్లారు. ఆ సందర్భంగా తన షూ చేతపట్టుకుని వెంట రావాలని కింది స్థాయి ఉద్యోగిని ఆదేశించడం.. అతను షూ మోస్తున్నట్లు చూపే వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది. దీంతో 'కలెక్టర్ అధికారదర్పం' అంటూ పలువురు నెటిజన్లు విమర్శలు ఎక్కుపెట్టారు. దీనిపై కలెక్టర్‌ను వివరణ కోరగా.. ' షూ తీసుకుని రావాలని అతనికి నేనస్సలు చెప్పలేదు. అది నకిలీ వీడియో. ఎవరో కావాలని ఎడిట్ చేసి షేర్‌చేశారు' అని అన్నారు.

ఎంవీఏ ఐక్యంగా సాగాలి: పవార్



ముంబై: భిన్నాభిప్రాయాలు, అభిప్రాయ భేదాలున్నా వాటిని పక్కన పెట్టి మహా వికాస్ అగాఢీ సంకీర్ణం కలసికట్టుగా పని చేయాలని భాగస్వామ్య పార్టీ ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ పిలుపునిచ్చారు. సంకీర్ణంలోని మిగతా పక్షాలైన కాంగ్రెస్, శివసేన (యూబీటీ) మధ్య సావర్కర్ విషయమై రగడ జరగడం తెలిసిందే. అంతేగాక అదానీ ఉదంతంపై అవి రెండూ సంయుక్త పార్లమెంటరీ సంఘం విచారణకు డిమాండ్ చేస్తుండగా పవార్ మాత్రం సుప్రీంకోర్టు కమిటీ మేలని అభిప్రాయపడి కలకలం సృష్టించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''అగాఢీ ఐక్యతపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడాను. ఆ దిశగా కొన్ని కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం. వాటిలో మూడు పార్టీలూ పాల్గొంటాయి'' అని వివరించారు.



కర్ణాటక ఎన్నికలంటే వంశపారంపర్య రాజకీయాలే కళ్లముందు కదలాడుతాయి. జేడీ(ఎస్) కుటుంబానికి కుటుంబం ఎన్నికల్లో పోటీ చేసి పదవులు దక్కించుకోవడం, కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా వారసులకి టికెట్లు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. రెండో తరం, మూడో తరం కూడా తండ్రులు, తాతల పేర్లు చెప్పుకొని రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. తండ్రి కోసం కొడుకు, కొడుకు కోసం తండ్రి చేసిన త్యాగాలు, తల్లిపైనున్న అసంతృప్తిని మోయడానికి సిద్ధమైన కొడుకు, భార్య టికెట్ కోసం ఏకంగా కుటుంబంపైనే తిరుగుబాటు సిద్ధమైన వారితో రాజకీయం రసకందాయంలో పడింది. - సాక్షి, నేషనల్ డెస్క్

వారసుల పోరు

కన్నడ నాట పొలిటికల్ చిత్రమ్

ప్రియాంక్ ఖర్గే.. లిట్మస్ టెస్ట్



➤ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడైన ప్రియాంక్ ఖర్గే చిత్తపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. తండ్రి కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాక సొంత రాష్ట్రంలో జరుగు తున్న తొలి ఎన్నికల కావడంతో ఈ స్థానం నుంచి గెలిచి తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఎన్నికల్లో ప్రియాంక్ 4 వేల కంటే తక్కువ ఓట్లతో నెగ్గారు. పోలీసు రిక్రూట్‌మెంట్ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చి బసవరాజ్ బొమ్మై ప్రభు త్వాన్ని ఇరకాటం పెట్టడంలో విజయం సాధించారు. ఈసారి కాంగ్రెస్‌కు 140 సీట్లు ఖాయమని ప్రియాంక్ అంటుంటే, 'ప్రియాంక్ ఖర్గే కనబడుట లేదు' అంటూ ఆయన నియోజకవర్గంలో బీజేపీ పోస్టర్లు ఏర్పాటు చేసింది!

అమ్మ కొడుకు





➤ హెచ్.డి. కుమారస్వామి కుమారుడు నిఖిల్ పోటీపడుతున్న రామనగర్ నియోజకవర్గంపై ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఇన్నాళ్లూ కుమారస్వామి భార్య అనిత కుమారస్వామి ఆ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె తన కొడుకు కోసం ఆ స్థానం నుంచి తప్పుకున్నారు. ఇటీవల నిఖిల్ రామనగర్‌లో పర్యటనకు వెళ్లినప్పుడు ఆయనకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో తల్లి వైఫల్యాలు ఇప్పుడు కుమారుడి భవిష్యత్‌ను ఎటు తీసుకువెళతాయా అన్న సందేహాలున్నాయి. మౌలిక సదు పాయాలు, తాగు నీటి సౌకర్యం కూడా లేకపోవ డంతో స్థానికులు నిఖిల్‌ను నిలదీస్తున్నారు. మరి ఈ స్థానం నుంచి నిఖిల్ నెగ్గుతారా లేదా అన్నది సందేహంగానే మారింది.

తండ్రి కోసం యతీంద్ర త్యాగం



➤ మహాభారతంలో భీముడు, ఘటోత్కచుడు బంధం ఎలాగుంటుందో కర్ణాటక రాజకీయాల్లో కాంగ్రెస్ నాయకుడు సిద్ధరామయ్య, ఆయన కుమారుడు యతీంద్ర మధ్య సంబంధం అలాగే ఉంటుందని చెప్పుకుంటారు. యతీంద్ర తండ్రికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండడానికి తన భవిష్యత్‌ను కూడా పణంగా పెట్టారు. ఈ సారి ఎన్నికల్లో వరుణ అసెంబ్లీ సీటుని తన తండ్రి కోసం త్యాగం చేశారు. గత ఎన్నికల్లో 45 వేల ఓట్ల భారీ మెజార్టీతో వరుణ నుంచి నెగ్గిన యతీంద్ర కాంగ్రెస్ పార్టీ గెలిస్తే సిద్ధరామయ్య సీఎం అవడం కోసం ఈ సీటుని వదులుకున్నారు. కాంగ్రెస్‌లో సిద్ధరామయ్య, డికె. శివకుమార్ ఇద్దరూ సీఎం పదవి ఆశిస్తూ ఉండడంతో సిద్ధరామయ్యని ఓడిస్తారన్న ప్రచారం జరుగుతోంది..వరుణ నియోజక వర్గం నుంచి పోటీపడితే సిద్ధరామయ్యకి తిరుగుండదని యతీంద్ర పోటీ నుంచి తప్పుకున్నారు.

కుమారునికి యడ్డీ అండ



➤ వంశ పారంపర్య రాజకీయాలపై కాంగ్రెస్‌ను మొదట్నుంచి చీల్చి చెండాడుతున్న బీజేపీ కూడా కర్ణాటకలో బీఎస్ యడియూరప్ప ఒత్తిడికి తలొగ్గక తప్పలేదు. యడ్డీ 1983 నుంచి రికార్డు స్థాయిలో ఏడుసార్లు నెగ్గిన శివమొగ్గలో షికారిపుర నుంచి ఈ సారి విజయేంద్ర పోటీ పడుతున్నారు. ఎన్నికల వ్యవహారాలను తన భుజస్కంధాలపై మోస్తున్న యడియూరప్ప తన కుమారుడు విజయేంద్ర కోసం తాను స్వయంగా ఎన్నికల బరి నుంచి తప్పుకోవడంతో విజయేంద్రకు టికెట్ దక్కింది. బీజేపీ యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా, కర్ణాటక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ విజయేంద్రకి గతంలో రెండు సార్లు టికెట్ రాక నిరాశ చెందారు. ముచ్చటగా మూడో సారి ప్రయత్నం ఫలించడంతో ఇక ఎన్నికల్లో గెలుపుపై ఆయన దృష్టి సారించారు.

జేడీ(ఎస్)లో హాసన్ ప్రకంపనలు



రేవన్న దంపతులు



ప్రజ్వల్



సూరజ్

➤ కుటుంబ పార్టీగా ముద్ర పడిన జేడీ(ఎస్)లో ఈ సారి ఎన్నికలు కుటుంబంలో చీలికకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. హెచ్.డీ. దేవెగౌడ పెద్ద కుమారుడు రేవణ్ణ తన భార్య భవానీ రాజకీయ ఎంట్రీకి ఇదే తగిన సమయమని భావిస్తున్నారు. హాసన్ నియోజకవర్గం నుంచి ఆమెకి టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. మరోవైపు హెచ్.డి. కుమారస్వామి హాసన్ స్థానాన్ని తన వదినకు ఇవ్వలేమని హెచ్‌పి. స్వరూప్‌కే ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే హెచ్‌డి రేవణ్ణ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కుమారులు ప్రజ్వల్ రేవణ్ణ హాసన్ నుంచి ఎంపీగా ఉంటే, మరో కుమారుడు సూరజ్ రేవణ్ణ ఎమ్మెల్సీగా ఉన్నారు. ఇప్పుడు భవానీకి కూడా టిక్కెట్ ఇస్తే వారి కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ఎనిమిదో వ్యక్తి అవుతారు. ఇది ఎన్నికల్లో తీవ్ర ప్రభావం కనిపించే అవకాశం ఉంది. ఒకవేళ టిక్కెట్ దక్కకపోతే తాను, తన భార్య స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని హెచ్‌డి రేవణ్ణ బెదిరింపులకు దిగడం పార్టీలో కలకలానికి దారి తీస్తోంది.

కర్ణాటక బీజేపీలో భగ్గుమన్న అసమ్మతి

- అభ్యర్థుల తొలి జాబితా ప్రకంపనలు
- పార్టీకి సావాది, దొడ్డప్ప గుడ్‌బై
- మంత్రి అంగారా రాజకీయ సన్యాసం

బెంగళూరు: కర్ణాటక బీజేపీలో అసమ్మతి భగ్గుమంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 52 కొత్త ముఖాలకు టిక్కెట్‌లు ఇస్తూ విడుదల చేసిన తొలి జాబితా పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. టికెట్ రాని అసంతృప్త నాయకులు ఒక్కొక్కరుగా పార్టీకి గుడ్ బై కొడుతున్నారు. మరికొందరు పార్టీ నుంచి వెళ్లిపోతామంటూ బెదిరింపులకి దిగుతున్నారు. ఆశావహుల మద్దతుదారులు బీజేపీ కార్యాలయం వద్ద నిరసనలకు కూడా దిగారు. సీనియర్ నేత లక్ష్మణ్ సావాది, మాజీ ఎమ్మెల్యే దొడ్డప్పగౌడ పాటిల్ నారిబోల్‌లు పార్టీకి బుధవారం గుడ్‌బై కొట్టేశారు. సలియా నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గి ప్రస్తుతం మంత్రిగా ఉన్న ఎస్. అంగారా టికెట్ రాకపోవడంతో ఏకంగా రాజకీయ సన్యాసం స్వీకరిస్తున్నట్టుగా ప్రకటించారు. లక్ష్మణ్ సావాది మాజీ సీఎం బీఎస్ యడ్డీయూరప్పకి అత్యంత విధేయుడు, శక్తిమంతమైన లింగాయత్ నాయకుల్లో ఒకరు. 2018 ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ, ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి ఫిరాయింపుదారుల్ని ఆకర్షించడంలో పకడ్బందీగా వ్యూహాలు పన్నారు. ఈసారి టికెట్ రాకపోవడంతో సావాది తాను ఎవరినీ బిచ్చమడగనని, తనకి ఆత్మ గౌరవం ఉందని వ్యాఖ్యానించారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన కాంగ్రెస్‌లోకి వెళతారంటున్నారు. మాజీ ఎమ్మెల్యే దొడ్డప్ప గౌడ కూడా రాజీనామా చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ షెట్టర్ పేరు తొలిజాబితాలో లేకపోయేసరికి ఆగ్రహావేశాలతో ఢిల్లీకి వెళ్లి బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. టికెట్ వస్తుందని ఆశాభావంతో ఉన్నారు. ఇక మంత్రి అంగారా పార్టీ తనను తీవ్రంగా అవమానించిందంటూ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టుగా ప్రకటించారు.

బీజేపీ 'వన్ నేషన్ వన్ మిల్క్'ను తిప్పికొడతాం : కాంగ్రెస్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లో డెయిరీ కోఆపరేటివ్‌లపై కన్నేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రతీ రాష్ట్రంలోని పాల ఉత్పత్తుల సహకార సంఘాలను తన నియంత్రణలోకి తీసుకురావాలని చూస్తోందని మండిపడింది. ఇవాళో రేపో వన్ నేషన్ వన్ డెయిరీ అనే నినాదాన్ని తెరపైకి తెస్తుందని, తాము ఎట్టి పరిస్థితుల్లోనూ దానికి అంగీకరించే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. డెయిరీ సహకార సంఘాలను కూడా కేంద్రం తన పరిధిలోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. గుజరాత్‌కు చెందిన అమూల్ తాము కర్ణాటకలో కూడా పాల సరఫరా చేయబోతున్నామంటూ చేసిన ట్వీట్ రాజకీయ వివాదానికి దారి తీసింది. కర్ణాటక రాష్ట్ర పాల సహకార సంఘం నందినిని అమూల్‌కు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ ఆరోపణలు గుప్పించింది.

'డోక్లాం' దేశ భద్రతకు పెనుముప్పు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: భారత సరిహద్దు ప్రాంతం డోక్లాం పీఠభూమి దగ్గర చైనా నిర్మాణాలు కొనసాగిస్తుండటంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదలచేశారు. ''డోక్లాం పీఠభూమికి అత్యంత సమీపంలో చైనా మిలటరీ నిర్మాణాలపై భారత సైన్యం తాజాగా మరింత ఆందోళన వ్యక్తంచేసింది. ఒక్క అంగుళం భూమి కూడా ఎవరికో వదులుకునే ప్రసక్తి లేదని అమిత్ ప్రకటించారు. కానీ 2020 మే తర్వాత 2,000 కిలోమీటర్ల భారత భూభాగాన్ని గస్తీకాసే అవకాశాన్ని చైనా బలగాలు పోగొట్టాయి. మన డెప్సాంగ్, డెమ్‌చోక్, హాట్‌స్ప్రింగ్(కున్‌గ్రాంగ్ నళా), గోగ్రా పోస్టు వంటి పెట్రోలింగ్ పాయింట్లకు మన బలగాలు వెళ్లకుండా చైనా సైన్యం అడ్డుతగులుతోంది. దీనిపై మోదీ మౌనం వీడాలి'' అని డిమాండ్ చేశారు.

మళ్లీ కోవిషీల్డ్ ఉత్పత్తి

న్యూఢిల్లీ: తగిన డిమాండ్ లేకపోవడం, కోవిడ్ ఉధృతి తగ్గుముఖం పట్టడంతో గతంలో ఆగిన కోవిషీల్డ్ కోవిడ్ టీకా ఉత్పత్తిని తాజాగా పునఃప్రారంభించామని దాని తయారీసంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా బుధవారం ప్రకటించారు. కొత్తగా కోవిడ్ కేసుల సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతుండటంతో వ్యాక్సిన్ ఉత్పత్తి మొదలుపెట్టినట్లు ఆయన వెల్లడించారు. ' ఇప్పటికే 60 లక్షల కోవోవ్యాక్స్ బూస్టర్ డోసులు అందుబాటులో ఉన్నాయి. వయోజనులు కచ్చితంగా బూస్టర్ డోసులు తీసుకోవాలి. ముందస్తు జాగ్రత్తగా ప్రజలు తమ ఐచ్ఛికంగా కోవిషీల్డ్‌నూ తీసుకోవచ్చు. వచ్చే 90 రోజుల్లో 60–70 లక్షల డోసుల కోవిషీల్డ్ అందుబాటులో ఉండేలా చూస్తాం. డిమాండ్‌కు తగ్గట్లు స్టాక్‌ను పెంచేందుకు తొమ్మిది నెలల సమయం పట్టొచ్చు' అని పూనావాలా చెప్పారు. చివరిసారిగా కోవిషీల్డ్ ఉత్పత్తిని సీరమ్ సంస్థ 2021 డిసెంబర్‌లో నిలిపేసింది.

సమైక్యంగా ఎన్నికలకు!

కాంగ్రెస్, జేడీ(యూ), ఆర్జేడీ నిర్ణయం

ఖర్గే, రాహుల్‌తో నితీశ్, తేజస్వి భేటీ	సంయుక్తంగా మీడియా ముందుకు	చరిత్రాత్మక భేటీగా పేర్కొన్న రాహుల్	విపక్షాలన్నింటినీ కూడగడతాం: ఖర్గే విపక్షాల ఐక్యత దిశగా కీలక అడుగులు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ఏడాదే ఉన్న నేపథ్యంలో విపక్షాల ఐక్యత దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. బిహార్‌లో అధికారంలో ఉన్న మహాఘట్‌బంధన్ భాగస్వామ్య పక్షాల అధినేతలు, ముఖ్య నేతల మధ్య బుధవారం కీలక సమావేశం జరిగింది. బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. బీజేపీని కలసికట్టుగా ఎదుర్కోవడంతో పాటు పలు అంశాలపై లోతుగా చర్చలు జరిపారు. అనంతరం నేతలంతా సంయుక్తంగా మీడియా ముందుకొచ్చారు. విభేదాలను పక్కన పెట్టి కలసికట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. విపక్ష కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తారన్న మీడియా ప్రశ్నలకు మాత్రం నేతలు సమాధానం దాటవేశారు! మోదీ మేజిక్‌ను ఎదర్కోవడానికి ఒక ఉమ్మడి నాయకున్ని ప్రకటించే ఎన్నికల బరిలో దిగడం మేలని విపక్ష నేతల్లో కొందరంటుండగా అది అంతిమంగా తమకే చేటు చేయవచ్చని మరికొందరు భావిస్తుండటమే దీనికి కారణమని చెబుతున్నారు.

కీలక ముందడుగు: రాహుల్

తమ భేటీని చరిత్రాత్మక సమావేశంగా రాహుల్ అభివర్ణించారు. ''ఈ భేటీ విపక్షాల ఐక్యత దిశగా కీలక ముందడుగు. ఎన్నో అంశాలపై చర్చించుకున్నాం. అన్ని పార్టీలనూ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి లోక్‌సభ ఎన్నికలను సమైక్యంగా ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నాం. ఇప్పట్నుంచే అందరమూ ఆ దిశగా పని చేస్తాం. మాది సైద్ధాంతిక పోరాటం. విపక్షాల ఉమ్మడి విజన్‌ను త్వరలో ప్రజల ముందుంచనున్నాం'' అని వెల్లడించారు. ఎన్ని విపక్షాలు కలిసి రానున్నాయని ప్రశ్నించగా అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాలింకా కొనసాగుతున్నాయని రాహుల్ బదులిచ్చారు. ''ఒక్కటిగా నిలబడ్డాం. దేశం కోసం ఒక్కటిగా పోరాడతాం'' అంటూ అనంతరం ట్వీట్ చేశారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశానికి నూతన దిశానిర్దేశం చేసేందుకు కలసికట్టుగా సాగుతామని ఖర్గే ప్రకటించారు. నితీశ్, తేజస్వి తదితరులతో భేటీ చాలా బాగా జరిగిందంటూ ట్వీట్ చేశారు. విపక్షాలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాల్లో ఇది తొలి సమావేశం. ఖర్గే నివాసంలో జరిగిన ఈ సమావేశంలో జేడీ(యూ) అధ్యక్షుడు లాలన్‌సింగ్, బిహార్‌పీసీసీ చీఫ్ అఖిలేశ్ ప్రసాద్‌సింగ్, ఆర్జేడీ నేత మనోజ్ ఝా తదితరులు పాల్గొన్నారు. దీనికి కొనసాగింపుగా ముమ్మందు మరిన్ని విపక్షాలతో ఖర్గే భేటీ కానున్నారు. డీఎంకే అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తదితరులతో ఇటీవలే ఆయన సమావేశమై చర్చించారు. ఇటీవలే ముగిసిన పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సారథ్యంలో 19 విపక్షాలు సమైక్యంగా నిరసనలు, ఆందోళనల్లో పాల్గొనడం తెలిసిందే.



భేటీ సందర్భంగా ఢిల్లీలో తన నివాసంలో నితీశ్, తేజస్వీ, రాహుల్‌లతో ఖర్గే

బందిపోట్ల కూటమి: బీజేపీ

కాంగ్రెస్, జేడీ(యూ), ఆర్జేడీ నేతల భేటీని రాజకీయ గిమ్మిక్కుగా బీజేపీ అభివర్ణించింది. ''అదో బందిపోట్ల కూటమి. నిండా అవినీతిలో కూరుకుపోయిన వాళ్లంతా చట్టం బారి నుంచి తమను తాము కాపాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలివి. ఇలాంటి విన్యాసాలతో వారి అవినీతి దాగబోదు'' అని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ దుయ్యబట్టారు. 2014, 2019 ఎన్నికల్లో వారిని ప్రజలు వరుసగా తిరస్కరించారన్నారు. ఈసారి కూడా అదే ఫలితం పునరావృతమవుతుందని, మోదీ సారథ్యంలో బీజేపీ ఘనవిజయం ఖాయమని జోస్యం చెప్పారు.

పార్టీలన్నింటినీ కలుపుకుంటాం: నితీశ్

దేశంలోని విపక్ష పార్టీలన్నింటినీ కలుపుకుని పోయేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తామని నితీశ్ ప్రకటించారు. ''అంతా కలిసి పని చేయాలని భేటీలో నిర్ణయం తీసుకున్నాం. అందుకోసం అందరమూ కూర్చుని మాట్లాడుకుంటాం. భావి కార్యాచరణను నిర్ణయించుకుంటాం. అది త్వరలోనే జరుగుతుంది. ఆ దిశగా ముందుకు సాగనున్నాం'' అని వెల్లడించారు. విపక్షాల ఐక్యతను సాధించే కీలక శక్తిగా నితీశ్ నిలవనున్నారంటూ జేడీ(యూ) ట్వీట్ చేసింది.

నితీశ్‌కు పూర్తి మద్దతు: కేజ్రీ



కాంగ్రెస్ నేతలతో భేటీ అనంతరం నితీశ్, తేజస్వీ బుధవారం సాయంత్రం ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. తర్వాత కేజ్రీ మీడియాతో మాట్లాడారు. విపక్షాల సమీకరణకు నితీశ్ ప్రయత్నాలను ప్రశంసించారు. వాటికి తన పూర్తి మద్దతుంటుందని ప్రకటించారు. ''దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కేంద్రంలో ప్రస్తుతమున్నది బహుశా దేశ చరిత్రలోనే అత్యంత అవినీతిమయ ప్రభుత్వం! దాని దెబ్బకు సామాన్యుని బతుకు దుర్భరంగా మారింది. బీజేపీ సర్కారుపై విపక్షాలన్నీ సమైక్యంగా పోరాడి దాన్ని కూలదోయడం అత్యవసరం'' అని అభిప్రాయపడ్డారు. నితీశ్‌ను ప్రధాని అభ్యర్థిగా భావిస్తున్నారా అని ప్రశ్నించగా, కేవలం ఒక్క భేటీతో ఇలాంటి వాటికి సమాధానం చెప్పలేమని కేజ్రీవాల్ అన్నారు. గురు, శుక్రవారాల్లో మరికొందరు విపక్ష నేతలతో కూడా నితీశ్ భేటీ అవుతారని సమాచారం. మంగళవారం ఆయన ఆర్జేడీ అధినేత లాలుప్రసాద్ యాదవ్‌తోనూ సమావేశమయ్యారు.

రాజకీయ క్రీడాస్థలిగా రైల్వే

గత ప్రభుత్వాలపై మోదీ ఆరోపణ
రాజస్థాన్‌లో 'వందేభారత్' ప్రారంభం



జైపూర్: కేంద్రంలో గత ప్రభుత్వాలు రైల్వే వ్యవస్థను రాజకీయ క్రీడాప్రాంగణంగా వాడుకుని దుర్వినియోగం చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. బుధవారం రాజస్థాన్‌లో తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. ఇది దేశంలో 15వ వందేభారత్ ఎక్స్‌ప్రెస్. అజ్మీర్, ఢిల్లీ కంటోన్మెంట్ స్టేషన్ల మధ్య ప్రయాణిస్తుంది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. ''రాజకీయ లాభమనే సంకుచిత దృక్పథంలోనే గత ప్రభుత్వాల ఆలోచనలు సాగాయి. అందుకే రైల్వే ఆధునీకరణ పట్టాలెక్కలేదు. ఎవరు రైల్వే మంత్రి కావాలి, ఏ స్టేషన్ గుండా ఏ రైలు వెళ్లాలనే అంశాలూ రాజకీయ లబ్ధి కోణంలోనే నిర్ణయమయ్యేవి. 2014లో సుస్థిర ప్రభుత్వం వచ్చాక రైల్వేల పరిస్థితే మారిపోయింది. రాజకీయ జోక్యం పోయింది'' అన్నారు.

గహ్లోత్ జీ, థ్యాంక్యూ

రాజస్తాన్ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్న వేళ కూడా సీఎం అశోక్ గహ్లోత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ధన్యవాదాలని మోదీ అన్నారు. ''గహ్లోత్ నాకు మంచి మిత్రుడు. రైల్వే మంత్రి, రైల్వే బోర్డు చైర్మన్ రాజస్థానీలే. అలా మీ చేతిలో రెండు లడ్డూలున్నాయి'' అన్నారు.

నవ్య భారత్ కోసమే

భోపాల్: 'అధునాతన, అభివృద్ధి చెందిన భారత్' కోసమే నూతన జాతీయ విద్యావిధానం తెచ్చినట్టు మోదీ చెప్పారు. భోపాల్‌లో నూతన ఉపాధ్యాయుల నియామక కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన వీడియో సందేశమిచ్చారు. ''విజ్ఞానం, నైపుణ్యం, సంస్కృతి, భారతీయ విలువలను చిన్నారి విద్యార్థుల్లో ఇనుమడింపజేయడంలో ఎన్ఈపీ ఎంతో దోహదపడనుంది'' అన్నారు.

25న కోర్టుకు హాజరుకండి

మోదీ ఇంటి పేరు కేసులో రాహుల్‌కు పట్నా కోర్టు సమన్లు

పట్నా: మోదీ ఇంటిపేరు వివాదంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ వేసిన పరువునష్టం కేసులో ఏప్రిల్ 25న కోర్టు ఎదుట హాజరవ్వాలని రాహుల్‌గాంధీని బిహార్ కోర్టు బుధవారం సూచించింది. ఎంపీ/ఎమ్మెల్యే కోర్టులో వేసిన పిటిషన్ విచారణను బుధవారం కోర్టు ప్రత్యేక జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆది దేవ్ చేపట్టారు. ఏప్రిల్ 12వ తేదీనే హాజరవ్వాలని గత నెల 18న ఆయన ఆదేశాలివ్వడం తెల్సిందే. హాజరుపై రాహుల్ తరఫు లాయర్లు తమ వాదనలు వినిపించారు. సూరత్ కోర్టు కేసులో రాహుల్ తరఫు లాయర్ల బృందం తలమునకలైనందున రాహుల్ హాజరవాల్సిన తేదీని మార్చాలని కోరారు. అందుకు అంగీకరించిన మేజిస్ట్రేట్ రాహుల్‌ను 25వ తేదీన హాజరుకావాలంటూ సమన్లు జారీచేశారు. మోదీ ఇంటిపేరుపై అనుచిత వ్యాఖ్యల కేసులో రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల జైలు విధించడం, ఎంపీగా అనర్హత వేటు పడటం తెలిసిందే.

మత వైషమ్యాలను ఎగదోస్తోంది

బీజేపీపై సీతారాం ఏచూరి ధ్వజం

కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో మతాల మధ్య మరింత చిచ్చు పెట్టి మతసామరస్యాన్ని కూలదోసే కుట్రకు బీజేపీ తెగిస్తోందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. బుధవారం కోల్‌కతాలో పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వేర్వేరు రాష్ట్రాల్లో ఇటీవల శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా భిన్న వర్గాల మధ్య జరిగిన ఘర్షణ ఘటనలను ఈ సందర్భంగా ఏచూరి ప్రస్తావించారు. ' 2024 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో మత విద్వేషాలను పెంచే కుతంత్రాలకు బీజేపీ పదునుపెడుతోంది. బీజేపీ ఎన్నికల, రాజకీయ సమీకరణాలకు ఇదే ప్రధానాస్త్రం' అని ఆరోపించారు.



బూడిద వర్ణచిత్రం

రష్యాలోని కమ్‌చట్కా ద్వీపకల్పంలోని షివేలూచ్ అగ్నిపర్వతం బద్దలై భారీస్థాయిలో ధూళిని ఇలా సమీపప్రాంతాలపై దులిపేసింది. పేలినపుడు అగ్నిపర్వత దుమ్ము, ధూళి, బూడిద ఆకాశంలోకి ఏకంగా 65,600 అడుగుల ఎత్తుదాకా ఎగసిపడింది.

పంజాబ్‌లో కాల్పుల కలకలం

ఆగంతకుల కాల్పుల్లో నలుగురు జవాన్ల మృతి • భటిండా సైనిక శిబిరంలో ఘటన

భటిండా/న్యూఢిల్లీ: గుర్తు తెలియని ఆగంతకుల కాల్పులతో పంజాబ్‌లోని భటిండా సైనిక శిబిరంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శిబిరంలోని శతఘ్ని దళానికి చెందిన జవాన్లు నివసించే ఆర్మీ స్టేషన్‌లోని ప్రాంతంలో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో భోజనశాల పక్కనే ఉన్న బ్యారక్‌లలో నిద్రిస్తున్న నలుగురు జవాన్లపై ఆగంతకులు కాల్పులు జరిపారు. ఉగ్రవాదులు దాడి చేశారా? మరొకరి పనా ? అనేది భారత సైన్యం ఇంకా స్పష్టంచేయలేదు. ఘటన విషయం తెల్సిన వెంటనే సత్వర స్పందన దళం రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని జల్లెడపడుతోంది. సాధారణ దుస్తులు, ముఖానికి ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు కాల్పుల ఘటన తర్వాత ఆ బ్యారక్ నుంచి బయటికొచ్చి అటవీ ప్రాంతం వైపు పారిపోయారనే ప్రత్యక్ష సాక్షి అయిన ఒక జవాను చెప్పారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ నమోదుచేసిన పోలీసులు, సైన్యం.. ఆగంతకుల కోసం వేట మొదలుపెట్టారు. ఘటనాస్థలిలో ఇన్సాస్ రైఫిల్‌కు చెందిన 19 ఖాళీతూటాలు లభించాయి. రెండ్రోజుల క్రితం ఇక్కడే ఇన్సాస్ రైఫిల్‌తోపాటు 28 రౌండ్ల తుపాకీ గుళ్ల చోరీ ఘటనకు, ఈ దాడికి సంబంధం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తును చేస్తున్నట్లు ఆర్మీ నైరుతి కమాండ్ తెలిపింది. ఘటన తాలూకు సమగ్ర వివరాలను సైన్యాధ్యక్షుడు జనరల్ మనోజ్ పాండే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ''ఇది ఉగ్రదాడి కాదు. 'బయటివాళ్ల' పని అస్సలు కాదు. ఆర్మీతో సమన్వయంతో ఈ ఘటనపై శోధిస్తున్నాం'' అని పంజాబ్ అదనపు డీజీపీ పార్మర్ చెప్పారు. ఈ ఘటనలో ఇప్పటిదాకా ఎవరినీ అరెస్ట్‌చేయలేదని భటిండా పోలీస్ కంటోన్మెంట్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ గుర్మీత్ సింగ్ స్పష్టం చేశారు. ' ఇది అంతర్గత వ్యక్తుల దాడిలా తోస్తోంది. ఫోరెన్సిక్ బృందం సంబంధిత ఆధారాలను సేకరిస్తోంది. లోతైన దర్యాప్తు కొనసాగిస్తాం' అని భటిండా సీనియర్ ఎస్పీ గుల్నీత్ సింగ్ ఖురానా మీడియాతో చెప్పారు. చోరీకి గురైన రైఫిల్ దొరికినట్లు సమాచారం. మరణించిన జవాన్లలో ఇద్దరు కర్ణాటకకు చెందినవారు కాగా మరో ఇద్దరు తమిళనాడుకు చెందినవారు. ఘటనాస్థలిలోకి ఎవరూ రాకుండా ఆర్మీ నిషేధ ఆంక్షలు విధించింది.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
గురువారం । 13 । ఏప్రిల్ । 2023

కరోనాతో మరొకరు మృతి

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో మరో కరోనా మరణం నమోదైంది. వివరాలు.. కళ్లకురిచ్చి జిల్లా తిరుక్కోవిలూరు సమీపంలోని మరుదురు గ్రామానికి చెందిన కుప్పు(56)ను కడుపు నొప్పి కారణంగా కుటుంబ సభ్యులు ముండియం బాక్కం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల్లో ఆమె కరోనా బారిన పడినట్లు నిర్ధారణ అయ్యింది. ఆమెకు చికిత్స అందిస్తూ రాగా బుధవారం మరణించింది. దీంతో కరోనా కారణంగా రాష్ట్రంలో ఇటీవల మరణించిన వారి సంఖ్య మూడుకు చేరింది. ఈ విషయంపై మంత్రి సుబ్రమణియన్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం కేసుల సంఖ్యరోజుకు 400గా ఉన్నట్లు వివరించారు. ఈ కేసులు రోజుకు వెయ్యికి చేరువైన పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కఠిన ఆంక్షలు అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ఆ పరిస్థితి రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

న్యూస్‌రీల్

మరో ముగ్గురిపై చర్యలకు సిఫారసు

సాక్షి, చెన్నై: కళాక్షేత్రకు చెందిన మరో ముగ్గురు అధ్యాపకులపై కూడా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సంగీత, నాట్య నిలయం కళాక్షేత్రాలో లైంగిక వేధింపుల ఆరోపణలు వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అధ్యాపకుడు హరి పద్మన్‌ను అరెస్టు చేశారు. ఈ వ్యవహారంపై మానవ హక్కుల కమిషన్ సైతం విచారణను వేగవంతం చేసింది. ఈ పరిస్థితుల్లో ఈ కేసులో విచారణను ముగించిన రాష్ట్ర మహిళా కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో కళాక్షేత్రాలోని మరో ముగ్గురు అధ్యాపకులపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. తాము జరిపిన విచారణలో సేకరించిన ఆధారాల మేరకు ఆ ముగ్గురిపై చర్యలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. కాగా విద్యార్థినులు మొత్తం నలుగురిపై ఆరోపణలు చేయగా, హరిపద్మన్‌ను మాత్రమే అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

అత్యాచారం కేసులో నిందితుల అరెస్టు

అన్నానగర్: మదురైలో సెమినార్‌కు వచ్చిన గుజరాత్ విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలు.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఓ యువతి సీఏ (చార్టర్డ్ అకౌంటెంట్) చదువుతోంది. ఈ కోర్సుపై గత ఏడాది డిసెంబర్‌లో మదురైలో సెమినార్ జరిగింది. ఇందుకు హాజరయ్యేందుకు ఆ మహిళ రాత్రి విమానంలో మదురైకి వచ్చింది. అనంతరం తెప్పకుళం సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బస చేసింది. అక్కడ ఆమె అస్వస్థత గురైంది. దీంతో ఆ యువతి తనకు తెలిసిన చెన్నై పెరంబూరుకు చెందిన ఆశిష్ జైన్ (22)కు సమాచారం ఇచ్చింది. అతడు మాడవాక్కం ప్రాంతానికి చెందిన జెరోమ్ కదిరవన్ (22)తో కలిసి హోటల్‌కు వచ్చి యువతిని పరామర్శించారు. అయితే ఆ మహిళ అన్నం తిన్న తరువాత వారిద్దరూ ఆమెపై అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. దీంతో ఆమె మదురై మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటినుంచి పోలీసులు గాలిస్తుండగా.. నిందితులు ఆశిష్ జైన్, జెరోమ్ కదిరవన్ బుధవారం దొరికారు. ఇన్‌స్పెక్టర్ గీతాలక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పత్రాలతో రూ.24 కోట్లు మోసం

అన్నానగర్: కల్లకురిచ్చి బ్యాంకుల్లో నకిలీ పత్రాలు ఇచ్చి రూ.24 కోట్లు మోసం చేసిన తండ్రి, కొడుకు సహా నలుగురు నిందితులను బుధవారం అరెస్టు చేశారు. వివరాలు.. చిన్న సేలం కూగైయ్యూరు రోడ్డుకు చెందిన పెరియ స్వామి (55) ఆయిల్ మిల్లు నడుపుతున్నాడు. ఇతను కొందరు స్నేహితులతో కలిసి చిన్న సేలం ప్రాంతంలో ప్రైవేటు గోడౌన్ అద్దెకు తీసుకుని రూ.24 కోట్లకు పైగా రుణం తీసుకుని బ్యాంకును మోసం చేసినట్లు తెలుస్తోంది. గోడౌన్ యజమాని జయరామన్ ఫిర్యాదు మేరకు చిన్న సేలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కేసును కళ్లకుచ్చి జిల్లా (క్రైం) బ్రాంచ్‌కు బదిలీ చేసి డిప్యూటీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ షణ్ముగం విచారణ చేపట్టారు. దర్యాప్తులో పెరియస్వామి చిన్నసేలంలోని కల్లకురిచ్చి ప్రాంతంలో 36 గోడౌన్‌లను అద్దెకు తీసుకున్నాడు. వీటి విషయంలో పెరియస్వామి అతని తండ్రి తంగవేల్, అతని భార్య తంగం, కుమారుడు బాలుస్వామి (24), కూతురు శరణ్య పేరుతో ఏత్తూరు చిన్న సేలం ప్రాంతంలోని పలు ప్రైవేటు బ్యాంకుల్లో నకిలీ పత్రాలు ఇచ్చి రూ.24 కోట్లు రుణం పొందినట్లు తెలిసింది. అనంతరం పెరియస్వామి, అతని కుమారుడు బాలుస్వామి, కృష్ణన్ (36), రమేష్(34)ను బుధవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న మరికొందరు వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

సింహవాహనంపై వాసవాంబ



కొరుక్కుపేట : శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరుగుతున్న వాసవీ వసంతోత్సవంలో భాగంగా బుధవారం శ్రీవాసవాంబ సింహవాహనంపై కొలువుదీరారు. విశేష అలంకరణలోని అమ్మవారిని భక్తులు కనులారా దర్శించుకుని తరించారు.

సత్యరాజ్ సోదరి ఫామ్ హౌస్‌లో గున్న ఏనుగు మృతి

తమిళసినిమా: నటుడు సత్యరాజ్ సహోదరి ఫామ్ హౌస్‌లోని మంచి నీటితొట్టిలో పడి ఓ గున్న ఏనుగు మృతి చెందింది. దీంతో 11 ఏనుగులు ఆ ప్రాంతానికి వచ్చాయి. వివరాలు.. సత్యరాజ్ సోదరి అపరాజితకు కోవై జిల్లా పాలమలై సమీపంలోని నాయగం పాలైయం గ్రామంలో ఓ ఫామ్‌హౌస్ ఉంది. అందులో పెద్ద మంచి నీటి తొట్టి ఉంది. అందులో ఓ గున్న ఏనుగు మరణించి ఉండడంతో కలకలం రేగింది. బుధవారం ఉదయం ఆ ప్రాంతానికి ఏనుగుల గుంపు రావడంతో అటవీ శాఖ అధికారులు పటాసులు కాల్చి వాటిని అడవిలోకి తరిమేశారు. కాగా నీటికోసం వచ్చి గున్నఏనుగు తొట్టిలో పడి మరణించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

చిన్నారులు, మహిళలను వేధిస్తే.. ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని సీఎం స్టాలిన్ అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. లైంగిక దాడులు, అరాచకాలకు పాల్పడే వారు ఈ సమాజానికి మాయనిమచ్చని, అలాంటి వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. అసెంబ్లీ వ్యవహారాలన్నీ కాగిత రహితంగా నిర్వహిస్తామన్నారు. ప్రతి సభ్యుడి టేబుల్ ముందు టచ్ స్క్రీన్‌తో డెస్క్‌టాప్, ఈబుక్ ద్వారా వివరాలు తెలియజేయడమే కాకుండా, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా సభా వ్యవహారాల ప్రసారానికి చర్యలు చేపడుతామని వెల్లడించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

మహిళలను వేధిస్తే.. ఉపేక్షించం!

- అసెంబ్లీలో సీఎం స్టాలిన్ స్పష్టీకరణ
- డిజిటల్ మయం కానున్న శాసనసభ
- అందుబాటులోకి టచ్ స్క్రీన్, ఈబుక్
- లైవ్ స్ట్రీమింగ్‌తో ప్రసారాలు
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ అన్నాడీఎంకే వాకౌట్



సాక్షి, చెన్నై: రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణతో పాటు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టం అసెంబ్లీలో తేల్చిచెప్పారు. వివరాలు.. అసెంబ్లీ సమావేశాలలో భాగంగా బుధవారం రెవెన్యూ శాఖమంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, విద్యుత్‌శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ తమ శాఖలకు నిధుల కేటాయింపులపై ప్రకటన చేశారు. అలాగే కొన్ని కీలక అంశాల గురించి సభకు వివరించారు. ముందుగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రధాన ప్రతి పక్ష నేత పళని స్వామి కడలూరు జిల్లా విరుదాచలంలో జరిగిన ఓ ఘటనను సభ దృష్టికి తీసుకొచ్చారు. విరుదాచలం మునిసిపాలిటీ కౌన్సిలర్ పకీర్ స్వామి ఆరేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు వివరించారు. రాష్ట్రంలో నేరాలు పెరిగి పోతున్నాయని ధ్వజమెత్తారు. ఇందుకు సీఎం స్టాలిన్ స్పందిస్తూ, తన చెవిన వార్త పడగానే, తక్షణం పకీర్ స్వామి భరతం పట్టే విధంగా అధికారులను ఆదేశించినట్లు వివరించారు. అతడిని అరెస్టు చేయడమే కాదు, పార్టీ నుంచి, పదవి నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎలాంటి పక్ష పాతం లేకుండా వ్యవహరిస్తామని వెల్లడించారు. ప్రధానంగా మహిళలు, చిన్నారులకు వ్యతిరేకంగా నేరాలకు పాల్పడుతున్న వారు ఈ సమాజానికి మచ్చ లాంటి వారని, ఈ మృగాళ్లను వదలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా ఈ ప్రభుత్వం ముందుకెళ్తుందని స్పష్టం చేశారు.

కాగిత రహితంగా..

అసెంబ్లీలో తమ ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం లేదని అన్నాడీఎంకే సభ్యులు స్పీకర్‌తో వాగ్వాదానికి దిగారు. ఇందుకు సమాధానం ఇచ్చే క్రమంలో స్పీకర్ అప్పావు కొత్త డిజిటల్ విధానం అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఆ మేరకు ప్రతి సభ్యుడి టేబుల్ ముందు టచ్ స్క్రీన్‌తో డెస్క్‌టాప్ ఏర్పాటు చేశామని, ఇందులోని ఈ బుక్ ఆధారంగా అన్ని వివరాలను కాగిత రహితంగా సభ్యులు తెలుసుకునే వీలుందన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలు, ప్రసంగాలు, వారికి కేటాయించిన సమయాల వివరాలను ఈ బుక్ ద్వారా తెలియజేస్తామన్నారు. అలాగే ప్రసంగించే వారి వివరాలు ఇందులో ప్రత్యక్షం అవుతాయని పేర్కొన్నారు. ఇందుకోసం తమ సిబ్బంది ప్రత్యేక శిక్షణ పొంది వచ్చారని తెలిపారు. ఈ- బుక్ యాప్‌కు యూజర్‌ఐడీ, పాస్ ఓడ్‌లను సభ్యులకు ఇప్పటికే అందజేశామన్నారు. వారి ప్రసంగాలు, వారికి సంబంధించిన వివరాలు అన్నీ లైవ్ స్ట్రీమింగ్ ద్వారా సభ్యులు తెలుసుకోవచ్చునని సూచించారు. దీనిని అమల్లోకి తెస్తూ తొలుత సీఎం ప్రసంగించారు. అనంతరం మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్ టచ్ స్క్రీన్‌లో తాను కనిపిస్తున్నానా..? అని చూస్తూ చమత్కారాలతో ప్రసంగించడం సభలో నవ్వులు పూయించింది. ఈ సందర్భంగా స్పీకర్ అప్పావు స్పందిస్తూ, టచ్ స్క్రీన్‌లోనే కాదు, చుట్టూ ఉన్న పెద్ద పెద్ద స్క్రీన్లలో, అవసరం అయితే, ఈబుక్ యాప్ ద్వారా తమరు ఎక్కడి నుంచైనా చూసుకోవచ్చునని స్పష్టం చేశారు.

అసెంబ్లీకి ఈవీకేఎస్



ఇళంగోవన్‌ను సత్కరిస్తున్న సెల్వ పెరుంతొగై

ఈరోడ్ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇలంగోవన్ అసెంబ్లీ సమావేశాలకు ఎట్టకేలకూ హాజరయ్యారు. ఉప ఎన్నికల ద్వారా ఎమ్మెల్యేగా ఆయన గెలిచిన అనంతరం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. కరోనా బారిన పడడం, ఊపిరితిత్తుల సమస్య, గుండెపోటు వంటి సమస్యలు ఎదురు కావడంతో ఉత్కంఠ నెలకొంది. అయితే ఆయన ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యవంతులయ్యారు. 34 ఏళ్ల అనంతరం అసెంబ్లీకి ఎన్నికైన ఆయన బుధవారం సభా ఆవరణలోకి వచ్చారు. ఆయన్ని కాంగ్రెస్‌శాసన సభా పక్ష నేత సెల్వ పెరుంతొగై, ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆహ్వానించారు. తొలుత పార్టీ శాసన సభాపక్ష కార్యాలయానికి సీనియర్‌నేత ఈవీకేఎస్ వెళ్లారు. అనంతరం అసెంబ్లీ ప్రవేశ మార్గంలో ఉన్న రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లారు.

అన్నాడీఎంకే వాకౌట్

అదే సమయంలో టీవీల్లో అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారం వ్యవహారం గురించి తాము ప్రశ్నిస్తే, స్పీకర్ ఇచ్చిన ఈ వివరణ మరో విధంగా ఉందని, దీంతో తాము ఏకీ భవించడం లేదని ప్రధాన ప్రతి పక్ష నేత పళనిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా వ్యవహారాలు పూర్తిగా భవిష్యత్తులో ప్రసారం చేయడానికి చర్యలు తీసుకోవాలని సీఎం స్టాలిన్ ఆదేశించినట్లు స్పీకర్ పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ తీరును నిరసిస్తూ అన్నాడీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అలాగే రెవిన్యూ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ ప్రసంగాన్ని బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఇక సభలో పీఎంకే శాసన సభా పక్ష నేత జీకే మణి స్పందిస్తూ, వన్నియర్ రిజర్వేషన్ విషయంగా ప్రసంగానికి ప్రయత్నించారు. ఇందుకు స్పీకర్ అప్పావు నిరాకరిస్తూ, ఇక్కడ కూడా రాజకీయాలా? అని ప్రశ్నించారు. దీంతో సభ నుంచి పీఎంకే సభ్యులు కూడా వాకౌట్ చేశారు. అనంతరం సభలో సీఎం స్టాలిన్ ఓ తీర్మానం తీసుకొచ్చారు. ఇక జిమ్‌ల ఏర్పాటుకు పోలీసుల అనుమతి లేదని ఆ తీర్మానం ద్వారా ప్రకటించారు.



సభ నుంచి బయటకు వస్తున్న అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

అన్ని బిల్లులనూ ఆమోదించాలి

- డీఎంకే మిత్రపక్షాల డిమాండ్
- గవర్నర్‌కు వ్యతిరేకంగా నిరసన సభ

సాక్షి, చెన్నై: రాజ్ భవన్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రభుత్వ బిల్లులు, తీర్మానాలను త్వరితగతిన ఆమోదించాలని గవర్నర్ ఆర్‌ఎన్ రవిని డీఎంకే కూటమి కోరింది. గవర్నర్ తీరుకు నిరసనగా డీఎంకే కూటమి నేతృత్వంలో బుధవారం రాత్రి సైదాపేట తేరడి దిడల్‌లో సభ జరిగింది. గవర్నర్ ఆర్‌ఎన్ రవికి వ్యతిరేకంగా చలో రాజ్ భవన్ కార్యక్రమానికి డీఎంకే కూటమిపిలుపు నిచ్చిన విషయం తెలిసిందే. అయితే అసెంబ్లీ వేదికగా సీఎం స్టాలిన్ గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయడం, తక్షణం ఆన్‌లైన్ రమ్మీనిషేధం చట్టానికి గవర్నర్ ఆమోదించడం వంటి పరిణామాలతో చలో రాజ్‌భవన్‌ను నిరసన సభగా మార్చారు. గవర్నర్ తీరును ఖండిస్తూ, స్టెరిలైట్ పోరాటంలోకి విదేశీ నిధులు వచ్చినట్టుగా చేసిన ఆరోపణలకు వివరణ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర బిల్లులను ఆమోదించాలని పట్టుబట్టారు. ఇందులో డీఎంకే తరపున ఎంపీ టీఆర్ బాలు, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ఎండీ ఎంకే నేత వైగో, వీసీకే నేత తిరుమావళవన్, సీపీఎం నేత బాలకృష్ణన్, సీపీఐ నేత ముత్తరసన్ తదితర డీఎంకే కూటమి నేతలు ఈ నిరసన సభకు హాజరై గవర్నర్‌కు వ్యతిరేకంగా విరుచుకు పడ్డారు. అసెంబ్లీలో చేసిన తీర్మానం మేరకు తీర్మానాలు, ముసాయిదాల ఆమోదం నిమిత్తం గవర్నర్‌లకు గడువు పరిమితి నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

ఆత్తూరు తమలపాకుకు భౌగోళిక గుర్తింపు

సాక్షి, చెన్నై: తూత్తుకుడి జిల్లా ఆత్తూరు పరిసరాలలో పండించే తమలపాకుకు భౌగోళిక గుర్తింపు (పేటెంట్) దక్కింది. వివరాలు.. తూత్తుకుడి జిల్లా పరిధిలోని ఆత్తూరు, వెల్ల కోవిల్ పరిసరాల్లో 500 ఎకరాల్లో పండించే తమల పాకుకు ప్రత్యేకత ఉంది. ఇది వారం రోజులైనా స్వచ్ఛత కోల్పోకుండా ఉంటుంది. ఈ పంటకు తామర భరణి నది నీటిని ఉపయోగిస్తున్నారు. ఇక్కడి నుంచి దేశంలోని పలు రాష్ట్రాలకు ఈ తమల పాకును ఎగుమతి చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ తమలపాకుకు జియోగ్రాఫికల్ ఇండికేషన్(జీఐ) దక్కింది. ఇందుకు సంబంధించిన ప్రకటన బుధవారం వెలువడడంతో తమల పాకు ఉత్పత్తిలో ఉన్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ పంటకు జీఐ గుర్తింపు రావడం ఆనందంగా ఉన్నా, తమను ఆదుకునే విధంగా ఇకనైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తమ పంటకు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రత్యేక రాయితీలతో తమకు రుణాలు అందజేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



తమలపాకుల తోట

సీఈసీకి 10 రోజుల గడువు

- ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు
- అన్నాడీఎంకే పిటిషన్‌పై ముగిసిన విచారణ
- పళని ఎంపికను ఆమోదించేనా..?

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలు, ప్రధాన కార్యదర్శిగా పళని స్వామి ఎంపికను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదిస్తుందా..? లేదా..? అనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఢిల్లీ హైకోర్టులో పళని స్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ బుధవారం ముగించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) విజ్ఞప్తి మేరకు 10 రోజులు గడువు విధిస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. వివరాలు.. అన్నాడీఎంకేలో పళని, పన్నీరు మధ్య విభేదాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పగ్గాలను పళని స్వామి చేజిక్కించుకున్నా, ఇంత వరకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదించ లేదు. ఈ పరిస్థితుల్లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను అస్త్రంగా చేసుకుని ఈరోడ్ ఉప ఎన్నిక తరహాలో మరోమారు రెండాకు గుర్తు కై వసం, ఎన్నికల్లో అన్నాడీఎంకే పేరుతో పోటీకి అనుమతి, ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామిని అంగీకరించే విధంగా కేంద్ర ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడికి కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందులో భాగంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి తరపున ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో కోలార్, కేజీఎఫ్, గాంధీనగర్‌లో పోటీ చేసి అన్నాడీఎంకే గెలిచిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం ఎన్నికలో తమ అభ్యర్థులను నిలబట్టేందుకు అవకాశాలు కల్పించే విధంగా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.



పళనిస్వామి

వాడీవేడిగా వాదనలు..

అలాగే అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం, తీర్మానాల విషయంగా కోర్టు ఇచ్చిన తీర్పును గుర్తు చేస్తూ, పార్టీ ప్రధాన కార్యదర్శిగా పళని స్వామిని అంగీకరించాలని ఆ పిటిషన్ ద్వారా కోర్టుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు బెంచ్ విచారించింది. పన్నీరు సెల్వం తరపున పళని స్వామి విజ్ఞప్తికి వ్యతిరేకంగా న్యాయవాదులు వాదనను వినిపించారు. అన్నాడీఎంకే వ్యవహారంలో ప్రధాన కేసు మద్రాసు హైకోర్టులో విచారణలో ఉన్నట్లు గుర్తు చేశారు. ఈ సమయంలో ఎలా కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని, ఇందుకు అవకాశం ఇవ్వకూడదని వాదించారు. పళని స్వామి తరపు న్యాయవాదులు తమ వాదనలో గత ఏడాది జూలై 11న జరిగిన సర్వ సభ్యతీర్మానాలు, మద్రాసు హైకోర్టు తీర్పులు, ప్రధాన కార్యదర్శిగా పళని స్వామి ఎంపిక గురించి వివరిస్తూ, కర్ణాటక ఎన్నికల ప్రస్తావన తీసుకొచ్చారు. చివరకు కేంద్ర ఎన్నికల కమిషన్ తరపున హాజరైన న్యాయవాదులు స్పందిస్తూ ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకునేందుకు 10 రోజులు సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు అంగీకరించిన కోర్టు పది రోజులు గడువు ఇస్తూ, పళని స్వామి పిటిషన్ విచారణను ముగించారు. దీంతో కేంద్ర ఎన్నికల కమిషన్ పళనిస్వామికి అనుకూలంగా నిర్ణయం తీసుకునేనా..? లేదా మద్రాసు హైకోర్టులో ఉన్న కేసును సాకుగా చూపించి దాట వేస్తుందా..? అనే విషయంలో స్పష్టత రావడం లేదు.

తుది తీర్పునకు కట్టుబడాల్సిందే..

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి నేతృత్వంలో ఈనెల 16వ తేదీన పార్టీ కార్యవర్గ సమావేశానికి ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. దీనిని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం హైకోర్టులో పిటిషన్ వేశారు. బుధవారం ఈ పిటిషన్ హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ, పార్టీలో ప్రస్తుతం పన్నీరు సెల్వం పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆయన్ని పార్టీ నుంచి తొలగించారని పన్నీరు తరపున న్యాయవాదులు వివరణ ఇచ్చారు. వాదనల అనంతరం ఈ సమావేశానికి స్టే ఇవ్వడానికి న్యాయమూర్తి నిరాకరించారు. తదుపరి విచారణను 20వ తేదీకి వాయిదా వేస్తూ, ఏ నిర్ణయమైనా తుది తీర్పునకు కట్టుబడాల్సిందేనని స్పష్టం చేశారు.

జర భద్రం!



- రానున్న ఐదు రోజులు భారీగా పెరగనున్న ఉష్ణోగ్రతలు
- వాతావరణ కేంద్రం హెచ్చరిక
- పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో ఐదు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం అధికారులు బుధవారం హెచ్చరించారు. ఈ రోజుల్లో వడగాల్పులతో భానుడి ప్రతాపం ఉంటుందని, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వివరాలు.. రాష్ట్రంలో ఏటా వేసవిలో ఎండల తీవ్రత అధికంగానే ఉంటోంది. ఫిబ్రవరి నెలాఖరు, మార్చిలోనే ప్రభావం పెరుగుతుంటుంది. అయితే ఈ ఏడాది అకాల వర్షాల కారణంగా భానుడి ప్రతాపం మార్చిలో పెద్దగా కనిపించలేదు. ఏప్రిల్ మొదటి వారం నుంచి మాత్రం క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తూర్పు, పశ్చిమ దిశల నుంచి వచ్చే గాలులు ఒకే చోట కలుస్తున్న నేపథ్యంలో ఎండ ప్రభావం తమిళనాడుతో పాటు పుదుచ్చేరిలో అధికంగా ఉంటుందని వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న ఐదు రోజులు గాలిలో తేమకరువై వడగాల్పుల ప్రభావం అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయని ప్రకటించింది. అగ్ని నక్షత్రం మరికొద్ది రోజులలో ప్రవేశించనున్న నేపథ్యంలో ఇక, ఎండలు మరింతగా మండుతాయని, ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరికలు జారీ అయ్యాయి.

అప్రమత్తత తప్పనిసరి..

చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు, తిరుపత్తూరు, రాణి పేట, వేలూరు, తిరువణ్ణామలై, విల్లుపురం, కళ్లకురిచ్చి, కడలూరు, కరూర్, తిరుచ్చి, ధర్మపురి, కృష్ణగిరి, సేలం, నామక్కల్ తదితర జిల్లాల్లో సాధారణ ఉష్ణోగ్రత కంటే, అధికంగా మూడు డిగ్రీలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది. చెన్నైలో అత్యధికంగా 35 డిగ్రీల వరకు ఉండొచ్చని సూచించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వృద్ధులు, పిల్లలు మరింత జాగ్రత్తలు పాటించాలన్న వైద్యులు హెచ్చరిస్తున్నారు. వేసవి నేపథ్యంలో ఇప్పటికే పుచ్చకాయలు, ద్రాక్ష, ఆరంజి, పైనాపిల్ తదితర పండ్ల వ్యాపారం ఊపందుకుది. ఇక, ఇళ్లల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం మరింతగా పెరిగే అవకాశాలున్నాయి.



తమిళ ఉగాదికి..

చెన్నైలో 300 అదనపు బస్సులు

- వరుస సెలవులు
- స్వస్థలాలకు వెళ్తున్న జనం

సాక్షి, చెన్నై: తమిళ కొత్త సంవత్సరం (ఉగాది) సందర్భంగా ఈసారి వరుస సెలవులు రానున్నాయి. దీంతో జనం స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో చెన్నై నుంచి పలు ప్రాంతాలకు సాధారణ బస్సులతో పాటు అదనపు బస్సులు నడపాలని రవాణా సంస్థ నిర్ణయించింది. వివరాలు.. ఈనెల 14వ తేదీ శుక్రవారం తమిళ కొత్త సంవత్సరం(ఉగాది). ఈ రోజు అధికారిక సెలవు రోజు. మరుసటి రోజున శని, ఆదివారాలు వరుసగా రావడంతో సెలవులు పెరిగాయి. దీంతో చెన్నై నగరంలో వివిధ పనులు, ఉద్యోగాల నిమిత్తం నివాసం ఉన్నవారు స్వగ్రామాలకు వెళ్తున్నారు. రద్దీ నేపథ్యంలో రవాణా సంస్థ చెన్నై నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించింది. రోజు వారి సాధారణంగా నడిచే బస్సులతో పాటు ప్రత్యేకంగా 300 బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. ఇతర నగరాలలోనూ ప్రయాణికుల సంఖ్యను బట్టి అదనపు బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే, రంజాన్ పండుగ సందర్భంగా కూడా ప్రత్యేక బస్సులను నడిపే విధంగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు.



క్లుప్తంగా

వేలూరులో నలుగురికి కరోనా



క్రిమిసంహారక మందులు చల్లుతున్న కార్పొరేషన్ సిబ్బంది

వేలూరు: వేలూరు నేతాజీ నగర్‌కు చెందిన ఓ వృద్ధునికి కరోనా ఉన్నట్లు మంగళవారం సాయంత్రం వైద్య పరీక్షల్లో తేలింది. దీంతో ఆయన్ని, వారి కుటుంబసభ్యులను ఇంట్లోనే ప్రత్యేకంగా ఉంచారు. ఇదిలా ఉండగా ఆయన భార్యకు కూడా కరోనా వైరస్ వచ్చినట్లు బుధవారం ఉదయం నిర్ధారణ కావడంతో విషయం తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు ఆ ప్రాంతం పూర్తిగా క్రిమిసంహారక మందులను చల్లే పనిలో నిమగ్నమయ్యారు. అదేవిధంగా సీఎంసీ ఆస్పత్రిలోని డయాలసిస్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది ఒకరికి కూడా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో కార్పొరేషన్ సిబ్బంది అతని ఇంటి వద్ద క్రిమి సంహారక మందులను చల్లారు.

లిఫ్ట్ తెగిపడి ఉద్యోగి మృతి

అన్నానగర్: మైలాడుదురైలోని ఓ పాత్రల దుకాణంలో మంగళవారం లిఫ్ట్ తెగిపడి ఉద్యోగి మృతి చెందాడు. ఆయన మృతికి నిరసనగా బంధువులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. వివరాలు.. మైలాడుదురై సమీపంలోని తిరుమంగళం మేలతేరుకు చెందిన చోళవేందన్ (45). ఇతను మైలాడుదురై మహాదానా స్ట్రీట్‌లోని పాత్రల దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. చోళవేందన్ దుకాణం మొదటి అంతస్తులో ఉండగా లిఫ్టుపై సరుకులను లోడ్ చేశాడు. దీంతో లిఫ్టుకు ఉన్న తాడు తెగి కింద పడింది. ఇందులో చోళవేందన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు రక్షించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. పోలీసులు చోళవేందన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మైలాడుదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చోళవేందన్ మృతి అనుమానాలున్నాయంటూ అతని బంధువులు మైలాడుదురై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ మైలాడుదురై ప్రభుత్వాసుపత్రి రోడ్డు జంక్షన్ సమీపంలో నిరసనకు దిగారు. మైలాడుదురై డిప్యూటీ ఎస్పీ సంజీవ్‌కుమార్ వారితో చర్చలు జరిపి నిరసనను విరమించారు. మృతుడు చోళవేందన్‌కు భార్య కమల, కుమారులు లోకేష్ (11), మోహిత్ (08) ఉన్నారు.

ఉన్నత విద్యలో ముందంజ

వేలూరు: దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో తమిళనాడు ముందంజలో ఉందని చాన్స్‌లర్ విశ్వనాథన్ అన్నారు. వేలూరు వీఐటీ ఆవరణలో యూనివర్సిటీ, వార్షిక క్రీడా దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అవార్డు పొందిన వారిలో అధికంగా బాలికలే ఉండడం అభినందనీయమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు.

వీఐటీకి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వీఐటీ ప్రపంచంలోని టాప్ 200 యూనివర్శిటీలో ర్యాంక్ కోసం ప్రయత్నం చేస్తుందన్నారు. వీఐటీలోని అందరికీ ఉన్నత విద్యా పథకం ద్వారా ఇప్పటివరకు రూ.8.5 కోట్లు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశామన్నారు. ఇందులో 50 శాతం వీఐటీ యూనివర్సిటీ అందజేస్తుందన్నారు. ఢిల్లీ హైకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి మురుగేశన్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో ఇతర దేశాలతో తీసుకుంటే మన దేశంలో నిధుల కేటాయింపు తక్కువగా ఉందన్నారు. విద్యార్థులు చదువుకునే సమయంలో క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్, జీవీ సెల్వం, వీఐటీ వైస్ చాన్స్‌లర్ రాంబాబు కోడాలి, చాన్స్‌లర్ పార్థసారథి మల్లిక్, క్రీడా డైరెక్టర్ త్యాగ చందన్, రిజిస్ట్రార్ జయభారతి పాల్గొన్నారు.



అవార్డును అందజేస్తున్న చాన్స్‌లర్ విశ్వనాథన్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

తిరువళ్లూరు: వేసవి ప్రారంభమైన నేపథ్యంలో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కౌన్సిలర్లు పాలక వర్గానికి సూచించారు. అలాగే వన్నియర్‌లకు 10.5 శాతం ప్రత్యేక రిజర్వేషన్లను అమలు చేయాలని అసెంబ్లీలో వాకౌట్ చేసిన పీఎంకే ఎమ్మెల్యేలకు మద్దతుగా జెడ్పీ సమావేశం నుంచి ఆ పార్టీ కౌన్సిలర్ వాకౌట్ చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. వివరాలు.. తిరువళ్లూరు జెడ్పీ సమావేశం చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి అధ్యక్షతన బుధవారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా కౌన్సిలర్లు చైర్‌పర్సన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, నిధుల కేటాయింపులోనూ తీవ్ర అన్యాయం జరుగుతున్నట్లు వాపోయారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం పీఎంకే కౌన్సిలర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వన్నియర్లకు 10.5 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. దీనిపై పలుమార్లు వినతిపత్రం సమర్పించినా ఇంత వరకు ఫలితం లేకుండా పోయింది. అయితే జిల్లా సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై చర్చించడానికి చైర్‌పర్సన్ అనుమతి ఇవ్వకపోవడంతో సమావేశం నుంచి వాకౌట్ చేసి తమ నిరసననూ వ్యక్తం చేశారు. కాగా ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ దేశింగుతో పాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి

బాలికపై అత్యాచారం
– నిందితుడి అరెస్టు

అన్నానగర్: తెన్ తామరైకులం సమీపంలో 16 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన నలుగురు పిల్లల తండ్రిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. నెల్‌లై జిల్లా పళవూర్ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక కుమారి జిల్లా అంజు గ్రామం ప్రాంతంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. ఇటీవల పనికి వెళ్లిన బాలిక ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బాలిక తల్లిదండ్రులు కన్యాకుమారి మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో బాలికను కలందపనైకి చెందిన ఇసకిముత్తు (24) ప్రేమ పేరుతో కిడ్నాప్ చేసి ఇంటి సమీపంలోని కొబ్బరి తోటలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. బుధవారం బాలికతో పాటు ఇసకిముత్తును పట్టుకున్న పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా అరెస్టు అయిన ఇసక్కిముత్తుకు ఇప్పటికే వివాహమై భార్య, నలుగురు పిల్లలు ఉండడం గమనార్హం.

బస్సులో నుంచి దూకి మహిళ ఆత్మహత్య

సాక్షి, చెన్నై: మదురై తిరుమంగళం సమీపంలోని నడుస్తున్న మహిళా స్పెషల్ బస్సులో నుంచి బుధవారం సాయంత్రం ఓ మహిళ కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. వంద రోజుల ఉపాధి పథకం నిమిత్తం విధులకు వెళ్లిన ఈ మహిళను పంచాయతీ వార్డు సభ్యులు వేధించడమే ఈ బలన్మరణానికి కారణమని విచారణలో తేలింది. మదురై జిల్లా తిరుమంగళంకు చెందిన గణేషన్, నాగలక్ష్మి దంపతులకు ఐదుగురు ఆడ బిడ్డలు. బిడ్డల్ని పోషించడం భారంగా మారడంతో కలెక్టర్‌కు నాగలక్ష్మి విజ్ఞప్తి పెట్టుకున్నారు. దీంతో ఆమెకు మయ్యత్తాన్ పట్టి పంచాయతీలో 100 రోజుల ఉపాధి పథకం పర్యవేక్షణ పని అప్పగించారు. అయితే, ఆమెకు వ్యతిరేకంగా ఆ పంచాయతీ వార్డు సభ్యులు ముత్తు, వీరకుమార్, బాల మురుగన్ గత నెల రోజులుగా ఆమెను వేధించడం, పని అప్పగించకపోవడంతో వ్యవహారం మళ్లీ కలెక్టరేట్ వరకు వెళ్లింది. ఈ పరిస్థితులలో బుధవారం ఆ గ్రామం నుంచి తిరుమంగళం వైపుగా వెళ్తున్న మహిళా స్పెషల్ బస్సులో నాగలక్ష్మి పయనించారు. బస్సు వేగంగా వెళ్తున్న సమయంలో హఠాత్తుగా ఆమె బస్సు నుంచి కిందకు దూకేశారు. తీవ్రగాయాలతో ఘటనాస్థలంలోనే మృతిచెందారు. ఈ సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. విచారణలో వార్డు కౌన్సిలర్లు ఆమెను తీవ్రంగా వేధించినట్టు, మానసికంగా కృంగిన ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు తేలింది. అజ్ఞాతంలోకి వెళ్లిన వార్డు కౌన్సిలర్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

తిరుత్తణిలో న్యాయవాదుల ధర్నా

తిరుత్తణి: తిరుత్తణి కోర్టులో అంబేడ్కర్ చిత్రపటాన్ని తొలగించడంతో ఆగ్రహం చెందిన న్యాయవాదులు బుధవారం ధర్నా చేశారు. తిరుత్తణి కంబైన్డ్ కోర్టులో రెండు నెలల కిందట మూడు అంబేడ్కర్ చిత్రపటాలను న్యాయవాదులు ఏర్పాటు చేశారు. అయితే కొత్తగా న్యాయస్థానాల్లో నాయకుల చిత్రపటాలు ఏర్పాటు చేయరాదన్న కోర్టు ఆదేశాల నేపథ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చిత్రపటాలు తొలగించాలని న్యాయవాదులకు న్యాయమూర్తి సమయం ఇచ్చారు.అయితే న్యాయవాదులు పట్టించుకోకపోవడంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు బుధవారం ఉదయం కోర్టు సిబ్బంది తొలగించారు. దీంతో ఆగ్రహం చెందిన న్యాయవాదులు కోర్టు ఆవరణలో ధర్నా చేశారు. అంబేడ్కర్ చిత్రపటాలు తొలగించడం అన్యాయమని రాజ్యాంగ రూపకర్తకు చేస్తున్న న్యాయం ఇదేనా అంటూ నినాదాలు చేశారు. 14న అంబేడ్కర్ జయంతిలోపు కోర్టులో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో అంబేడ్కర్ చిత్రపటాలు ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో విధులను బహిష్కరించి ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు.



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

రాష్ట్రంలో విస్తృతంగా పెట్టుబడులు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో తమ సంస్థ నేతృత్వంలో విస్తృతంగా పెట్టుబడులు పెట్టనున్నామని హర్మాన్ ఆటోమోటివ్ ఇంజినీరింగ్ ఎండీ ప్రతాప్ దైవనాయగం తెలిపారు. హర్మాన్ ఆటో మోటివ్, ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ సేవల విస్తృతం గురించి బుధవారం ఆయన స్థానికంగా వివరించారు. ఈ ఏడాది చివరి నాటికి చెన్నైలో 200 మంది ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులకు అవకాశం కల్పించనున్నామని తెలిపారు. చెన్నై కేంద్రంగా ఆటోమోటివ్ గ్రేడ్‌ను ఏర్పాటు చేశామని, గ్లోబల్ ఆటో ఎకోసిస్టమ్ అభివృద్ధికి దోహద పడే విధంగా తమ సేవలు ఉంటాయని వివరించారు. 10 వేల మందికి ఉపాధి కల్పన, విస్తృతంగా పెట్టుబడులతో తమ కార్యకలాపాలను మరింతగా ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

అన్నానగర్: పళని మురుగన్ ఆలయంలో బుధవారం పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. వివరాలు.. దిండుక్కల్ జిల్లా పళని మురుగన్ ఆలయంలో 330 మంది కార్మికులు ప్రైవేటు కాంట్రాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పళని దండపాణి స్టేషన్ వద్దకు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పళని మురుగన్ ఆలయంలో 15 ఏళ్లకు పైగా కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నామన్నారు. ఏళ్ల తరబడి వేతనాలు పెంచడం లేదని ఆరోపించారు. పళని పోలీసులు, ఆలయ అధికారులు పారిశుధ్య కార్మికులతో చర్చలు జరిపారు. వచ్చే నెల (మే) వేతనాలు పెంచుతామని ఆలయ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో పారిశుధ్య కార్మికులు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఘనంగా 110 ఏళ్ల వృద్ధురాలి జన్మదిన వేడుకలు

అన్నానగర్: ముదుకులత్తూరు సమీపంలో 110 ఏళ్ల వృద్ధురాలికి బుధవారం జన్మదిన వేడుకలు స్థానికులు పెద్దఎత్తున నిర్వహించారు. వివరాలు.. రామనాథపురం జిల్లా ముదుకులత్తూరు సమీపంలోని పేరైయూర్ గ్రామానికి చెందిన రామాయి (110) గతంలోనే ఆమె భర్త మరణించారు. ఆమెకు బిడ్డలు లేరు. ఈ నేపథ్యంలో స్థానికులకు ప్రకృతి వైద్యం చేస్తూ ప్రస్తుతం జీవనం సాగిస్తోంది. బుధవారం ఆమె 110వ పుట్టిన రోజు కావడంతో గ్రామస్తులు ఏకమై సంబరాలు చేసుకున్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



సరక్కు ఫస్ట్‌లుక్ విడుదల



సరక్కు చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్

తమిళసినిమా: సంచలన నటుడు మన్సూర్ అలీఖాన్ ఒక పక్క విలన్, కమిడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటిస్తూనే మరో పక్క హీరోగానూ నటిస్తున్నారు. అలా తాజాగా ఈయన కథానాయకుడిగా నటిస్తూ, తన రాజ్ కెనడీ ఫిలింస్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రం సరక్కు. నటి వలినా ప్రిన్స్ కథానాయకిగా నటిస్తున్న ఇందులో ప్రత్యేక పాత్రలో నాంజిల్ సంపత్ నటిస్తున్నారు. మొట్టై రాజేంద్రన్, కోదండం, కింగ్‌స్టీ, శేషు, దీనా, రవిమరియ, లొల్లు సభ మనోహర్, మూసా, మధుమిత, వినోదిని, లియాఖత్ అలీఖాన్, పైల్‌వాన్ రంగనాథన్, భారతీ కన్నన్ ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. చిత్ర కథను మన్సూర్ అలీఖాన్ తెలుపుతూ తమిళనాడును నాశనం చేస్తున్న మద్యం ఇతివృత్తంతో తెరకెక్కిస్తున్న చిత్రం ఇదని చెప్పారు. చిత్ర షూటింగ్ వేగంగా జరుగుతోందని తెలిపారు. దీనికి జయకుమార్.జే దర్శకత్వం వహిస్తున్నారు. సిద్ధార్థ్ విపిన్ సంగీతాన్ని, అరుళ్ విన్సెంట్, మహేశ్ ద్వయం ఛాయాగ్రహణం అందిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను బుధవారం మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఆవిష్కరించారు.

ఉగాది ఎప్పటికీ ప్రత్యేకమే



నటి నమిత

తమిళసినిమా: ఉగాది పర్వదినం ఎప్పటికీ ప్రత్యేకమే అని సినీనటి నమిత అన్నారు. వివరాలు.. తమిళ ఉగాది పండగను డిశంబర్ 31గా దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి గతంలో మార్చిన విషయం తెలిసిందే. అయితే చాలామంది ఏప్రిల్ 14వ తేదీనే తమిళ ఉగాదిగా జరుపుకుంటున్నారు. మరికొందరు మాత్రం దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకప్పటి కుర్రకారు కలల నటి నమిత కూడా డిశంబర్ 31వ తేది తమిళ ఉగాది కాదు అని పేర్కొన్నారు. దక్షిణాది సినీ పరిశ్రమలో గ్లామర్ క్వీన్‌గా వెలిగిన ఈమె తమిళంలో నటుడు విజయ్‌కాంత్‌కు జంటగా ఎంగళ్ అన్న చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయ్యారు. తరువాత సత్యరాజ్, విజయ్, అజిత్, శరత్‌కుమార్ వంటి స్టార్ హీరోలతో జత కట్టి పాపులర్ అయ్యారు. అభిమానులను మచ్చాన్ అంటూ ముద్దుగా సంబోధిస్తూ వారి కలల రాణిగా మారారు. 2017లో తన ప్రేమికుడు వీరేంద్ర చౌదరిని పెళ్లి చేసుకుని నటనకు దూరమయ్యారు. ఇటీవల కవల పిల్లలకు జన్మనిచ్చిన నమిత అంతకు ముందే రాజకీయరంగ ప్రవేశం చేశారు. భారతీయ జనతా పార్టీలో చేరి ప్రస్తుతం ఆ పార్టీలో కార్యవర్గ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా ఈమె మంగళవారం ఒక వీడియోను మీడియాకు విడుదల చేశారు. అందులో అందరికీ తమిళ నూతన సంవత్సర శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. అదే విధంగా తమిళ ఉగాది డిశంబర్ 31వ తేదీ కాదనీ, ఏప్రిల్ 14నేనని అన్నారు. తమిళ ఉగాది త్వరలోనే రానుందని, మీరంతా కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. ఈ ప్రస్తుతం ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

కోలీవుడ్ టాక్స్

తలైవా ఇస్లామియా అవతారం?

తమిళసినిమా: ఏడు పదుల వయస్సులోనూ నటుడు రజనీకాంత్ సినిమాల విషయంలో తగ్గేదేలే అన్నట్లు దూసుకెళ్తున్నారు. ఇప్పటికీ సూపర్‌స్టార్‌గా వెలిగిపోతున్న ఈయన ప్రస్తుతం జైలర్ చిత్రంలో నటిస్తున్నారు. నెల్సన్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రమ్యకృష్ణ, తమన్న, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, తెలుగు నటుడు సునిల్, బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుంది. కాగా రజనీకాంత్ తన కూతురు దర్శకత్వం వహిస్తున్న లాల్ సలామ్ చిత్రంలో అతిథి పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో గెస్ట్ అయినా పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం. నటుడు విష్ణువిశాల్, విక్రాంత్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్ర షూటింగ్ కూడా దాదాపు పూర్తయ్యింది. దీంతో రజనీకాంత్ తన 170వ చిత్రానికి రెడీ అవుతున్నారు. జైభీమ్ చిత్రం ఫేమ్ జ్ఞానవేల్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్న ఈ చిత్రం ఓ యదార్థ ఘటన ఆధారంగా తెరకెక్కిస్తునట్లు సమాచారం. లైకా సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే సెట్‌పైకి వెళ్లనున్నట్లు తెలిసింది.కాగా ఇందులో రజనీకాంత్ మాజీ పోలీస్ అధికారిగా నటించనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.



రజనీకాంత్

ఢిల్లీలో శివకార్తికేయన్ ట్రైనింగ్



శివకార్తికేయన్
సాయిపల్లవి

తమిళసినిమా: నటుడు శివకార్తికేయన్ ఇటీవల నటించిన ప్రిన్స్ చిత్రం నిరాశపరిచినా, తర్వాత వరుస చిత్రాలతో తెరపైకి రావడానికి సిద్ధం అవుతున్నారు. ఈయన నటించిన అయిలాన్ చిత్రం దీపావళికి తెరపైకి రావడానికి సిద్ధం అవుతున్నట్లు తాజా సమాచారం. కాగా ప్రస్తుతం మండేలా అశ్విన్ దర్శకత్వంలో మావీరన్ చిత్ర షూటింగ్‌ను పూర్తి చేశారు. ఇందులో ఆయనకు జంటగా దర్శకుడు శంకర్ వారసురాలు అతిథి శంకర్ కథానాయకిగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని నవంబర్ నెలలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం శివకార్తికేయన్ నటుడు కమలహాసన్ సోనీ సంస్థతో కలిసి తన రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించనున్న చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నారని తాజా సమాచారం. ఇందులో ఆయనకు జంటగా సాయిపల్లవి నటించనున్నారు. చిన్న గ్యాప్ తరువాత ఈమె నటించనున్న తమిళ చిత్రం ఇది. కాగా రంగూన్ చిత్రం ఫేమ్ రాజ్ కుమార్ పెరియసామి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇప్పటికే మొదలైనట్లు తెలిసింది. ఇది 1960 ప్రాంతంలో జరిగే పీరియాడిల్ యాక్షన్, డ్రామా కథా చిత్రంగా ఉంటుందని సమాచారం. శివకార్తికేయన్ ఇందులో సైనికుడిగా నటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో పాత్ర కోసం ఆయన ఢిల్లీలో 20 రోజుల పాటు ట్రెనింగ్ అవుతున్నట్లు కోలీవుడ్ వర్గాల టాక్. ఇది ఆయన నటిస్తున్న 21వ చిత్రం అనేది గమనార్హం. చిత్ర షూటింగ్ వచ్చే నెల కశ్మీర్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ప్రస్తుతం చిత్ర దర్శకుడు కశ్మీర్‌లో లోకేషన్ ఎంపికలో ఉన్నట్లు సమాచారం. దీనికి జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రం గురించి పూర్తి వివరాలు త్వరలో అధికారికంగా వెలువడే అవకాశం ఉంది. దీని తరువాత శివకార్తికేయన్ ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో నటించనున్నట్లు సమాచారం.

శరవేగంగా సూర్య 42

తమిళసినిమా: జాతీయ ఉత్తమ నటుడు సూర్య వరుస విజయాలతో జోరు మీదున్నారు. జై భీమ్ చిత్రం తరువాత ఈయన కమలహాసన్ కథానాయకుడిగా నటించిన విక్రమ్ చిత్రంలో రోలెక్స్ అనే అతిథి పాత్రలో నటించారు. అదే విధంగా బాలా దర్శకత్వంలో వణంగాన్ అనే చిత్రంలో నటించారు. అయితే ఆ చిత్ర షూటింగ్ మధ్యలోనే ఆయన బయటకు వచ్చేసిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం శివ దర్శకత్వంలో భారీ హిస్టారికల్ కథా చిత్రంలో నటిస్తున్నారు. ఇది సూర్య నటిస్తున్న 42వ చిత్రం. ఇందులో బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ నాయకిగా నటిస్తున్నారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్, స్టూడియో గ్రీన్ కేఈ జ్ఞానవేల్ రాజా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 3డీ ఫార్మెట్‌లో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని 10 భాషల్లో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ చిత్రానికి ఇంకా పేరు నిర్ణయించలేదు. కాగా తాజాగా చిత్ర పేరును ఎప్పుడు వెల్లడించేది మంగళవారం ఓ పోస్టర్ ద్వారా తెలిపారు. అందులో సూర్య గుర్రంపై ఓ కొండ నుంచి మరో కొండపైకి స్వారీ చేస్తున్న ఫొటోను పొందుపరిచారు. అదే విధంగా చిత్ర టైటిల్‌ను ఈ నెల 16వ తేదీన ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో సూర్య అభిమానులు ఆ ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



నటుడు సూర్య

క్లుప్తంగా

ముగ్గురు నకిలీ వైద్యుల అరెస్ట్

అన్నానగర్: ఫిలిప్పీన్స్ దేశంలో ఎంబీబీఎస్ చదివినట్లు చెప్పుకుంటూ క్లినిక్ నిర్వహిస్తున్న ముగ్గురు నకిలీ వైద్యులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలు.. వైద్యశాఖ అసోసియేట్ డైరెక్టర్ చంద్ర నేతృత్వంలోని బృందం పలుచోట్ల తనిఖీలు చేపట్టింది. ఈ ఆసమయంలో కేజే పేరుతో పెరియనాయకన్ పాళయం జ్యోతిపురానికి చెందిన జయజ్యోతి (36) క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తేలింది. ఇది స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న మనోజ్ కుమార్ మెడికల్ రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్నట్లు తేలింది. దీంతో జయజ్యోతి, శివగంగైకి చెందిన సతీష్‌కుమార్ (26), భువనేశ్వరన్ (28)ను అరెస్టు చేశారు. వారు ఫిలిప్పీన్స్‌లో వైద్యకోర్సులు చదివినట్లు చెప్పడం గమనార్హం కరమడై పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలప దుకాణంలో అగ్నిప్రమాదం



దగ్ధమవుతున్న కలప దుకాణం

అన్నానగర్: దిండుక్కల్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి కలప దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఫలితంగా రూ.లక్షల విలువైన కలప దగ్ధమైంది. వివరాలు.. దిండుక్కల్ సమీపంలో చెట్టినాయకన్ పట్టికి చెందిన బాలసుబ్రమణి (40). దిండుక్కల్ సమీపంలోని నందనపట్టిలో కలప దుకాణం నడుపుతున్నాడు. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దిండుక్కల్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు గంటకు పైగా పోరాడి మంటలను ఆర్పారు. అయితే దుకాణంలో రూ.లక్షల విలువైన కలపలు, వస్తువులు కాలి బూడిదయ్యాయి. దాడికొంబు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ ఐటీ విభాగం నేత అరెస్ట్

సాక్షి, చెన్నై: కోయంబత్తూరులోని బీజేపీ ఐటీ విభాగం ఉపాధ్యక్షుడు సెంథిల్‌కుమార్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. రాష్ట్ర విద్యుత్, ఎక్సైజ్ శాఖా మంత్రి సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా బీజేపీ ఐటీ విభాగం సామాజిక మాధ్యమాల వేదికగా దుమ్మెత్తి పోసే విధంగా పోస్టులు పెడుతున్నారు. ఈ వ్యవహారంలో ఇది వరకు ఆ విభాగం అధ్యక్షుడిగా ఉండి, ప్రస్తుతం అన్నాడీఎంకేలో చేరిన నిర్మల్‌కుమార్‌పై మంత్రి సెంథిల్ బాలాజీ కోర్టులో పిటిషన్ కూడా వేశారు. బుధవారం ఈ పిటిషన్ విచారణ సమయంలో అన్ని పోస్టులను తొలగించాలని, ఇక మీదట మంత్రికి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాలలో పోస్టింగ్‌ల రూపంలో పెట్టకూడదని హైకోర్టు నిర్మల్‌కుమార్‌ను హెచ్చరించింది. అదే సమయంలో నిర్మల్‌కుమార్ పార్టీని వీడి అన్నాడీఎంకేలోకి వెళ్లడంతో బీజేపీ ఐటీ విభాగం నేత సెంథిల్‌కుమార్ తన వ్యాఖ్యల తూటాలతో మంత్రిపై విరుచుకు పడే పనిలో పడ్డారు. దీంతో పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. అరెస్టును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఖండించారు

జల్లికట్టు ఎద్దు మృతి



మృతిచెందిన జల్లికట్టు ఎద్దు

అన్నానగర్: సమయపురంలో సమీపంలో బుధవారం జల్లికట్టు ఎద్దు మృతిచెందింది. తిరుచ్చి జిల్లా సమయపురం సమీపంలోని నడు ఇరుంగలూరుకు చెందిన స్టీఫెన్ రైతు. ఇతను పదేళ్లుగా జల్లికట్టు ఎద్దును పెంచుతున్నాడు. తమిళనాడులోని ఆరు పొంతాల్లో జరిగిన జల్లికట్టులో ఈ ఎద్దు బహుమతులు గెలుచుకుంది. బుధవారం ఆ ఎద్దు మృతిచెందింది. అనంతరం స్టీఫెన్‌తో పాటు ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎద్దుకు పూజలు చేసి నివాళులర్పించారు. ఎద్దును స్టీఫెన్ తోటలో పాతిపెట్టారు.

కార్పొరేషన్ లారీ బోల్తా
-క్లీనర్ మృతి

అన్నానగర్: కార్పొరేషన్ లారీ బోల్తాపడి క్లీనర్ మృతిచెందాడు. చెన్నై బేసిన్‌బ్రిడ్జ్ రోడ్, థౌజండ్‌లైట్స్ రోడ్డు, చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ జోన్ 5కి చెందిన చెత్త డంప్ ఉంది. ఇక్కడ బేసిన్‌బ్రిడ్జ్ పులియాంతోపు ప్రాంతాల నుంచి రోజూ సేకరించే చెత్తను ట్రక్కుల్లో తీసుకొచ్చి డంప్ చేస్తుంటారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పులియాంతోపు అంబేడ్కర్ నగర్ ప్రాంతానికి చెందిన సుధాకర్ (52) అనే లారీ డ్రైవర్ చెత్తను సేకరించాడు. ఆ తరువాత చెత్తకుప్ప వద్ద లారీని ఆపి చెత్త వేయడానికి సిద్ధం కాగా చెత్తలారీ లోడ్ తట్టుకోలేక బోల్తా పడింది. ట్రక్కు బోల్తాపడడంతో వెనుక నిలబడి ఉన్న చెన్నైలోని కృష్ణాపురం పేట ప్రాంతానికి చెందిన తమిళ సెల్వన్ (27) క్లీనర్ ట్రక్కు కింద ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసి వ్యాసార్పాడి అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి చెత్త లారీని తొలగించి తమిళసెల్వన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బేసిన్‌బ్రిడ్జ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తమిళుల హక్కులను పరిరక్షించుకోవాలి

తిరువళ్లూరు: తమిళుల హక్కులు, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ప్రముఖ వక్త, సినీనటి భారతి పిలుపునిచ్చారు. తిరువళ్లూరు జిల్లా పొన్నేరీలోని వేలమ్మాల్ పాఠశాల ఆవరణలో గ్రేట్ తమిళ్ డ్రీమ్ పేరిట ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా భారతి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రేట్ తమిళ్ డ్రీమ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. నేటి తరం యువకులు తమిళుల సంప్రదాయం సంస్కృతిని పరిరక్షించి భావితరాలకు అందించాలని పిలుపు నిచ్చారు. తమిళుల వారసత్వం, నాగరికత, సామాజిక ఆర్థిక పరిస్థితులు, భాషా ప్రాధాన్యత, సాహిత్యం, కళలను నేటి తరం యువతకు తెలియజేయడానికి 100 కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. బలమైన పునాదులు ఉన్న తమిళ సాహిత్యాన్ని సైతం పరిరక్షించుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు సుల్తాన్ అహ్మద్ ఇస్మాయిల్, అధ్యాపకులు, తమిళ సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. చివరిలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రముఖ వక్త సినీనటి భారతి

సంక్షేమ పథకాలపై సమీక్ష



సమీక్షకు హాజరైన సర్పంచ్‌లు



సమీక్ష నిర్వహిస్తున్న సహాయ కలెక్టర్ రిషబ్

పళ్లిపట్టు: గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి సహాయ కలెక్టర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆర్కేపేట యూనియన్‌లోని 38 గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పనులకు సంబంధించి సమీక్ష ఆర్కేపేట బీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. సహాయ కలెక్టర్ రిషబ్ ఆధ్వర్యంలో పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించి తనిఖీ, నిధులు, పనుల నాణ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ డివిజన్ ఇంజినీర్ సుమతి, బీడీఓలు కలైసెల్వి, వెంకటేశన్, బీడీఓ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను
సద్వినియోగం చేసుకోండి

- కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మందాలిక శ్రీనివాస్

కొరుక్కుపేట: ఎగుమతిదారులకు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి తమిళనాడు పుదుచ్చేరి రాష్ట్రాల జీఎస్టీ, సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మందాలిక శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వాణిజ్య సౌలభ్యంపై పరస్పర సమావేశం బుధవారం సాయంత్రం స్థానిక ఆళ్వార్‌పేటలోని సవేరాలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మందాలిక శ్రీనివాస్ మాట్లాడుతూ మేక్ ఇన్ ఇండియాతో ఎగుమతి, దిగుమతి దారులకు వ్యాపారాభివృద్ధికి దోహదపడిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎగుమతిదారులకు అనేక ప్రభుత్వ పథకాలు తీసుకొచ్చిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కు ఎగుమతిదారుల సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతి పత్రాన్ని ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ కేఎస్ సురేష్ బాబు అందజేశారు. ఏసీసీ ట్రెజరర్ ఎస్ నరసింహన్, ట్రాన్స్‌పోర్ట్ సబ్ కమిటీ కో చైర్మన్ కేబీ నరసింహప్రసాద్, సెక్రటరీ జనరల్ విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ కె ఏస్ సురేష్ బాబు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న సురేష్‌బాబు

డ్రగ్ ఫ్రీ తమిళనాడే లక్ష్యం

- 14న ట్రయథ్లాన్, డ్యుయథ్లాన్



టీ షర్ట్, మెడల్‌ను ఆవిష్కరిస్తున్న ఆవడి పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్

కొరుక్కుపేట: డ్రగ్ ఫ్రీ తమిళనాడే లక్ష్యంగా ఈ నెల 14న చెన్నైలో ట్రయథ్లాన్, డ్యుయథ్లాన్ పేరిట సైకిలింగ్, స్విమ్మింగ్, రన్నింగ్ ఈవెంట్లను నిర్వహిస్తున్నట్టు ఆవడి పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ తెలిపారు. ఈ మేరకు జరిగిన విలేకరుల సమావేశంలో ముందుగా ఈవెంట్ టీషర్ట్, మెడల్‌లను ఆయన ఆవిష్కరించారు. సందీప్‌రాయ్ రాథోడ్ మాట్లాడుతూ ఇండియన్ ట్రయథ్లాన్ ఫెడరేషన్(ఐటీఎఫ్), స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ తమిళనాడు (ఎస్‌డీఏటీ), చెన్నై రన్నర్స్ క్లబ్‌ల సహకారంతో ఆవడి పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో ట్రయథ్లాన్, డ్యుయథ్లాన్ ఈవెంట్ ఈ నెల 14న జరుగుతుందన్నారు. చెన్నై పోరూర్‌లోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వేదికగా ఈవెంట్‌ను రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఈ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, దాని దుష్ప్రభావాలపై ప్రజల్లో, విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి ఆవడి పోలీసు కమిషనరేట్‌లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి డ్యుయథ్లాన్ ఈవెంట్‌ను కూడా నిర్వహిస్తున్నామని పాల్గొన్నారు. ఈవెంట్ ద్వారా సేకరించిన రూ.1,52,200 నగదును చైల్డ్ హెల్త్ అండ్ హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్- ఎగ్మూర్‌కు విరాళంగా అందజేయనున్నామని అన్నారు. ట్రయథ్లాన్, డ్యుయథ్లాన్ ఈవెంట్‌లు రెండింటినీ కలిపి రూ.3 లక్షల వరకు బహుమతులు అందిస్తున్నట్టు చెప్పారు. మహిళల ట్రయథ్లాన్ ఈవెంట్ సాయంత్రం 4గంటలకు, పురుషుల ట్రయథ్లాన్ ఈవెంట్ సాయంత్రం 4.20 గంటలకు ప్రారంభమవుతుందని, అలాగే డ్యుయథ్లాన్ ఈవెంట్ లో పురుషులు, మహిళలకు సాయంత్రం 4.45 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఎస్‌డీఏటీ మెంబర్ సెక్రటరీ మేఘనాథ్‌రెడ్డి, స్పోర్ట్ డిపార్ట్మెంట్ సెక్రటరీ అత్యుల్యా మిశ్రా పాల్గొన్నారు.

ఎక్స్‌క్యూజ్‌మీ
గంజాయి కావాలా సారూ!

- పోలీసులనే అడిగిన ఇద్దరు అరెస్ట్

కొరుక్కుపేట: సూలూరు సమీపంలో 'ఎక్స్‌క్యూజ్‌మీ గంజాయి కావాలా సారూ' అని అడిగి అడ్డంగా పట్టుబడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరు జిల్లా సూలూర్ తన్నంపాళయం ప్రాంతంలో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్టు, ఫోన్ చేసి ఆర్డర్ ఇస్తే ఇళ్లకు గంజాయిని డెలివరీ చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ నంబర్‌కు ఫోన్ చేసి గంజాయి అడగగా, అవతలి వ్యక్తి తెన్నంపాలెం నాలుగు రోడ్ల జంక్షన్‌కు వస్తే గంజాయి దొరుకుతుంది అని చెప్పారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. వారు చెప్పిన ప్రాంతానికి మఫ్టీలో పోలీసులు వెళ్లారు. ఆ ప్రాంతానికి కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు మఫ్టీలో ఉన్న పోలీసుల వద్దకు వెళ్లి 'ఎక్స్‌క్యూజ్‌మీ గంజాయి కావాలా సారూ' అంటూ ప్రశ్నించారు. వారి వద్ద నుంచి గంజాయిని తీసుకున్న పోలీసులు ఆ ఇద్దరిని వెంటనే అరెస్టు చేశారు. తర్వాత వారి వద్ద ఉన్న 4 కిలో గంజాయిని, వారు వచ్చిన లగ్జరీ కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విచారణలో వారు సోమనూరు ప్రాంతానికి చెందిన శ్రీపతి (58), సుందరాపురం ప్రాంతానికి చెందిన రాజేంద్రప్రసాద్ (48) అని తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

అన్నానగర్: కుటుంబకలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సేలం జిల్లా ప్రమిచ్చిపాళయం ప్రాంతానికి చెందిన సిండ్రెల్లా (21). శ్రీపెరంబత్తూరులోని ఓ ప్రైవేటు ఐటీ కంపెనీలో ఉద్యోగి. ఆమె భర్త నవీన్‌కుమార్ సేలంలో భవన నిర్మాణ కార్మికుడు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. సిండ్రెల్లా క్రోంపేటలో తన స్నేహితులతో ఉంటూ పనికి వెళ్లేది. అనంతరం అదే ప్రాంతంలో అద్దెకు ఇల్లు తీసుకుని ఉంటోంది. దీంతో కొన్ని నెలలుగా సిండ్రెల్లా బిడ్డతో ఇక్కడికి రావాలని భర్తను వేధిస్తోంది. భర్త నవీన్‌కుమార్ నిరాకరించడంతో మనస్తాపం చెంది బుధవారం తెల్లవారుజామున సిండ్రెల్లా ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం క్రోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు విచారణ చేస్తున్నారు.

పంటలపై ఏనుగు దాడి



పంట పొలాలకు వచ్చిన ఏనుగు

వేలూరు: పంటలను ఓ అడవి ఏనుగు ధ్వంసం చేసింది. వేలూరు జిల్లా పేర్నంబట్టు సమీపంలోని ఎరుక్కంబట్టు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోపాల్. ఇతని భార్య కోకిల(51) వీరికి ఎరుక్కంబట్టు అటవీ ప్రాంతం సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. ఇందులో వరి పంట వేశారు. వ్యవసాయ పంటలను చూసేందుకు బుధవారం ఉదయం 6 గంటల సమయంలో దంపతులు ఇద్దరూ వెళ్లారు. ఆ సమయంలో ఆంధ్ర అటవీ ప్రాంతం నుంచి బత్తలపల్లి హౌసింగ్‌బోర్డు దారిలో వ్యవసాయ పొలాల వద్దకు ఏనుగు రావడాన్ని కోకిల దంపతులు గమనించారు. వెంటనే ఏనుగును చూసి కేకలు వేశారు. ఏనుగు వీరిని తరమడంతో అక్కడ నుంచి దంపతులు ఇద్దరూ పరుగులు తీశారు. భయాందోళనతో పరుగులు తీసిన కోకిల ముళ్ల పొదల్లో పడి తీవ్రంగా గాయ పడింది. కేకలు విన్న స్థానికులు అక్కడకు చేరుకుని బాణసంచా పేల్చి ఏనుగును అక్కడ నుంచి తరిమివేశారు. కోకిలను వేలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏనుగు అరటి, వరి, పప్పాలి పంటలను ధ్వంసం చేసింది.

500 మద్యం దుకాణాల మూతకు నిర్ణయం



సీఎం స్టాలిన్‌తో సెంథిల్ బాలాజి

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో 500 టాస్మాక్ దుకాణాలను మూసి వేయనున్నామని విద్యుత్, ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ బుధవారం రాత్రి ప్రకటించారు. అసెంబ్లీలో ఎక్సైజ్ శాఖ నిధుల కేటాయింపుల వివరాలను ఆయన సభకు తెలియజేశారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యం నిషేధం నినాదం మళ్లీ తెర మీదకు వచ్చిన విషయం తెలిసిందే. అనేక చోట్ల దుకాణాలను మూసి వేయాలని ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా దశల వారీగా దుకాణాల మూతపై దృష్టి పెట్టనున్నామని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో 5,329 దుకాణాలు ఉన్నాయని , ఇందులో ఈ ఏడాది 500 దుకాణాలను మూసి వేయనున్నామని ప్రకటించారు. అలాగే టాస్మాక్ దుకాణాలలో పనిచేస్తున్న వారికి వేతనాల పెంపునకు సంబంధించి మంత్రి ప్రత్యేక ప్రకటన చేశారు. ఈ పెంపున ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ. 31 కోట్ల అదనపు భారం పడనుందని వెల్లడించారు. ఇక తమ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు, ఉత్తమ భవిష్యత్ కోసం నిరంతరం చర్యలు చేపడుతుందని వెల్లడించారు.

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయండి



డిగ్రీలను ప్రదానం చేస్తున్న కేంద్రమంత్రి

సాక్షి, చెన్నై: ఆత్మ విశ్వాసంతో ప్రతి విద్యార్థీ భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు కళాశాల స్థాయి నుంచే ముందడుగు వేయాలని కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి విని మహాజన్ పిలుపు నిచ్చారు. బుధవారం చెన్నైలో గ్రేట్ లెక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ 18వ స్నాతకోత్సవం జరిగింది. టాటాసన్స్ బ్రాండ్ కస్టోడియన్ హరీష్ భట్‌తో కలిసి ఈ స్నాతకోత్సవానికి వినీ మహాజన్ హాజరయ్యారు. ఇందులో 2022 బ్యాచ్‌కు చెందిన 550 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. అలాగే ఉత్తమ విద్యార్థులకు పతకాలు, నగదు బహుమతులు అందజేశారు. ఇందులో వినీ మహాజన్ మాట్లాడుతూ.. సమాజంలో చుట్టూ ఏమీ జరుగుతున్నదో అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని పిలుపు నిచ్చారు. అందుకు అనుగుణంగా అడుగులు వేయాలని సూచించారు. ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టాలని, ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేసి భవిష్యత్‌ను ఉజ్వలమయం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రేట్ లెక్స్ చైర్మన్ మోహన్ లక్కం రాజు, డీన్ సురేష్ రామనాథన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.51 లక్షలు



యూనియన్ సమావేశంలో చైర్‌పర్సన్ రంజిత



హాజరైన యూనియన్ కౌన్సిలర్లు

పళ్లిపట్టు: ఆర్కేపేట యూనియన్ సమితి సమావేశంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. 51లక్షలు కేటాయించి తీర్మానం ఆమోదించారు. ఆర్కేపేట యూనియన్ సమితి సమావేశం యూనియన్ చైర్‌పర్సన్ రంజిత అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్ పార్టీలకు చెందిన యూనియన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా చైర్‌పర్సన్ ప్రవేశపెట్టిన తీర్మానంపై సభ్యుల మధ్య చర్చలు నిర్వహించారు. ప్రధానంగా వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్న క్రమంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బోర్లు వేసి తాగునీరు సరఫరా చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో తారురోడ్లు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయడం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఇందు కోసం యూనియన్ జనరల్ నిధుల నుంచి రూ. 51 లక్షలు కేటాయిస్తూ తీర్మానం ఆమోదించారు. అలాగే మొత్తం 33 తీర్మానాలు ఆమోదించారు. వైస్ చైర్మన్ తిలకవతి, బీడీఓలు కలైసెల్వి, వెంకటేశన్, బీడీఓ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యపై శ్రద్ధ వహించాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బిషప్

వేలూరు: విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉన్నత విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వేలూరు సీఎస్ఐ డయాసిస్ బిషప్ శర్మా నిత్యానందం అన్నారు. బుధవారం ఉదయం వేలూరు ఊరీస్ డిగ్రీ కళాశాల 12వ వార్షికోత్సవం ప్రిన్సిపల్ నిల్సన్ విమల్‌నాథన్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఆయన కళాశాల చరిత్ర పుస్తకాన్ని అవిష్కరించి మాట్లాడారు. కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు వెళ్లారని ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉన్నత పదవులను అలంకరించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఎంతటి స్థాయికైనా వెళ్లొచ్చన్నారు. మహిళలు డిగ్రీలు పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం పూర్వపు ప్రిన్సిపాల్‌లు, ప్రొఫెసర్‌లు, సిబ్బందిని సన్మానించారు. తిరువళ్లువర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆర్ముగం, సీఎస్ఐ డయాసిస్ ఉపాధ్యక్షుడు సురేష్ ఆనంద్‌కుమార్, కోశాధికారి సౌందర్‌రాజన్, వైస్ ప్రిన్సిపల్ అన్బయగన్, తిరుమారన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పళ్లిపట్టు టౌన్ పంచాయతీ తనిఖీ

– అధికార దుర్వినియోగంపై విచారణకు కలెక్టర్ ఆదేశం



టౌన్ చైర్‌పర్సన్ మణిమేగలై



ఈఓ హరిహరకార్తికేయన్

పళ్లిపట్టు: పళ్లిపట్టు టౌన్ పంచాయతీలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ ఆకస్మిక తనిఖీ సందర్భంగా అధికార దుర్వినియోగానికి సంబంధించి విచారణ చేపట్టాలని కలెక్టర్ టౌన్ పంచాయతీల సహాయ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. పళ్లిపట్టు టౌన్ పంచాయతీ కార్యనిర్వహణాధికారిగా హరిహర కార్తికయన్ విధులు నిర్వహిస్తున్నారు. అతను అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో జూనియన్ అసిస్టెంట్ సైతం విధులకు సక్రమంగా రాకపోవడంతో పట్టణ పంచాయతీలో సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు స్తంభిస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ పట్టణ పంచాయతీ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో పట్టణ పంచాయతీ చైర్‌పర్సన్ వినియోగించే బోర్డు సమావేశంలో ప్రవేశపెట్టే తీర్మానాలు చేసే మినిట్ బుక్‌ను పట్టణ పంచాయతీల సహాయ డైరెక్టర్ మాహిన్ అబుబక్కర్ పరిశీలించాలని, చైర్‌పర్సన్ సంతకాలు లేని స్థలానికి సంబంధించి దర్యాప్తు చేయాలని ఆదేవించారు. ఆదేశాల మేరకు పట్టణ పంచాయతీల సహాయ డైరెక్టర్ మినిట్ బుక్‌తో పాటు రికార్డులను తనవెంట తీసుకెళ్లారు.

ప్రధానికి కాంగ్రెస్ శ్రేణుల లేఖలు



ప్రధాని మోదీకి లేఖలతో పోస్టల్ కార్యాలయానికి వచ్చిన ప్రతినిధులు

వేలూరు: రాహుల్‌గాంధీని ఎంపీ పదవి నుంచి తొలగించడాన్ని ఖండిస్తూ వేలూరు కాంగ్రెస్ శ్రేణులు పలు పోరాటాలు చేస్తున్నారు. అందులో భాగంగా వేలూరు జిల్లా అధ్యక్షుడు టీకా రామన్ అధ్యక్షతన బుధవారం ఉదయం రాహుల్‌గాంధీ పదవి నుంచి తొలగించడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలు ఊరేగింపుగా ప్రధాన పోస్టల్ కార్యాలయానికి చేరుకుని వెయ్యి లేఖలు పంపే కార్యక్రమం నిర్వహించారు. ఆ లేఖలో రాహుల్‌గాంధీ పదవి నుంచి తొలగించడం ప్రజాస్వామ్యం ఖూనీ అని, చట్టాలు ప్రతి ఒక్కరికీ సమానమని బీజేపీ పార్టీ కావాలనే రాహుల్‌గాంధీపై కక్ష సాధింపు చేస్తోందని తెలిపారు. పార్టీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వాహిద్‌బాషా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిత్ర రంజన్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో కుటుంబంపై దాడి

అన్నానగర్: మద్యం మత్తులో కుటుంబంపై కత్తితో ఓ రైతు దాడి చేశాడు. కృష్ణగిరి జిల్లాకు చెందిన గణేశన్ (60) రైతు. ఇతనికి మాథమ్మాల్ అనే భార్య, పెరుమాళ్ అనే కుమారుడు ఉన్నారు. పెరుమాళ్‌కు విజయలక్ష్మి అనే భార్య, తానిష్క(1) కుమార్తె ఉన్నారు. మంగళవారం రాత్రి గణేశన్ తాగి వచ్చి భార్య మాథమ్మాల్‌తో వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో కోడలు విజయ చేతిలో బిడ్డతో ఉంది. విజయలక్ష్మీకూడా అడ్డుకునేందుకు ప్రయత్నించింది. ఆగ్రహించిన గణేశన్ కత్తితో మాథమ్మాల్‌ను పొడిచాడు. అడ్డుకునేందుకు వెళ్లిన కోడలు, మనవరాలిపై కూడా కత్తితో దాడి చేశాడు. గాయపడ్డ ముగ్గురిని స్థానికులు రక్షించి మాథూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కృష్ణగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు గణేశన్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో అపశ్రుతి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం:ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని చీమలపాడులో బుధవారం తలపెట్టిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా కాల్చిన బాణసంచా నుంచి రాలిన నిప్పు రవ్వలు గుడిసెపై పడి మంటలు అంటుకున్నాయి. గుడిసెలోని గ్యాస్ సిలిండర్ పేలి దాని శకలాలు బుల్లెట్ల తరహాలో దూసుకురావడంతో ముగ్గురు మృతి చెందగా.. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. కొందరికి కాళ్లు తెగిపోగా, మరి కొందరికి చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. ఉదయం 11.30 సమయంలో గుడిసె అంటుకుని ఒక్కసారిగా అగ్నికీలలు లేచాయి. అది చూసిన నేతలు, కార్యకర్తలు, విలేకరులు, పోలీసులు గుడిసె వద్దకు చేరుకుని మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు కాస్త తగ్గినట్టే కనిపించినా.. 11.40 గంటలకు గుడిసెలోని సిలిండర్ పెద్ద శబ్దంతో పేలింది. సిలిండర్ ముక్కలు కాగా.. దాని అడుగున ఉండే మందపాటి ప్లేట్ అత్యంత వేగంతో చక్రంలా గాల్లో ఎగురుతూ సభా ప్రాంగణం వైపు దూసుకొచ్చింది. దాని ధాటికి గుడిసె సమీపంలో ఉన్న కొందరికి కాళ్లు తెగి ముక్కలయ్యాయి. పేలుడు సమయంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాములు నాయక్ సమావేశ వేదికపైనే ఉన్నారు. క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనలో చీమలపాడుకు చెందిన అజ్మీరా మంగు, పంచాయతీ వార్డు మెంబర్ బానోతు రమేశ్, ధర్మసోతు లక్ష్మ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన వారిలో మహారాష్ట్రకు చెందిన సందీప్ (35), కారేపల్లి సీఐ కారు డ్రైవర్ దాసా నవీన్, తవిసిబోడుకు చెందిన తేజావత్ భాస్కర్, వెంకిట్యా తండాకు చెందిన ఆంగోత్ రవికుమార్, గేటు రేలకాయలపల్లికి చెందిన ధర్మసోతు లక్ష్మా ఉన్నారు. విలేకరులైన తేళ్ల శ్రీనివాస్, బండి రామారావుతోపాటు మూడ్‌తండాకు చెందిన అజ్మీర్ హరిబాబు, నరాటి వెంకన్నలకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఘటనపై తెలంగాణ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారాన్ని వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నేత జానారెడ్డికి అస్వస్థత

సాక్షి, హైదరాబాద్/హాలియా: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి (76) స్వల్ప అస్వస్థత కారణంగా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేరారు. కొన్నాళ్లుగా మోకాలి నొప్పితో బాధపడుతున్న జానారెడ్డి.. ఛాతీనొప్పితో బుధవారం తెల్లవారుజామున యశోద ఆస్పత్రికి వెళ్లారు. జానారెడ్డికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయన గుండె రక్తనాళంలో బ్లాక్ ఉందని గుర్తించారు. దీంతో యాంజియోగ్రామ్ పరీక్ష నిర్వహించిన డాక్టర్లు ఆసుపత్రి సీనియర్ వైద్యులు డా. ప్రమోద్‌కుమార్ పర్యవేక్షణలో జానారెడ్డికి స్టెంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

మొక్కవోని నిఘా!

వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది.. అన్నదాతకు అండగా నిలిచేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది.. అందులో భాగంగా సాగుకు అనుబంధంగా సాగుతున్న నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించింది.. రైతుకు నాణ్యమైన మొక్కలు సరఫరా చేసేలా కట్టుదిట్టంగా చర్యలు చేపడుతోంది.. విత్తు నాటింది మొలకెత్తించే విధానం.. మొక్క ఎదుగుదల మొదలు దిగుబడి వచ్చేవరకు అన్ని దశలపై నిఘా పెట్టి నిశితంగా పరిశీలిస్తోంది.. నాసిరకం నారుతో ఒక్క రైతు కూడా నష్టాలపాలు కాకుండా పక్కాగా జాగ్రత్తలు తీసుకుంటోంది.. ఇందుకోసం రిజిస్ట్రేషన్ సమయంలోనే నర్సరీ యాజమాన్యాల్లో జవాబుదారీతనం పెంచుతోంది.

- నర్సరీలపై నిరంతరం పర్యవేక్షణ
- విత్తు నుంచి దిగుబడి వరకు అన్నీ దశల పరిశీలన
- రైతులకు నాణ్యమైన నారు అందించడమే లక్ష్యం
- అన్నదాతకు నష్టం వాటిల్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టిన ప్రభుత్వం


ఏపుగా పెరిగిన వంగ నారు


నర్సరీలో పెంచిన జామ

సాక్షి, చిత్తూరు : వ్యవసాయంలో కాలక్రమేణా విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు రైతులు తమ పొలాల్లోనే నారు పోసుకునేవారు. అనంతరం మొక్క నాటుకుని సాగు చేసేవారు. ఈ క్రమంలో ఒక్కోసారి నాసిరకం విత్తనాలు విత్తడం, నారు పెంపకంలో చిన్న చిన్న పొరబాట్లు, సక్రమంగా యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం కారణంగా పంట నష్టపోయేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఇబ్బడిముబ్బడిగా నర్సరీలు పుట్టుకొచ్చాయి. రైతులు తమకు కావాల్సిన పంటకు సంబంధించి మొక్కలను నేరుగా నర్సరీల్లోనే కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పువ్వులు, పండ్లు, కూరగాయల పంటల్లో ప్రారంభమైంది. మలిదశలో వరి, చెరుకు తదితర పంటలకు కూడా వ్యాప్తి చెందింది.

ఆధునిక పద్ధతులు

ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా నర్సరీలు ప్రారంభమయ్యాయి. కార్పొరేట్ కంపెనీలు సైతం తమ విత్తన వ్యాపారం అభివృద్ధి చేసుకునేందుకు నర్సరీలకు శ్రీకారం చుట్టాయి. ప్రస్తుతం దాదాపు అన్ని పంటలకు సంబంధించిన మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. వరి, చెరుకు, టమాట, వంగ, బీర ,కాకర, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, మామిడి, సపోటా, నిమ్మ, చీనీ, జామ, దానిమ్మతోపాటు అన్ని రకాల పువ్వుల మొక్కలను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించే నర్సరీలు విజయవంతంగా నడుస్తున్నాయి. ఒక్కోసారి ఈ నర్సరీలు సరఫరా చేసే మొక్కలు నాణ్యంగా లేకంటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. నర్సరీ యజమాన్యాలు బాధ్యతాయుతంగా మొక్కలను పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. నాణ్యమైన విత్తనాలను సేకరించడం, వాటిని విత్తటం, మొలకెత్తించటం, మొక్కలను పొలంలో నాటే వరకు నిరంతరం పరిశీలించాలని స్పష్టం చేసింది. అన్నదాత నాసిరకం నారు కారణంగా నష్టపోకూడదని ఉద్యానశాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టంగా నిఘా పెట్టింది.




పకడ్బందీగా రిజిస్ట్రేషన్

ఉద్యానవన చట్టం– 2010 ప్రకారం నర్సరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ విభాగం పర్యవేక్షిస్తోంది. నర్సరీ ఏర్పాటు చేసిన ప్రదేశం, దానికి సంబంధించిన లేఅవుట్ మ్యాప్, భూమి స్థితిగతులు, భూసార పరీక్షల రిపోర్టు డిజిటల్ ఫొటోలతో పాటు యజమాని ఆధార్ కార్డు వివరాలను పొందుపరుస్తూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అలాగే రైతులు ఏమాత్రం నష్టపోకుండా చూసే బాధ్యతను సైతం నర్సరీల యాజమాన్యంపైనే ఉంచుతున్నారు.

పక్కాగా పర్యవేక్షణ

నర్సరీల్లో మొక్కల సంరక్షణ పద్ధతులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది.విత్తనాల కొనుగోలు నుంచిమొక్కలను రైతులకు అప్పగించే వరకు సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది. ఒకవేళ రైతు నష్టపోతే నర్సరీల యాజమాన్యాలు, విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలే బాధ్యత వహించేలా సర్కారు చర్యలు చేపట్టింది.


మునగ


కొబ్బరి


మామిడి


క్యాబేజీ


చామంతి

సేవకు గుర్తింపుగా అవార్డు



నర్సరీ రంగంలో దాదాపు 20 ఏళ్లుగా ఉన్నా. మరోవైపు వ్యవసాయం చేస్తున్నా. సాగుకు చేసిన సేవలకు గుర్తింపుగా డాక్టర్ వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు వచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు నాణ్యమైన మొక్కలను సరఫరా చేస్తున్నాం. ఈ విధానం ద్వారా నర్సరీ యాజమాన్యాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయి.
– రాఘవేంద్ర, నర్సరీ యజమాని, శాంతిపురం

ప్రభుత్వ నిర్ణయంతో న్యాయం



వ్యవసాయంలో నష్టపోకుండా ఉండాలంటే ముందు నాణ్యమైన మొక్కలను నాటుకోవాలి. రూ.లక్షలు వెచ్చించే రైతు విషయంలో నర్సరీలవారిపై ప్రభుత్వం బాధ్యత పెట్టడం మంచి నిర్ణయం. దీంతో రైతులకు న్యాయం జరుగుతుంది.
– అరుణ, రైతు, ఎంకే పురం, కుప్పం మండలం

నిరంతర పర్యవేక్షణ



రైతులు ఎక్కువగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నా రు. నాణ్యమైన మొక్కలను సరఫరా చేయకపోతే భారీగా నష్టపోయే ప్రమాదముంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు నర్సరీ యజమాని బాధ్యతగా నాణ్యమైన మొక్కలను సరఫరా చేయాలి. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.
– లక్ష్మీప్రసన్న, ఉద్యానశాఖాధికారి, పలమనేరు

రైతు సంక్షేమం కోసమే..



రైతు సంక్షేమం కోసమే నర్సరీలపై ప్రభుత్వం నిఘా పెట్టింది. నాణ్యమైన మొక్కలను అందిస్తే అన్నదాతలు చక్కటి ఉత్పత్తులు సాధిస్తా రు. తద్వారా గిట్టుబాటు ధర దక్కుతుంది. ఇందుకోసమే నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అలాగే నర్సరీ యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహం అందిస్తున్నాం.
– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి

బ్రాండ్.. బ్యాండ్

నా పేరు లింగమయ్య. మాది గుంటూరు జిల్లా గురజాల. మా బియ్యం బ్రాండ్ పేరు శ్రీఆహార్. శ్రీ(ఎస్ఆర్ఐ) అని ఉంటుంది. బస్తాపై నా పేరు, ఫొటో, అడ్రస్ ఉంటుంది. సీల్ బస్తా. మా బియ్యం బస్తాలానే నకిలీ ఉంది. ఆ బస్తాపైన శ్రీ (ఎస్ఆర్ఈఈ) అని ఉంటుంది. బస్తాని కుట్టి ఉంటారు. నకిలీ బస్తాపై అడ్రస్, పేరు, ఫొటో ఉండవు. వినియోగదారులు వీటిని గమనించి కొనుగోలు చేస్తే మోసపోయేందుకు వీలు లేదు.

మా బియ్యం బ్రాండ్ పేరు సత్యసాయి. నా పేరు సురేంద్ర, సూళ్లూరుపేట. మా బస్తాలో బియ్యం 26.70 కిలోలు ఉంటాయి. మా బ్రాండ్ పేరును అటూ ఇటు మార్చి బ్యాగ్‌ను తయారుచేసి అందులో తక్కువ క్వాలిటీ ఉన్న బియ్యాన్ని నింపి అమ్మేస్తున్నారు. మేము వ్యాపారం పెంచుకునేందుకు ఊరూరా తిరిగి విక్రయిస్తుంటే.. నకిలీలు బయటపడుతున్నాయి. ఏ ఒక్కరు ప్రభుత్వానికి టాక్స్ కట్టడం లేదు.

జిల్లాలో నకిలీ బ్రాండెడ్ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. బ్రాండెడ్ బియ్యం పేరుతో నకిలీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నకిలీ వ్యాపారుల బ్యాగులన్నీ కూడా 26 కిలోల పైనే ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాకు లారీల్లో పరిమితికి మించి బియ్యాన్ని తీసుకొస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వీటికి బిల్లులు ఉండవు. బరువు వేయరు. సెస్ చెల్లించారా? లేదా? అని కూడా చెక్ చేయడం లేదు. ఇటు వినియోగదారులు.. అటు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ అక్రమార్కులు రూ.కోట్లు దండుకుంటున్నారు.

బ్రాండెడ్ బియ్యం పేరుతో నకిలీలు

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- వినియోగదారునికి బిల్లు ఇవ్వరు
- జీఎస్టీ చెల్లించరు.. మార్కెట్ టాక్స్ కట్టరు
- ఒక్క తిరుపతి జిల్లా నుంచే రూ.15 కోట్లు గండి
- మామూళ్ల మత్తులో అధికారులు



సాక్షి, తిరుపతి: జిల్లాలో నకిలీ బ్రాండ్ బియ్యం వ్యాపారం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. దుకాణాలు, బ్రాండ్ పేర్లకు ఎటువంటి రిజిస్ట్రేషన్లు లేకుండా బియ్యాన్ని మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జీఎస్టీ, వ్యవసాయ మార్కెట్ సెస్ వంటివి చెల్లించాల్సి ఉన్నా.. అటువంటివేమీ చెల్లించకుండా క్రయ విక్రయాలు జరుపుతూ వినియోగ దారులను మోసం చేస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. జిల్లాలో కోట్లలో జరిగే బియ్యం వ్యాపారంలో ప్రభుత్వానికి జీఎస్టీ, మార్కెట్ చెస్ కట్టేవారు కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నట్లు సమాచారం. మరో 40 మందికిపైగా నిబంధనలకు విరుద్ధంగా బియ్యం వ్యాపారాలు సాగిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 45 రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటిని నమ్ముకుని 7వేలకు పైగా బియ్యం దుకాణాలు వెలిశాయి. ఇవి కాకుండా నివాసాల్లో విక్రయించేవారు ఉన్నారు.

రోజుకు రూ.15 కోట్ల వ్యాపారం

తిరుపతి నగరంలోనే రోజుకు రూ.15 కోట్లు బియ్యం వ్యాపారం జరుగుతోంది. రోజుకు ఐదు లారీల బియ్యం వస్తోంది. అంటే 5వేల నుంచి 10వేల బస్తాలు. తిరుపతి మినహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే మరో రూ.20 కోట్ల వరకు బియ్యం క్రయ విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా. ఎటువంటి బిల్లులు లేకుండా.. బియ్యాన్ని దిగుమతి చేయడం, ఆ తరువాత బస్తాలకు నింపి దుకాణాలకు తరలించడం షరా మమూలే. వీరు జీఎస్టీ 5శాతం, మార్కెట్ సెస్ ఒక శాతం ఎగ్గొట్టి క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. నిబంధనల మేరకు నడుచుకునేవారు కేవలం నలుగురు వ్యాపారులు మాత్రమేనని తెలిసింది. ఒక్క తిరుపతి జిల్లా నుంచి నెలకు రూ.15 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండిపడితున్నట్లు అధికారుల అంచనా. తిరుపతి నగరంలోని 50మంది దుకాణ దారులు రోజుకు రూ.50 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నా.. రూపాయి కూడా చెల్లించడం లేదని విశ్వసనీయ సమాచారం. ఇతర ప్రాంతాల నుంచి లారీల్లో పరిమితికి మించి బియ్యాన్ని తీసుకొస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వీటికి బిల్లులు ఉండవు. చెస్ చెల్లించారా? లేదా? అని కూడా చెక్ చేయడం లేదు. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు విడిచిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

రమణీయం.. ఛాయాచిత్రం

ఫొటోగ్రఫీలో రాణిస్తున్న గుంటూరు వైద్యుడు
జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం




డాక్టర్ వెంకటరమణకు అవార్డులు తెచ్చిన చిత్రాలు


డాక్టర్ నరేంద్ర వెంకటరమణ

గుంటూరు మెడికల్: నాడి పట్టి రోగాలను నయం చేయటంలో నిత్యం బిజీగా ఉండే గుంటూరుకు చెందిన ఓ వైద్యుడు వైల్డ్ ఫొటోగ్రఫీలో అంతర్జాతీయ అవార్డు సొంతం చేసుకుని గుంటూరు ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాడు. ఒకపక్క జనరల్ ఫిజీషియన్‌గా రోగుల ప్రాణాలు కాపాడుతూ.. మరో పక్క అడవుల్లో సంచరించే క్రూర మృగాల కదలికలను తన కెమెరాతో క్లిక్‌మనిపించి బ్రిటిష్ రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ వారి ఏఆర్‌పీఎస్ ఫెలోషిప్‌ను అందుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా 22 ఎంట్రీలు ఈ ఫెలోషిప్‌కు పోటీపడగా కేవలం నాలుగు మాత్రమే సొసైటీ ఆమోదం పొందాయి. వాటిలో భారత దేశం నుంచి ఫెలోషిప్ పొందిన ఏకైక వ్యక్తిగా డాక్టర్ నరేంద్ర వెంకటరమణ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఏఆర్పీఎస్ ఫెలోషిప్ అందుకున్న ఏకైక వ్యక్తిగా డాక్టర్ వెంకటరమణ రికార్డు సృష్టించారు.

ఏడేళ్లుగా కెమెరాతో గురి..

డాక్టర్ నరేంద్ర వెంకటరమణ మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అడవుల్లో రాయల్ బెంగాల్ టైగర్‌పై చిత్రీకరించిన డాక్యుమెంటరీకి అంతర్జాతీయ అవార్డు లభించింది. డాక్టర్ వెంకటరమణ ఏడు సంవత్సరాలు మూడు తరాలకు చెందిన 80 పులుల ఫొటోలు తీసి అంతర్జాతీయ పోటీలకు పంపించగా, న్యాయ నిర్ణేతలు ఆ ఫొటోలకు మంత్ర ముగ్ధులై ఆయనకు సాహస ఫొటోగ్రఫీకి అవార్డు ప్రకటించారు. డాక్టర్ వెంకటరమణ గత 15 ఏళ్లుగా వన్య ప్రాణుల చాయాచిత్రాలు తీసేందుకు ఆఫ్రికా, కెన్యా, టాంజానియా దేశాలతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లోని వన్య ప్రాణుల కేంద్రాలను సందర్శించి, జంతువుల జీవన విధానం, వివిధ దశల్లో వాటి పెరుగుదల, కలిసి మెలిసి జీవించే దృశ్యాలు, వేటాడే దృశ్యాలు తీశారు.

చిన్ననాటి నుంచే ఆసక్తి..

డాక్టర్ నరేంద్ర వెంకటరమణ తండ్రి డాక్టర్ గోపాలరావు రైల్వేలో మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయనకు ఫొటోగ్రఫీ అంటే ఆసక్తి. దీంతో ఒక పక్క తండ్రి మాదిరిగా వైద్యుడు అవ్వాలనే లక్ష్యంతో డాక్టర్ కోర్సు అభ్యసిస్తూనే 2000 సంవత్సరం నుంచి ఫొటోగ్రఫీలో సైతం మెలకువలు నేర్చుకున్నారు. కర్నాటకు చెందిన డీఎస్‌పి పెరుమాళ్, కేరళ రాష్ట్రానికి చెందిన ప్రవీణ్ మోహన్‌దాస్‌ల వద్ద శిష్యుడిగా చేరి వైల్డ్ ఫొటోగ్రఫీలో మెలకువలు నేర్చుకున్నాడు. ఏడాదికి ఒకసారి ప్రకృతితో మమేకం అయ్యేందుకు అడవులకు వెళ్లి జంతువులు, పక్షుల ఫొటోలను తన కెమెరా కళ్లతో బంధిస్తున్నారు. చేతితో చిత్రాలు గీసే కల్చర్ ఆర్ట్‌లో కూడా మంచి ప్రావీణ్యం సంపాదించారు. గిటారు, కీబోర్డు, డ్రమ్స్, వాయించడంతోపాటు ఫ్లూట్‌తో పలు గీతాలను ఆలపించడంతో సైతం నైపుణ్యం ఉంది.

అందుకున్న డిగ్రీలు, అవార్డులు...

ఫొటోగ్రఫీలో డాక్టర్ వెంకటరమణ నైపుణ్యాన్ని గుర్తించిన అమెరికా దేశంలోని పలు సంస్థలు డిగ్రీలను అందజేశాయి. ఇంగ్లండ్‌కు చెందిన ఏఆర్‌పీఎస్, అమెరికాకు చెందిన ఎంఐసీఎస్, ఈయూఎస్‌పీఏ, ఆస్ట్రేలియాకు చెందిన ఏపీపీఎస్, ఇండియాకు చెందిన ఏఐపీసీ సంస్థలు, అసోసియేట్ ఆఫ్ ఇంటర్నేషన్ కొలీగ్స్ సొసైటీ, అసోసియేట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్ ఫొటోగ్రఫీ అకాడమీ, ఫెలో ఆఫ్ ఇంటర్నేషనల్ కొలీగ్స్ సొసైటీ ఫొటోగ్రఫీలో మాస్టర్ డిగ్రీలను, ఫెలోషిప్‌లను అందించాయి. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫొటోగ్రఫీ కౌన్సిల్ ఢిల్లీ, కేరళ సొసైటీ బెటర్ ఆర్ట్ ఫౌండేషన్, ఏపీ ఫొటోగ్రఫీ అకాడమీ, పలు జాతీయ సంస్థల నుంచి 15కు పైగా అవార్డులను, ఇంటర్నేషనల్ యాక్సిటెన్సీ 200లకు డాక్టర్ వెంకటరమణ అవార్డు అందుకున్నారు.

దేశంలోనే ప్రధాన విద్యా కేంద్రం ఆంధ్రప్రదేశ్

ఆంధ్రా లయోలా కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్



గుణదల(విజయవాడ తూర్పు): దేశంలోనే ప్రధాన విద్యాకేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విరాజిల్లుతోందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కళాశాలలో నూతన అకడమిక్ బ్లాక్‌లను ప్రారంభించి మాట్లాడారు. మూడు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 20 స్వయం ప్రతిపత్తి సంస్థలు, 25 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, నాలుగు డీమ్డ్ యూనివర్సిటీలు, ఐదు ప్రైవేట్ యూనివర్సిటీలతో ఉన్నత విద్యారంగంలో రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల, విజయనగరం గురజాడలో జేఎన్‌టీయూ, ఒంగోలులో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం, వైఎస్సార్ కడపలో డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కర్నూలులో క్లస్టర్ యూనివర్సిటీ వంటి అనేక కొత్త ఉన్నత విద్యా సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 11 మెడికల్ కాలేజీలకు అదనంగా 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడంతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారికి వైద్య విద్య అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 నిబంధనల ప్రకారం రాష్ట్ర విభజన తర్వాత తిరుపతిలో ఐఐటీ, తాడేపల్లిగూడెంలో ఎన్ఐటీ, విశాఖపట్నంలో ఐఐఎం వంటి జాతీయ ప్రాముఖ్యత కలిగిన అనేక విద్యాసంస్థలను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఆంధ్రా లయోలా కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు జరుపుకోవడం సంస్థ చరిత్రలో అపూర్వమైన ఘట్టమన్నారు. మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబుతో పాటు ఎంతో మంది పూర్వ విద్యార్థులను ఈ కళాశాల తయారు చేసిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ కళాశాలలోనే చదివిన విషయాన్ని గుర్తు చేశారు. కళాశాల సీనియర్ అధ్యాపకులను గవర్నర్ అబ్దుల్ నజీర్ సత్కరించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సగాయరాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్, కృష్ణా యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.రామమోహనరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

12 మంది అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఈబీ అడిషన్ ఎస్పీ తదితరులు

గూడూరు(తిరుపతి జిల్లా): గూడూరు పట్టణంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న 12 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 21 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం గూడూరు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జానకిరాంతో కలసి ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ రాజేందర్ వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ క్రమంలోనే బుధవారం డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో 1వ పట్టణ సీఐ హజరత్ బాబు సిబ్బందితోపాటు, ఎస్ఈబీ అధికారులు పట్టణంలో దాడులు చేశారని తెలిపారు. ఈ దాడుల్లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న 12 మందిని అరెస్టు చేసి.. 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా గత రెండు రోజుల క్రితమే నెల్లూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు 26 కిలోల గంజాయిని విక్రయిస్తుండగా, ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు.

హస్తకళ

ఒక చదరపు అంగుళం తివాచీ అల్లాలంటే
197 దారపు ముడులు వేయాలి.
ఓపికతో నిండిన ఈ పనిని స్త్రీలే నేర్చుకున్నారు.
'జైపూర్ రగ్స్' ఇవాళ 40 వేల మంది నేత కార్మికులతో
రగ్గులు తయారు చేయిస్తుంటే వారిలో 30 వేల మంది స్త్రీలే ఉన్నారు.
కోడలుగా ఆ ఇంట అడుగుపెట్టిన రుత్వి చౌదరి
ఈ సంస్థను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

స్త్రీల సారథ్యంలో స్త్రీలు నేసే తివాచీలు


రుత్వి చౌదరి

'ఇంట అడుగు పెట్టిన కోడలికి ఇంటి సభ్యుల కన్నా ఎక్కువ బాధ్యత ఉంటుంది. ఇంటి ఘనత తను కోడలు నిలబెట్టగలదా లేదా అందరూ గమనిస్తారు. మా మామగారు ఎస్.కె.చౌదరి మొదలెట్టిన జైపూర్ రగ్స్ సంస్థలో డైరెక్టర్‌గా అడుగు పెడుతున్నప్పుడు అదేం సామాన్యమైన బాధ్యతని అనిపించలేదు. కాని సాధించగలననే అనుకున్నాను' అంటుంది రుత్వి చౌదరి. ఆడపడుచులు ఆశ, అర్చనలు అమెరికాలో జైపూర్ రగ్స్ సంస్థను నడుపుతుంటే మన దేశంలో భర్త యోగేష్ చౌదరితో కలిసి సంస్థను ముందుకు తీసుకెళుతోంది రుత్వి చౌదరి. 'నేను మొదటగా చెప్పాలనుకుంటున్నది ఏమంటే మాది విమెన్ సెంట్రిక్ ఆర్గనైజేషన్. మా సంస్థలో ప్రధాన బాధ్యతలన్నీ స్త్రీలే నిర్వహిస్తారు. మా దగ్గర అల్లే ప్రతి తివాచీ స్త్రీ తన బిడ్డను సింగారించినట్టే ఉంటుంది. చేతి అల్లికతో తయారయ్యే తివాచీలు ఇవి' అంటుందామె.





రుత్వి చౌదరి వచ్చాక సంప్రదాయిక డిజైన్లకు డిజైనర్ల సృజన జత చేయడంతో కొత్త తరాన్ని ఆకట్టుకునేలా ఇవి తయారవుతున్నాయి. 'ఐదు రాష్ట్రాల్లో 600 గ్రామాల్లో దాదాపు 30 వేల మంది మహిళా నేత కార్మికులు తివాచీలు తయారు చేస్తారు. రాజస్తాన్‌లాంటి చోట దేశీయ తివాచీ డిజైన్లు అద్భుతంగా ఉంటాయి. కాని చాలామటుకు మూసగా కనిపిస్తాయి. నేను ఈ సాంప్రదాయికతను చెడగొట్టదలుచుకోలేదు. కాని డిజైనర్ల సృజన జత చేయాలనుకున్నాను. హిరేన్ పటేల్, ఆషిష్ షా, శాంతను గార్గ్‌లాంటి వాళ్ల చేత కొత్త డిజైన్లు, పాట్రన్లు ఈ దేశవాళి డిజైన్లకు జత చేశాను. మా మహిళా నేతగత్తెలు వాటిని వెంటనే అందుకున్నారు. ఈ కాలపు యూత్‌ను కూడా ఆకర్షించేలా తయారు చేశారు' అంది రుత్వి.

■ తొమ్మిది మందితో మొదలయ్యి

రుత్వి చౌదరి మామగారు ఎస్.కె.చౌదరి 1978లో కేవలం ఇద్దరు నేతగాళ్లతో, రెండు మగ్గాలతో, ఐదు వేల రూపాయల పెట్టుబడితో జైపూర్ రగ్స్‌ను స్థాపించాడు. చాలా కాలం వరకు ఇది కేవలం విదేశాలకే రగ్గులు పంపేది. 2006లో కొడుకు యోగేష్ చౌదరి పగ్గాలు స్వీకరించాక దేశీయ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది.

■ స్త్రీలకు దక్కిన మర్యాద

'తివాచీ ఇంటిని దగ్గరగా కూడేలా చేస్తుందంటారు పర్షియన్లు. ఆ సంగతి ఏమో కాని వేల మంది స్త్రీలను మేము ఒక కుటుంబంగా చేయగలిగాము. రాజస్థాన్‌లో తివాచీల నేత వల్ల స్త్రీలకు గౌరవం పెరిగింది. అన్నింటి కంటే ముఖ్యం వలసలు ఎంతో తగ్గాయి. భార్య సంపాదిస్తూ ఉండటంతో భర్త కూడా బుద్ధిగా పని చేయడం మొదలెట్టాడు. ఈ అన్ని కారణాల వల్ల మా నేతమ్మలు మా సంస్థను ఎంతో ప్రేమిస్తారు. మేము కూడా వారిని ఎక్కువ విసిగించం. మెటీరియల్ ఇచ్చి సరుకును బదులుగా తీసుకుంటాం. వర్క్ ఫ్రమ్ హోమ్. వారికి వీలున్నప్పుడే పని చేయొచ్చు. అంతర్గతంగా ఏదైనా సమస్య వస్తే చర్చించుకోవడానికి పరిష్కరించుకోవడానికి 'తనా-బనా' అనే సొంత యాప్ ఉంది. అందులో సత్వర పరిష్కారాలు చెబుతాం' అంటుంది రుత్వి.

■ జర్మనీలో అవార్డ్

జైపూర్ రగ్స్ సంస్థ తాను ఇచ్చే డిజైన్లనే కాక మహిళలను వారి మనసుకు నచ్చిన డిజైన్లతో వినూత్నమైన తివాచీలను అల్లే వీలు కల్పిస్తుంది. వీటిని 'మన్‌చాహా' తివాచీలు అంటారు. ఇలాంటి తివాచీలకు ఎక్కువ సమయం (కొత్త డిజైన్ ఆలోచించాలి కనుక) పడుతుంది కాబట్టి ఎక్కువ మంది ట్రై చేయరు. కాని ప్రతిభ ఉన్న మహిళలు పాశ్చాత్యులను సైతం అబ్బురపడేలా డిజైన్లు చేస్తారు. వీటి ధర కూడా ఎక్కువే ఉంటుంది. 2018లో బిమలా దేవి అనే నేతమ్మ అల్లిన తివాచీకి ఫ్రాంక్‌ఫర్ట్‌లో 'జెర్మన్ డిజైన్ అవార్డ్' దక్కింది. 'మన వారి ప్రతిభను అలా ప్రపంచ దేశాలకు చాటుతున్నాం. మా మహిళలు తయారు చేస్తున్న తివాచీలు ఇప్పుడు 80 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి' అని తెలిపింది రుత్వి.

ఈ సంస్థలో ఒకసారి కొంతమంది స్త్రీలు 30 అడుగుల పొడవు 40 అడుగుల వెడల్పు తివాచీని అల్లారు. దీని కోసం కోటీ 40 లక్షల దారపు ముడులను వేయాల్సి వచ్చింది. 'మేము తయారు చేసిన వాటిలో అది అత్యంత ఖరీదైనది. దానిని సౌదీ రాజుకు అమ్మాం' అని తెలిపింది రుత్వి. 'దళారులను తొలగించి వారి కమీషన్ కూడా స్త్రీలకే అప్పజెప్పడం వల్ల వారూ మేమూ సంతృప్తిగా ఉన్నాం' అని ముగించిందామె.

ఆమె... ఒక్క మాటతో పొట్ట చెక్కలయ్యేలా చేయగలదు.
ఒక్క పాటతో కళ్లు కన్నీటి చెరువయ్యేలా చేయగలదు.
అదే పాటతో హుషారు ఉత్తుంగ తరంగమయ్యేలా చేయగలదు.
ముంబైకి చెందిన 24 సంవత్సరాల సృష్టి తవాడే రైటర్, పోయెట్, ర్యాపర్, సెటైరిస్ట్‌గా తన ప్రత్యేకతను చాటుకుంటోంది...

పేరు వినిపిస్తే చాలు...


● మల్టీ టాలెంట్

సృష్టి తవాడే తల్లికి కీర్తనలు అంటే ఎంతో ఇష్టం. పాడడమే కాదు రాసేది కూడా. డైరీల నిండా ఆమె రాసిన కీర్తనలే కనిపించేవి. ఒకసారి తల్లి రచనలో నిమగ్నమై ఉన్నప్పుడు...

'ఇలా రాస్తే ఏం వస్తుంది?' అని అడిగింది సృష్టి.

'నువ్వు రాస్తే తెలుస్తుంది' అని చెప్పి తన రచనలో నిమగ్నమైపోయింది తల్లి.

కోవిడ్ సమయంలో సృష్టికి బోలెడు తీరిక దొరికింది. ఇంగ్లిష్ సాహిత్యంలో పోస్ట్-గ్రాడ్యుయేషన్ చేసిన సృష్టి పాత పాఠ్యపుస్తకాలను పదే పదే తిరగేసింది. ఒకరోజు తనకు కూడా రాయాలనిపించింది. అంతే...అప్పుడు పట్టుకున్న కలాన్ని మళ్లీ వదలలేదు. రచన చేయడంలో ఉండే మజా ఏమిటో సృష్టికి స్వయంగా తెలిసి వచ్చింది.

'మనల్ని మనం వ్యక్తీకరించుకోవడానికి కవిత్వం, కథలు బలమైన సాధనాలు' అనే వాస్తవం బోధపడింది.

కవిత్వం, వచనం, పాట, సెటైర్... ఇలా ఎన్నో రాసింది. ఆమె మాటల్లో చెప్పాలంటే 'ఏదీ వదలలేదు!'

అయితే సృష్టి రాసిన పాటలు ఇంటి నాలుగు గోడలకే పరిమితం కాలేదు. చిల్లీ కిండా గై, మై నహీతో కౌన్... మొదలైన పాటలతో ఇంటర్నెట్ సెన్సేషనల్‌గా మారింది సృష్టి.

మై నహీతో కౌన్... పాటను హిందీతో పాటు ఇంగ్లిష్, మరాఠీ, బెంగాలీ, హర్యాన్వీ భాషల్లోనూ పాడింది.

ముంబైలోని నేషనల్ ఇంగ్లిష్ హైస్కూల్, ఎస్ఎన్‌డీటీ కాలేజీలో చదువుకున్న సృష్టికి ర్యాప్ అండ్ పాప్ కల్చర్ కొత్త కాదు.

తన పాటలతో సృష్టి ఇంటర్నెట్‌లో ప్రాచుర్యం పొందడం ఒక ఎత్తయితే ఎంటీవీలో అవకాశం మరో ఎత్తు.

మన దేశంలోని తొలి ర్యాప్, హిప్-హాప్ రియాల్టి షో ఎంటీవీ హజిల్‌తో సృష్టి తవాడే పేరు అంతర్జాతీయ స్థాయికి వెళ్లింది. ఇది తనకు ఊహించని గుర్తింపు!

'ఆరోజుల్లో పాటలు ఎంత బాగుండేవో! అనే మాట తరచుగా వినిపిస్తూ ఉంటుంది. దీనికి కారణం ఆ రోజుల్లో రచన ప్రక్రియ అనేది ఒక యజ్ఞంలా సాగేది. ఇప్పుడు డెడ్‌లైన్‌లే పాటలు రాయిస్తున్నాయి. అందుకే ఆలస్యం అయినా సరే బాగా ఆలోచించాకే పాట రాయాలని నిర్ణయించుకున్నాను. అది సత్ఫలితాన్ని ఇస్తోంది' అంటున్న సృష్టి దగ్గర పాటకు సంబంధించిన బోలెడు ఐడియాలు ఉన్నాయి.

అయితే అన్ని ఐడియాలను తప్పనిసరిగా ర్యాప్ అండ్ పాప్‌లోనే జోడించాలనుకోవడం లేదు. ఫన్నీ ర్యాపర్‌గా ప్రయాణం మొదలు పెట్టిన సృష్టి సామాజిక అంశాలను కూడా పాటల్లోకి తీసుకువస్తోంది. మ్యూజిక్ ప్యారడీలలో కూడా పనికొచ్చే మాటలను జత చేస్తుంది.

డ్యాన్స్ నుంచి ఉపన్యాసం వరకు... సృష్టి చిన్నప్పటి నుంచే స్టేజీ పర్సన్. స్టేజీ ఫియర్ అనేది ఆమె నిఘంటువులోనే లేదు. తన భయమల్లా...'షో విఫలమైతే!' అనేది. సృష్టికి అలాంటి సందర్భం ఇంతవరకు ఎదురు కాలేదు. సృష్టి పేరు వినిపిస్తే, స్టేజీ మీద కనిపిస్తే... సెల్ఫ్-టాట్ ర్యాపర్, కామెడిక్ గ్యాంగ్‌స్టర్‌లాంటి మెచ్చుకోళ్లు ప్రేక్షకుల నుంచి వినిపిస్తాయి.

ఆమె పాడుతుందా, సెటైర్‌లతో నవ్విస్తుందా, డ్యాన్స్‌తో షేక్ చేస్తుందా? అనేది ఎవరికీ తెలియదు. అయితే అందరిలోనూ ఒక ఎనర్జీ వస్తుంది. అదే... సృష్టి తవాడే విజయం. కొత్త అంశాలను పాటలో ఆవిష్కరించడం ఆమె బలం.

> ఆమె పాడుతుందా, సెటైర్‌లతో నవ్విస్తుందా, డ్యాన్స్‌తో షేక్ చేస్తుందా? అనేది ఎవరికీ తెలియదు. అయితే అందరి లోనూ ఒక ఎనర్జీ వస్తుంది. అదే... సృష్టి తవాడే విజయం.

సమ్మర్ టిప్స్

ఎండాకాలం వచ్చిందంటే స్విమ్మింగ్ పూల్స్ నిండుగా కనిపిస్తాయి. ఈత దేహానికి చక్కటి వ్యాయామం మాత్రమే కాక ఎండ నుంచి చక్కటిసాంత్వన కూడా కలుగుతుంది. పైగా పిల్లలకు సెలవులు వచ్చేస్తాయి. ఇవన్నీ కలిసి అందరినీ స్విమ్మింగ్ పూల్స్ వైపు అడుగులు వేయిస్తాయి. జాగ్రత్తలు తీసుకోకుంటే కొన్ని ప్రత్యేకమైన రుగ్మతల బారిన పడే ప్రమాదముంది.

- పూల్‌లోని నీటిని మింగకూడదు. పిల్లలు నీటిలో ఉక్కిరిబిక్కిరి అయినప్పుడు నీటిని మింగేస్తారు. అలా జరిగిన రోజే డాక్టరును సంప్రదించి ఇన్‌ఫెక్షన్ సోకకుండా ముందస్తుగా వేసుకునే మందులు వాడాలి.



- డయేరియా వంటి వ్యాధులున్నప్పుడు, వచ్చి తగ్గిన వెంటనే కూడా స్విమ్మింగ్ చేయకూడదు. సంబంధిత బ్యాక్టీరియా నీటిలో చేరి తర్వాత పూల్‌లో దిగిన వాళ్లకు సోకే అవకాశం ఉంటుంది.

అవును... మిద్దెలపై డబ్బులు కాస్తాయి!!


గ్రీన్ లైఫ్
● రమాదేవి

ఆరోజు మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొని ఇంటికి తీసుకువచ్చింది కేరళలోని కొట్టాయంకు చెందిన రెమాదేవి. కూరగాయలను కడుగుతున్నప్పుడు ఒకరకమైన రసాయనాల వాసన వచ్చింది. ఆ సమయంలో పిల్లలు, వారి భవిష్యత్ గుర్తుకు వచ్చింది. అదే సమయంలో తాను ఒక నిర్ణయం తీసుకుంది...

'ఇంటికి అవసరమైన కూరగాయలు ఇంటిదగ్గరే పండించుకుంటాను'

అలా మిద్దెతోటకు శ్రీకారం చుట్టింది రెమాదేవి. అమ్మమ్మ రంగంలోకి దిగింది. సేంద్రియ వ్యవసాయంలో అమ్మమ్మది అందెవేసిన చేయి. ఆమె సలహాలు, సూచనలతో మిద్దెతోట పచ్చగా ఊపిరిపోసుకుంది. కొంత కాలానికి... ఇంటి అవసరాలకు పోగా మిగిలిన కూరగాయలను అమ్మడం మొదలుపెట్టారు. తమకు ఉన్న మరో రెండు ఇండ్లలోనూ మిద్దెతోట మొదలుపెట్టింది రెమాదేవి. అలా ఆదాయం పెరుగుతూ పోయింది.

మిద్దెతోటపై ఆసక్తి ఉన్న వాళ్లు రెమాను రకరకాల సలహాలు అడిగేవారు. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని 'రెమాస్ టెర్రస్ గార్డెన్' పేరుతో యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది. 'మిద్దెతోటకు పెద్దగా ఖర్చు అక్కర్లేదు' అని చెబుతూ ఆ తోటపెంపకానికి సంబంధించిన ఎన్నో విషయాలను అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు చెబుతుంది. వంటగది వ్యర్థాలతో మనకు కావల్సిన ఎరువులు ఎలా తయారు చేసుకోవచ్చో వీడియోల ద్వారా చూపుతుంది. దీంతోపాటు సోషల్ మీడియా ఫార్మింగ్ గ్రూప్స్ ద్వారా విత్తనాలు అమ్ముతుంది రెమాదేవి. కేవలం విత్తనాల అమ్మకం ద్వారానే నెలకు 60,000 రూపాయల ఆదాయం ఆర్జిస్తుంది.

రెమాదేవిని అనుసరించి ఎంతోమంది మిద్దెతోటలను మొదలుపెట్టి రసాయన-రహిత కూరగాయలను పండించడమే కాదు, తగిన ఆదాయాన్ని కూడా గడిస్తున్నారు. మంచి విషయమే కదా!

బ్యూటిప్

వార్ధక్యమా... అప్పుడేనా!

వార్ధక్యం దగ్గరవుతోందని తొలి హెచ్చరిక జారీ చేస్తూ, వార్ధక్య లక్షణాలకు అద్దం పట్టే తొలి అవయవం చర్మమే. అందుకే వార్ధక్యాన్ని దూరం చేసే ట్రీట్‌మెంట్‌లు మొదట చర్మానికే చేయాలి. ఇంట్లోనే చేసుకోగలిగిన ట్రీట్‌మెంట్‌ను చూద్దాం.

రెండు టీ స్పూన్‌ల బొప్పాయి గింజలను పేస్ట్ చేసి అందులో టీ స్పూన్ కొబ్బరి నూనె, టీ స్పూన్ తేనె, అర టీ స్పూన్ నిమ్మరసం కలపాలి. ముఖాన్ని సబ్బుతో శుభ్రంగా కడిగి తేమ ఆరిన తరవాత ఈ ప్యాక్‌ను ముఖానికి పట్టించాలి. పది లేదా పదిహేను నిమిషాలకు పూర్తిగా ఆరిపోతుంది. ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఈ మిశ్రమాన్ని చేతులకు కూడా రాసుకోవచ్చు. బొప్పాయి గింజలు కొలాజెన్ నిర్మాణానికి దోహదం చేస్తాయి. కాబట్టి ముఖం మీద ముడతలను తొలగించడంలో బాగా పనిచేస్తాయి. ఈ ప్యాక్ రోజంతా ముఖాన్ని తేమగా, తాజాగా ఉంచుతుంది.



సైబర్ టాక్

డేటా జాగ్రత్త!

సుస్మిత (పేరు మార్చడమైనది)కు తను ఏ లావాదేవీ చేయకుండానే తన అకౌంట్ నుంచి డబ్బు డెబిట్ అయినట్టుగా మెసేజ్ రావడంతో షాక్ అయ్యింది. ఇంట్లో వాళ్లకి చెబితే తిడతారని భయపడింది. కానీ, నెల నెలా కొద్ది కొద్దిగా పోగయిన మొత్తం ఒకేసారి పోవడంతో స్నేహితురాలికి చెప్పి బాధపడింది. డబ్బు డెబిట్ అవడానికి ముందు ఏం జరిగిందో చెప్పమని అడిగితే సుస్మిత తనకు సంబంధించిన డేటా మోసగాళ్లకు ఎలా అందించిందో తెలిసిపోయింది. సుస్మిత ఫోన్‌కు ఏదో లాటరీ గెలుచుకున్నట్టు మెసేజ్ రావడంతో అదృష్టాన్ని పరీక్షించుకుందామని ఆ మెసేజ్‌ను ఓపెన్ చేసి తన పేరు, ఫోన్ నెంబర్.. వంటి వివరాలు ఇచ్చింది. అదే ఆమెకు సంబంధించిన డేటా మోసగాళ్లకు దొరికేలా చేసింది.

•••

సుస్మితలాగ ఇలా అపరిచిత మెసేజ్‌లకు స్పందించడమే కాకుండా కొందరు సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా తమ డేటాను మోసగాళ్లకు అందిస్తుంటారు. లేదా మోసగాళ్లే బాధితుల డేటా రాబట్టడానికి లేదా ఉల్లంఘనలకు ప్పాలడుతుంటారు. డేటా రక్షణ చర్యలు తీసుకోకపోతే ఆర్థిక నష్టాలే కాదు పరువు నష్టానికి కూడా దారితీయవచ్చు.

ఇటీవల వ్యక్తిగత, సంస్థల డేటాకు సంబంధించిన మోసాలు పెరుగుతున్నాయని సైబర్‌క్రైమ్ నివేదిస్తుంది.

అందుకని, తమ డేటా బహిర్గతమైందని గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయడం తప్పనిసరి. జీడీపీఆర్ (జనరల్ డేటా ప్రొటక్షన్ రెగ్యులేషన్) ప్రకారం డేటాకు సంబంధించిన ఏదైనా మోసం జరిగితే అందుకు తగిన జరిమానా, శిక్షలు కూడా అమలు చేసే అధికారం చట్టానికి ఉంది.


ప్రతీకాత్మక చిత్రం

కంపెనీలు సేకరించే డేటా...

- ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా మనకు ఈ విషయం స్పష్టమవుతుంది.ఆన్‌లైన్ షాపింగ్ సైట్‌లో మన పేరు, ఇమెయిల్, డెలివరీ చిరునామా, ఫోన్ నంబర్, క్రెడిట్‌కార్డ్ వివరాలు, ఐపీ అడ్రస్, కొనుగోలు చేసిన వస్తువులు, అత్యధికంగా బ్రౌజ్ చేయబడిన ఉత్పత్తులు... ఇలా మన డేటా కంపెనీలకు చేరుతుంది.
- డేటింగ్ యాప్‌లో చేరితే... అందులో.. వయస్సు, లింగం, లైంగిక ధోరణి, ఫోన్‌నెంబర్, ప్రైవేట్ చాట్‌లు, పొలిటికల్ వ్యూస్, ప్రైవేట్ ఫొటోలు, ఇష్టాలు, డిజిటల్ పరికరం సమాచారం, ఐపీ అడ్రస్ వంటివి సేకరిస్తాయి.
- ఆన్‌లైన్‌లో సమాచారం కోసం సెర్చ్ చేస్తుంటాం. దీంట్లో బ్రౌజింగ్ హిస్టరీ, ఆన్‌లైన్ ఇష్టాలు, షాపింగ్ అలవాట్లు, ఐపీ చిరునామా, ప్లేస్, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్‌కార్డ్‌లు, పరికరం సమాచారం, డౌన్‌లోడ్ చేసిన ఫైల్స్... వంటివి మోసగాళ్లకు చేరుతుంటాయి.
- సోషల్ మీడియాలో పోస్ట్‌లు, ఫొటోలు, వీడియోలు, సందేశాలు, ఫైల్స్, ఫోన్ పరిచయాలు, పేరు, జెండర్, ఇమెయిల్, ప్లేస్, ఫోన్ నెంబర్, పుట్టిన తేదీ, రిలేషన్స్, ఫ్రెండ్స్, గ్రూప్స్, గ్రూప్ చాట్స్, పోస్ట్‌లు, ట్యాగ్ చేసిన ఫొటోలు, వీడియోలు .. ఇవన్నీ మీ వ్యక్తిగత డేటా కిందకు వస్తాయి.

సరైన రక్షణ ఇలా..

వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసేటప్పుడు అప్రమత్తత అవసరం.

- అల్ఫాన్యూమరిక్, ప్రత్యేక అక్షరాలను చేర్చి, స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి.
- వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (విపిఎన్)ని ఉపయోగించాలి.
- పేరొందిన యాంటీవైరస్, యాంటీ మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌నే ఉపయోగించాలి.
- ఫిషింగ్ స్కామ్‌ల పట్ల జాగ్రత్త వహించాలి. షార్ట్ లింక్‌లపై ఎప్పుడూ క్లిక్ చేయవద్దు.
- సాఫ్ట్‌వేర్ /యాప్స్‌ను చట్టబద్ధమైన మూలాల నుండి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- బ్రౌజర్‌ని అప్‌డేట్ చేయాలి. https:// తో మొదలయ్యే సురక్షిత వెబ్‌సైట్‌లను మాత్రమే యాక్సెస్ చేయాలి.
- https://mxtoolbox.com/EmailHeaders.aspx ని ఉపయోగించి వచ్చిన మెయిల్ హెడర్ సరైనదా కాదా అని నిర్ధారించుకోవాలి.
- మీరు ఉపయోగించే యాప్స్ మీ డేటాను ఎలా యాక్సెస్ చేస్తున్నాయో చెక్ చేయండి. ఇందుకు.. https://reports.exodus-privacy.eu.org/en/ ద్వారా చెక్ చేయాలి.
- https://smsheader.trai.gov.in/ ఉపయోగించి అనధికారక ఎసెమ్మెస్ పంపేవారి గురించి తెలుసుకోవచ్చు.

డేటాకు సంబంధించిన చట్టబద్ధత, న్యాయబద్ధత, పారదర్శకమైన ప్రయోజనాల గురించి తెలుసుకోవడమే కాదు, మీ చుట్టూ ఉన్న వ్యక్తులకు కూడా తెలియజేయాలి.

మీ డేటా సురక్షితంగా ఉందో లేదో తెలుసుకోవాలంటే..

ఈ కింది వెబ్‌సైట్‌లలో మీ ఇమెయిల్ లేదా ఫోన్‌నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చు.

(a) https://amibeingpwned.com
(b) https://snusbase.com
(c) https://leakcheck.net
(d) https://leaked.site
(e) https://leakcorp.com/login
(f) https://haveibeensold.app

డేటా రక్షణ కోసం చట్టం

- భారతదేశంలో ఉన్న ఏకైక డేటా రక్షణ చట్టం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, 2000(ఐటీ యాక్ట్). ఈ చట్టం ప్రకారం డేటా రక్షణం కోసం ఉపయోగించే కొన్ని సెక్షన్లు (ఎ) సెక్షన్ 69 (బి) సెక్షన్ 69ఎ (సి) సెక్షన్ 69బి.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ

సరసోటా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్ మైనేని తన భాగస్వామి యూకీ బాంబ్రీతో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఫ్లోరిడాలో బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్-యూకీ (భారత్) ద్వయం 3-6, 6-4, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో మార్టిన్ డామ్-టోజీ కొడాట్ (అమెరికా) జంటను ఓడించింది. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-యూకీ జంట తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది.

బోపన్న ద్వయం పరాజయం

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పోరాటం ముగిసింది. మొనాకోలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ బోపన్న-ఎబ్డెన్ జంట 4-6, 3-6తో కెవిన్ క్రావిట్జ్-టిమ్ ప్యుయెట్జ్ (జర్మనీ) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. బోపన్న-ఎబ్డెన్‌లకు 21,980 యూరోల (రూ. 19 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



చెన్నై కోటలో రాయల్స్ గెలుపు

- 2008 తర్వాత చెన్నైలో నెగ్గిన రాజస్తాన్ రాయల్స్
- రాణించిన బట్లర్, అశ్విన్
- 'ఫినిషింగ్'లో ధోని, జడేజా విఫలం


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అశ్విన్ 22 బంతుల్లో 30 పరుగులు; 2/25


ధోని జడేజా

చెన్నై: వరుసగా మూడో విజయం సాధించి ఈ ఐపీఎల్ సీజన్‌లో 'హ్యాట్రిక్' నమోదు చేయాలని ఆశించిన నాలుగుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు నిరాశ ఎదురైంది. మాజీ విజేత రాజస్తాన్ రాయల్స్ సమష్టి ప్రదర్శనతో చెన్నై జట్టుకు వారి సొంత మైదానంలోనే షాక్ ఇచ్చింది. 2008 తర్వాత చెన్నై వేదికలో చెన్నై జట్టును రాజస్తాన్ ఓడించడం ఇదే తొలిసారి. టాస్ గెలిచి చెన్నై జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 175 పరుగులు సాధించింది. జోస్ బట్లర్ (36 బంతుల్లో 52; 1 ఫోర్, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా... దేవదత్ పడిక్కల్ (26 బంతుల్లో 38; 5 ఫోర్లు), అశ్విన్ (22 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు), హెట్‌మైర్ (18 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఆకాశ్ సింగ్, తుషార్ దేశ్‌పాండే, రవీంద్ర జడేజా రెండు వికెట్ల చొప్పున తీశారు. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 172 పరుగులు చేసి ఓడిపోయింది. డెవాన్ కాన్వే (38 బంతుల్లో 50; 6 ఫోర్లు), అజింక్య రహానే (19 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలకదశలో అవుటవ్వగా... చివర్లో రవీంద్ర జడేజా (15 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), ధోని (17 బంతుల్లో 32; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరిపించి ఆరో వికెట్‌కు ఐదు ఓవర్లలో 59 పరుగులు జోడించినా చెన్నైను విజయతీరానికి చేర్చలేకపోయారు. డెవాన్ కాన్వే అవుటయ్యే సమయానికి చెన్నై స్కోరు 15 ఓవర్లలో 113/6. చెన్నై గెలవాలంటే 30 బంతుల్లో 63 పరుగులు చేయాలి. క్రీజులో జడేజా, ధోని ఉన్నారు. అశ్విన్ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్లో 4 పరుగులు... చహల్ వేసిన 17వ ఓవర్లో 5 పరుగులు వచ్చాయి. దాంతో చెన్నై విజయసమీకరణం 18 బంతుల్లో 54 పరుగులుగా మారింది. జంపా వేసిన 18వ ఓవర్లో ధోని, జడేజా 14 పరుగులు... హోల్డర్ వేసిన 19వ ఓవర్లో 19 పరుగులు రాబట్టారు. దాంతో చెన్నై నెగ్గడానికి చివరి ఓవర్లో 21 పరుగులు అవసరమయ్యాయి. చివరి ఓవర్ వేసేందుకు వచ్చిన సందీప్ శర్మ తొలి రెండు బంతులను వైడ్ వేశాడు. ఆ తర్వాతి బంతికి పరుగు ఇవ్వని సందీప్... తర్వాతి రెండు బంతులు ఫుల్‌టాస్ వేయడంతో వాటిని ధోని సిక్స్‌లుగా మలిచాడు. దాంతో చెన్నై గెలవడానికి 3 బంతుల్లో 7 పరుగులు చేయాలి. అయితే సందీప్ శర్మ వేసిన మూడు బంతుల్లో ధోని, జడేజా మూడు పరుగులే చేయడంతో చెన్నై ఓటమి పాలైంది. రాజస్తాన్ స్పిన్నర్లు అశ్విన్ (2/25), యజువేంద్ర చహల్ (2/27) కీలక వికెట్లు తీసి చెన్నైను కట్టడి చేశారు.

నిలబడి...తడబడి...: అంతకుముందు రాజస్తాన్ జట్టుకు ఓపెనర్లు శుభారంభం ఇవ్వలేకపోయారు. తుషార్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్లో యశస్వి జైస్వాల్ (8 బంతుల్లో 10; 2 ఫోర్లు) భారీ షాట్‌కు ప్రయత్నించి మిడ్ ఆఫ్ వద్ద శివమ్ దూబే చేతికి చిక్కాడు. అనంతరం బట్లర్, దేవ్‌దత్ ఇన్నింగ్స్‌ను నిర్మించారు. స్పిన్నర్ తీక్షణ బౌలింగ్‌లో వీరిద్దరు దూకుడుగా ఆడారు. తీక్షణ వేసిన తొలి ఓవర్లో 10 పరుగులు... రెండో ఓవర్లో 17 పరుగులు పిండుకున్నారు. ఆ తర్వాత తుషార్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లోని తొలి రెండు బంతులను దేవ్‌దత్ బౌండరీకి తరలించాడు. పవర్‌ప్లే ముగిసేసరికి రాజస్తాన్ 57/1తో నిలిచింది. పవర్‌ప్లే తర్వాత కూడా బట్లర్, దేవదత్ ధాటిగానే ఆడారు. మొయిన్ అలీ వేసిన ఎనిమిదో ఓవర్లో బట్లర్ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టడంతో ఈ ఓవర్లో రాజస్తాన్ మొత్తం 18 పరుగులు సాధించింది. సాఫీగా సాగుతున్న రాజస్తాన్ ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్లో తడబడింది. రవీంద్ర జడేజా మూడు బంతుల వ్యవధిలో దేవదత్‌ను, కెప్టెన్ సంజూ సామ్సన్ (0)ను పెవిలియన్‌కు పంపించాడు. అనంతరం నాలుగు ఓవర్లపాటు రాజస్తాన్ బ్యాటర్లు బట్లర్, అశ్విన్ ఆచితూచి ఆడారు. వీరిద్దరు ఈ నాలుగు ఓవర్లలో ఒక్క బౌండరీ కొట్టలేకపోయారు. ఆకాశ్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్లో అశ్విన్ రెండు వరుస సిక్స్‌లు కొట్టాడు. అయితే ఇదే ఓవర్ చివరి బంతికి అశ్విన్‌ను ఆకాశ్ అవుట్ చేశాడు. దాంతో బట్లర్, అశ్విన్ 47 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. 15 ఓవర్లు ముగిసేసరికి రాజస్తాన్ 135/4తో నిలిచింది. చివరి ఐదు ఓవర్లలో చెన్నై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ప్రమాదకరంగా మారిన బట్లర్‌తోపాటు ధ్రువ్, హోల్డర్‌లను వెంటవెంటనే అవుట్ చేశారు. చివరి ఐదు ఓవర్లలో చెన్నై కేవలం 40 పరుగులిచ్చి 4 వికెట్లు తీసింది.



కెప్టెన్ ధోని @ 200

రాజస్తాన్ రాయల్స్ మ్యాచ్‌తో ధోని మరో మైలురాయి అందుకున్నాడు. ఐపీఎల్ టోర్నీలో చెన్నై జట్టు కెప్టెన్ హోదాలో అతను 200వ మ్యాచ్ ఆడాడు. అత్యధిక ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్ల జాబితాలో 238 మ్యాచ్‌లతో ధోని తొలి స్థానంలో ఉన్నాడు. చెన్నై జట్టుపై రెండేళ్లపాటు నిషేధం విధించిన సమయంలో ధోని రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ జట్టు తరఫున రెండు సీజన్‌లు (2016, 2017) ఆడాడు. ఓవరాల్‌గా ధోని ఇప్పటి వరకు 214 మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ధోనిని చెన్నై ఫ్రాంచైజీ యజమాని శ్రీనివాసన్ సన్మానించారు.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) శివమ్ దూబే (బి) తుషార్ దేశ్‌పాండే 10; బట్లర్ (బి) మొయిన్ అలీ 52; దేవదత్ పడిక్కల్ (సి) కాన్వే (బి) జడేజా 38; సంజూ సామ్సన్ (బి) జడేజా 0; అశ్విన్ (సి) మగాలా (బి) ఆకాశ్ సింగ్ 30; హెట్‌మైర్ (నాటౌట్) 30; ధ్రువ్ జురేల్ (సి) శివమ్ దూబే (బి) ఆకాశ్ సింగ్ 4; హోల్డర్ (సి) కాన్వే (బి) తుషార్ దేశ్‌పాండే 0; జంపా (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 175.** **వికెట్ల పతనం:** 1-11, 2-88, 3-88, 4-135, 5-142, 6-167, 7-174, 8-175. **బౌలింగ్:** ఆకాశ్ సింగ్4-0-40-2, తుషార్ దేశ్‌పాండే 4-0-37-2, తీక్షణ 4-0-42-0, రవీంద్ర జడేజా 4-0-21-2, మొయిన్ అలీ 2-0-21-1, సిసాంద మగాలా 2-0-14-0.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ గైక్వాడ్ (సి) యశస్వి (బి) సందీప్ శర్మ 8; డెవాన్ కాన్వే (సి) యశస్వి (బి) చహల్ 50;, అజింక్య రహానే (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 31; శివమ్ దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 8; మొయిన్ అలీ (సి) సందీప్ శర్మ (బి) జంపా 7; రాయుడు (సి) హెట్‌మైర్ (బి) చహల్ 1; జడేజా (నాటౌట్) 25; ధోని (నాటౌట్) 32; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 172.** **వికెట్ల పతనం:** 1-10, 2-78, 3-92, 4-102, 5-103, 6-113. **బౌలింగ్:** సందీప్ శర్మ 3-0-30-1, కుల్దీప్ సేన్ 2-0-8-0, హోల్డర్ 3-0-37-0, ఆడమ్ జంపా 4-0-43-1, అశ్విన్ 4-0-25-2, యజువేంద్ర చహల్ 4-0-27-2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	4	3	1	6	1.588
లక్నో	4	3	1	6	1.048
కోల్‌కతా	3	2	1	4	1.375
గుజరాత్	3	2	1	4	0.431
చెన్నై	4	2	2	4	0.225
పంజాబ్	3	2	1	4	-0.281
బెంగళూరు	3	1	2	2	-0.800
ముంబై	3	1	2	2	-0.879
హైదరాబాద్	3	1	2	2	-1.502
ఢిల్లీ	4	0	4	0	-1.576

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

భారత రెజ్లర్లకు ఐదు పతకాలు

- అంతిమ్ పంఘాల్‌కు రజతం
- అన్షు, సోనమ్, రీతిక, మనీషాలకు కాంస్యాలు


అంతిమ్

అస్తానా (కజకిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్లు తమ సత్తా చాటుకున్నారు. బుధవారం ముగిసిన మహిళా ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో భారత్‌కు ఒక రజతం, నాలుగు కాంస్యాలతో కలిపి మొత్తం ఐదు పతకాలు లభించాయి. గత ఏడాది అండర్-20 ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన అంతిమ్ పంఘాల్ (53 కేజీలు) రజత పతకం నెగ్గగా... అన్షు మలిక్ (57 కేజీలు), సోనమ్ మలిక్ (62 కేజీలు), మనీషా (65 కేజీలు), రీతిక (72 కేజీలు) కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఫైనల్ చేరే క్రమంలో తన ప్రత్యర్థులకు కేవలం ఒక పాయింట్ సమర్పించుకున్న అంతిమ్ తుది పోరులో మాత్రం పోరాడినా ఫలితం లేకపోయింది. 2021 ప్రపంచ చాంపియన్ అకారి ఫుజినామి (జపాన్) 10-0తో మూడు నిమిషాల వ్యవధిలో 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో అంతిమ్‌పై గెలిచి స్వర్ణ పతకం దక్కించుకుంది. అంతకుముందు అంతిమ్ తొలి రౌండ్‌లో 10-0తో అల్వినా లిమ్ (సింగపూర్)పై, క్వార్టర్ ఫైనల్లో 6-0తో లి డెంగ్ (చైనా)పై, సెమీఫైనల్లో 8-1తో అక్టెంగె కెనిమ్‌జయేవా (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందింది. కాంస్య పతక బౌట్‌లలో అన్షు 10-0తో ఎర్డెన్‌సుడ్ బట్ ఎర్డెన్ (మంగోలియా)పై, సోనమ్ 5-1తో జియోజువాన్ లు (చైనా)పై, మనీషా 8-0తో అల్బీనా కైర్‌జెల్డినోవా (కజకిస్తాన్)పై, రీతిక 5-1తో స్వెత్లానా (ఉజ్బెకిస్తాన్)పై విజయం సాధించారు. రెండు రజతాలు, ఆరు కాంస్యాలతో కలిపి మొత్తం ఎనిమిది పతకాలు నెగ్గిన భారత్ టీమ్ చాంపియన్‌షిప్‌లో మూడో స్థానంలో నిలిచింది.

భారత్‌కు రెండో విజయం


రష్మిక

తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా జోన్ గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. ఆతిథ్య ఉజ్బెకిస్తాన్ జట్టుతో బుధవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలి సింగిల్స్‌లో రుతుజా భోస్లే 5-7, 6-2, 6-4తో సబ్రీనా ఒలిమ్‌జనోవాపై నెగ్గడంతో భారత్ 1-0తో ఆధిక్యాన్ని సంపాదించింది. రెండో సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా 6-4, 6-2తో సెవిల్ యుల్దషెవాను ఓడించడంతో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లడంతోపాటు విజయాన్ని ఖరారు చేసుకుంది. మూడో మ్యాచ్‌గా జరిగిన డబుల్స్ పోరులో భమిడిపాటి శ్రీవల్లి రష్మిక-వైదేహి చౌదరీ జోడీ 6-1, 6-0తో కారమోనోవా-వలిహనోవా జంటను చిత్తుగా ఓడించడంతో భారత్ విజయం పరిపూర్ణమైంది. హైదరాబాద్‌కు చెందిన రష్మిక, గుజరాత్ ప్లేయర్ వైదేహి భారత సీనియర్ జట్టు తరఫున తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడారు. నేడు జరిగే మ్యాచ్‌లో చైనాతో భారత్ ఆడుతుంది.

శ్రీనిధి ఎఫ్‌సీ సంచలనం

కేరళ బ్లాస్టర్స్‌పై 2-0తో గెలుపు



కోజికోడ్: సూపర్ కప్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) సంచలనం సృష్టించింది. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టోర్నీలో మూడుసార్లు రన్నరప్‌గా నిలిచిన కేరళ బ్లాస్టర్స్ జట్టును ఓడించింది. బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ 2-0 గోల్స్ తేడాతో కేరళ బ్లాస్టర్స్ జట్టుపై గెలిచి తొలి విజయం నమోదు చేసింది. శ్రీనిధి జట్టు తరఫున రిల్వాన్ హాసన్ (17వ ని.లో), కాస్టనెడా (44వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఐఎస్‌ఎల్ మాజీ చాంపియన్ బెంగళూరు ఎఫ్‌సీతో జరిగిన తొలి మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు 1-1తో 'డ్రా' చేసుకుంది. ఈనెల 16న జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో రౌండ్‌గ్లాస్ పంజాబ్ జట్టుతో శ్రీనిధి జట్టు ఆడుతుంది.

సినిమా

మూడు దశాబ్దాల తర్వాత...

కొన్ని కాంబినేషన్స్ ఎక్కువగా రిపీట్ అవుతుంటాయి. అయితే కొన్ని కాంబినేషన్స్ రిపీట్ కావడానికి దశాబ్దాలు గడిచిపోతాయి. ఇలా మూడు దశాబ్దాల తర్వాత రిపీట్ అవుతున్న కొన్ని కాంబినేషన్స్‌లో రూపొందుతున్న చిత్రాల గురించి తెలుసుకుందాం


రజనీకాంత్


జాకీ ష్రాఫ్

- రజనీకాంత్, జాకీ ష్రాఫ్ మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోవడానికి 36 ఏళ్లు పట్టింది. 1987లో ప్రభాత్ ఖన్నా దర్శకత్వంలో వచ్చిన హిందీ చిత్రం 'ఉత్తర్ దక్షిణ్'లో రజనీకాంత్, జాకీ ష్రాఫ్ లీడ్ రోల్స్ చేశారు. మళ్లీ ఈ ఇద్దరు కలిసి ఇప్పుడు తమిళ చిత్రం 'జైలర్'లో నటిస్తున్నారు. 'జైలర్'లో రజనీకాంత్ హీరోగా నటిస్తుండగా, జాకీ ష్రాఫ్ కీ రోల్ చేస్తున్నారు. జాకీది నెగటివ్ క్యారెక్టర్ అని సమాచారం. రమ్యకృష్ణ, తమన్నా, సునీల్, శివ రాజ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది.


షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్


రాజేంద్రప్రసాద్, అర్చన

- రాజేంద్రప్రసాద్, అర్చన హీరో హీరోయిన్లుగా వంశీ దర్శకత్వంలో 1986లో వచ్చిన 'లేడీస్ టైలర్' చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. ఆ చిత్రం తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన కలిసి స్క్రీన్ షేర్ చేసుకోలేదు. మళ్లీ 36 ఏళ్ల తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన 'షష్టిపూర్తి' చిత్రంలో కలిసి నటిస్తున్నారు. వీరిద్దరూ లీడ్ రోల్స్ చేస్తున్న ఈ చిత్రంలో రూపేష్ కుమార్ చౌదరి, ఆకాంక్షా సింగ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి పవన్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేయాలనుకుంటున్నారు. మా ఆయి ప్రొడక్షన్స్‌పై రూపేష్ కుమార్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే 'లేడీస్ టైలర్' సినిమాకు స్వరాలు అందించిన ఇళయరాజాయే 'షష్టిపూర్తి' చిత్రానికీ బాణీలు సమకూర్చుతుండటం విశేషం.
- బాలీవుడ్ టాప్ స్టార్స్ షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ హీరోలుగా కలిసి నటించిన హిందీ చిత్రం 'కరణ్ అర్జున్'. హీరో హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 1995లో విడుదలై ఘనవిజయం సాధించింది. కాగా ఆ తర్వాత సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'ట్యూబ్ లైట్', 'టైగర్ 3' (విడుదల కావాల్సి ఉంది) చిత్రాల్లో షారుక్ ఖాన్ గెస్ట్ రోల్స్ చేశారు. అలాగే షారుక్ ఖాన్ హీరోగా నటించిన 'జీరో', 'పఠాన్' చిత్రాల్లో సల్మాన్ ఖాన్ గెస్ట్ రోల్స్ చేశారు. కానీ సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్ హీరోలుగా కలిసి నటించలేదు. ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్ హీరోలుగా యశ్ రాజ్ ఫిలింస్ 'పఠాన్ వర్సెస్ టైగర్' అనే సినిమా రూపొందించనుందని బాలీవుడ్‌లో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా 2025లో సెట్స్‌పైకి వెళ్తుందని బీ టౌన్ టాక్. ఈ లెక్కల ప్రకారం షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ హీరోలుగా మరో సినిమా రావడానికి 30 ఏళ్లు పట్టింది.

టీజర్ ఆసక్తికరంగా ఉంది

- రానా

''ఉస్తాద్' టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. టీమ్ అందరూ కలిసి ఓ మంచి సినిమా తీశారని అనుకుంటున్నాను'' అన్నారు రానా. శ్రీ సింహా కోడూరి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా వారాహి చలన చిత్రం, క్రిషి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రజనీ కొర్రపాటి, రాకేష్ రెడ్డి గడ్డం, హిమాంక్ రెడ్డి దువ్వూరు నిర్మిస్తున్న చిత్రం 'ఉస్తాద్'. బుధవారం ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేసిన రానా మాట్లాడుతూ– ''హీరో శ్రీ సింహాతో సహా దాదాపు 'ఉస్తాద్' చిత్రబృందం అందరితో నాకు మంచి అనుబంధం ఉంది. నిర్మాత రాకేష్ నా నంబర్‌వన్ యారి షో చేశాడు. మరో నిర్మాత హిమాంక్ నా టాలెంట్ ఏజెన్సీని నడిపాడు. ఇక 'బాహుబలి' టైమ్‌లో ఐదేళ్ల పాటు శ్రీసింహాతో కలిసి ట్రావెల్ చేశాను. 'ఉస్తాద్' విజయం సాధించాలి'' అన్నారు. ''ఈ సినిమాలో హీరోకి బైక్ ఎలాగైతే ఉస్తాద్ అయ్యిందో నాక్కూడా అలాగే అయ్యింది. ఎందుకంటే షూటింగ్ సమయంలో బైక్ రైడింగ్ బాగా నేర్చుకున్నాను. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను'' అన్నారు శ్రీ సింహా. ''టీజర్‌లో మీరు చూసింది చాలా తక్కువ. సినిమా పెద్ద స్థాయిలో ఉంటుంది'' అన్నారు రాకేష్. ''రెండేళ్ల ముందే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేయించాం. నాతో సహా ఈ సినిమాతో చాలామంది జర్నీని స్టార్ట్ చేశారు'' అన్నారు ఫణిదీప్.


కావ్యా కల్యాణ్‌రామ్, రానా, శ్రీ సింహా

ఆ వార్త అవాస్తవం


సంజయ్ దత్

బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కన్నడ సినిమా 'కేడీ' షూటింగ్‌లో గాయపడ్డారంటూ బుధవారం సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్‌గా మారింది. ధ్రువ సర్జా హీరోగా జోగి ప్రేమ్ దర్శకత్వంలో 'కేడీ: ది డెవిల్' చిత్రం రూపొందుతోంది. బెంగళూరు సమీపంలోని మాగడి వద్ద వేసిన సెట్‌లో ఇటీవల ఫైట్ మాస్టర్ రవి వర్మ ఆధ్వర్యంలో బాంబు బ్లాస్ట్ సీన్స్ తీస్తుండగా సంజయ్ దత్‌కి గాయాలైనట్లు వార్త గుప్పుమంది. అయితే ఈ వార్త నిజం కాదని సంజయ్ దత్ సోషల్ మీడియా ద్వారా స్పష్టం చేశారు. ''నాకు గాయాలైనట్లు వచ్చిన వార్త అవాస్తవం. నేను ప్రస్తుతం 'కేడీ' షూటింగ్‌లో పాల్గొంటున్నాను. యూనిట్ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు'' అన్నారు సంజయ్ దత్.

దరువెయ్యరా..


గోపీచంద్, డింపుల్

'లక్ష్యం, లౌక్యం' వంటి హిట్ చిత్రాల తర్వాత హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'రామబాణం'. ఈ మూవీలో డింపుల్ హయతీ కథానాయిక. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా మే 5న విడుదల కానుంది. ఈ చిత్రానికి మిక్కీ జె. మేయర్ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని రెండో పాట 'దరువెయ్యరా..'ని రేపు (శుక్రవారం) కర్నూల్ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగే వేడుకలో విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ అంశాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రామబాణం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, కెమెరా: వెట్రి పళనిసామి.

ఆ విషయంలో మన తెలుగు హీరోలు మారాలి!

- గుణశేఖర్

"రుద్రమదేవి'కి నేను ఒక్కణ్ణే నిర్మాత. డైరెక్షన్, ప్రొడక్షన్ రెండూ చూసుకోవడం కష్టంగా అనిపించింది. 'శాకుంతలం' సినిమా ప్రొడక్షన్‌లో 'దిల్' రాజుగారు కూడా భాగం కావడంతో నేను క్వాలిటీపై దృష్టి పెట్టగలిగాను. ఔట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా ప్రత్యేక షోలను బుధవారం ఢిల్లీలో, ఇటీవల హైదరాబాద్‌లో వేశాం. చూసినవారు చాలా బాగుందన్నారు. శుక్రవారం మా 'శాకుంతలం' చూసే ప్రేక్షకులు అదే అనుభూతికి లోనవుతారు" అన్నారు గుణశేఖర్. సమంత, దేవ్ మోహన్ జంటగా నటించిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు గుణశేఖర్ చెప్పిన విశేషాలు..



- 'రుద్రమదేవి' తర్వాత 'హిరణ్య కశ్యప' సినిమా స్క్రిప్ట్, ప్రీ ప్రొడక్షన్‌పై ఐదేళ్లు వర్క్ చేశాను. షూటింగ్ ఆరంభించే టైమ్‌లో కోవిడ్ వచ్చింది. దీంతో అప్పుడు మాతో కలిసి ఉన్న ఓ హాలీవుడ్ సంస్థ మరో వర్క్‌పై ఫోకస్ పెట్టింది. ఈ కారణంగా ఆ ప్రాజెక్ట్‌ను హోల్డ్‌లో పెట్టాం.
- లాక్‌డౌన్ టైమ్‌లో కొన్ని పురాణాలు, ఇతిహాసాల కలయికలో ఓ ప్రేమకథ చేద్దామనే ఆలోచన వచ్చింది. ఆ క్రమంలో కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలం' నాకు నచ్చింది. దాన్ని సోషలైజ్ చేయటమెందుకు.. అలాగే తీస్తే బెటర్ కదా అని 'శాకుంతలం' మొదలుపెట్టాను. సాధారణంగా శకుంతల అనగానే శృంగార శకుంతల గుర్తుకొచ్చేలా ఇప్పటివరకూ చూపించారు. కానీ, ఆమెలో అంతర్గతంగా చాలా శక్తి, ఆత్మాభిమానం ఉంటుందని 'అభిజ్ఞాన శాకుంతలం'లో కాళిదాసు ప్రస్తావించారు. నేను కూడా శకుంతలలోని రెండో కోణంతో కథ అల్లుకుని, 'శాకుంతలం' తీశాను.
- తన ఆత్మాభిమానం కోసం అప్పట్లో రాజు, రాజ్యాలను శకుంతల లెక్క చేయకుండా పోరాడి నిలబడింది. పెళ్లి కాకుండా తల్లి కావటం అనేది అప్పట్లో పెద్ద నేరం. అలాంటి పరిస్థితులను ఆమె ఎలా ఎదురొడ్డి నిలబడిందనేది ఈ చిత్రకథాంశం.
- సమంత చాలా మంచి నటి. అందుకే శకుంతల పాత్రలో రొమాంటిక్ యాంగిల్‌ను సెకండ్రీ చేశా. నటనకు ప్రాధాన్యం ఉండేలా చూపించాను. నేను, అరుణ బిక్షుగారు, సమంతగారు కలిసి మాట్లాడుకుని శకుంతల పాత్రను డిజైన్ చేశాం. సమంత కొత్త హీరోయిన్‌లా అరుణ బిక్షుగారి వద్ద శిక్షణ తీసుకుని నటించింది.
- 'శాకుంతలం'లో దుర్వాస మహామునిగా మోహన్‌బాబుగారు నటించారు. ఆ పాత్రని ఆయన తప్ప మరొకరు చేయలేరు. ఆయన ఒప్పుకోకుంటే ఈ ప్రాజెక్ట్ గురించి నేను ఆలోచనలో పడేవాణ్ణి.
- అమితాబ్ బచ్చన్, సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్.. ఇలా బాలీవుడ్ స్టార్ హీరోలు అతిథి పాత్రలు చేస్తున్నారు. ఆ విషయంలో మన తెలుగు హీరోలు మారాలి. 'రుద్రమదేవి'లో అల్లు అర్జున్‌ది అతిథి పాత్ర అయినా అద్భుతమైన స్పందన వచ్చింది. 'శాకుంతలం'లో దుష్యంతుడి పాత్రలో చాలా కోణాలుంటాయి. ఆ పాత్రని తెలుగు హీరోలు చేస్తారనే నమ్మకం నాకు కలగలేదు. అడిగి లేదనిపించుకోవటం ఇష్టం లేక వారిని సంప్రదించలేదు. దేవ్ మోహన్ 'శాకుంతలం' పూర్తయ్యే వరకు మరో సినిమా చేయనన్నాడు. అతనికి శిక్షణ ఇప్పించి దుష్యంతుడి పాత్ర చేయించుకున్నాను.

చెల్లీ వినవే.. నా తల్లీ వినవే...


విజయ్ ఆంటోని

'బిచ్చగాడు' వంటి సూపర్ హిట్ చిత్రంతో తెలుగులో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు విజయ్ ఆంటోని. ఆ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన 'బిచ్చగాడు-2' తమిళ, తెలుగు భాషల్లో ఈ వేసవిలో విడుదల కానుంది. విజయ్ ఆంటోని హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రంలో కావ్య థాపర్ కథానాయిక. విజయ్ ఆంటోని సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చెల్లీ వినవే.. నా తల్లీ వినవే, నీ అన్నను కాను అమ్మను నేను, చిట్టీ వినవే.. నా బుజ్జీ కనవే.. నీ పుట్టు మచ్చై ఉంటా తోడు..' అంటూ సాగే పాటని విడుదల చేశారు. ఈ పాటను భాష్య శ్రీ రాయగా అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ''ప్రతి ఒక్కర్నీ కదిలించేలా ఈ పాట సాగుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

సాక్షి బిజినెస్
గురువారం
13-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 235	60,393
నిఫ్టీ ▲ 90	17,812

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,053	▲ 22
డోజోన్స్	33,864	▲ 179
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,825	▲ 39
డాక్స్	15,704	▲ 48
షాంఘై	3,327	▲ 14
నికాయ్	28,083	▲ 159

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (24 క్యారెట్)	60,613 ▲ 223
బంగారం (22 క్యారెట్)	60,370 ▲ 223
వెండి (కిలో)	74,940 ▲ 524

అనిశ్చితిలోనూ ఎకానమీ శుభ సంకేతాలు

- ఫిబ్రవరిలో పారిశ్రామిక వృద్ధి 5.6%
- విద్యుత్, మైనింగ్, తయారీ.. ఓకే
- మార్చిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.66%
- 15 నెలల కనిష్ట స్థాయి




న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పరిస్థితుల్లోనూ భారత్ ఎకానమీ తగిన సానుకూల గణాంకాలను చూస్తోంది. ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం, ఫిబ్రవరిలో పారిశ్రామిక ఉత్పత్తికి సంబంధించిన సూచీ (ఐఐపీ) వృద్ధి రేటు 5.6 శాతంగా (2022 ఫిబ్రవరితో పోల్చి) నమోదయ్యింది. విద్యుత్, మైనింగ్, తయారీ రంగాలు మంచి పనితీరును ప్రదర్శించినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం లెక్కలు వెల్లడించాయి. ఇక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్యపరపతి విధాన సమీక్షకు ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం మార్చిలో 5.66 శాతం పెరిగింది. అంటే 2022 ఇదే నెలతో పోల్చితే ఈ ఉత్పత్తుల బాస్కెట్ ధర 5.66 శాతమే పెరిగిందన్నమాట. గడచిన 15 నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో రిటైల్ ద్రవ్యోల్బణం నమోదుకావడం ఇదే తొలిసారి. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశాల ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం లోపు ఉండాలి. అయితే 2022 నవంబర్, డిసెంబర్ మినహా 2022 జనవరి నుంచి 6 శాతం ఎగువనే కొనసాగుతోంది.

కూరగాయల ధరలు కూల్...

వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత గణాంకాల ప్రకారం మార్చిలో కూరగాయలు, ప్రొటీన్ రిచ్ ఆహార పదార్థాల ధరలు తగ్గాయి. కూరగాయల ధరలు 8.51 శాతం తగ్గాయి (2022 ఇదే నెలతో పోల్చి). ఆయిల్ అండ్ ఫ్యాట్స్ ధరలు 7.86 శాతం దిగిరాగా, చేపల ధర 1.42 శాతం దిగివచ్చింది. అయితే సుగంధ ద్రవ్యాల ధరలు మాత్రం భారీగా 18.2 శాతం ఎగశాయి. తృణ ధాన్యాలు–ఉత్పత్తుల ధరలు 15.27 శాతం ఎగశాయి. పండ్ల ధరలు కూడా పెరిగాయి. ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం 2023 ఫిబ్రవరిలో 5.95 శాతం వద్ద ఉంటే, మార్చిలో 4.79 శాతానికి తగ్గింది. 2022 ఇదే నెల్లో ఈ ద్రవ్యోల్బణం రేటు 7.68 శాతంగా ఉంది.

ఆటోమొబైల్ కింగ్ కేశుబ్ మహీంద్రా ఇకలేరు



ముంబై: భారత్ ఆటో పరిశ్రమకు మార్గదర్శకులు, మహీంద్రా అండ్ మహీంద్రా గౌరవ చైర్మన్ కేశుబ్ మహీంద్రా బుధవారం ఇక్కడ తుది శ్వాస విడిచారు. 99 సంవత్సరాల కేశుబ్ మహీంద్రా బుధవారం ఉదయం ఇంట్లో ప్రశాంతంగా తుదిశ్వాస విడిచినట్లు కంపెనీ ప్రకటన తెలిపింది. కేశుబ్ మహీంద్రా గ్రూప్‌నకు 48 ఏళ్ల పాటు చైర్మన్‌గా వ్యవహరించారు. ఆటోమొబైల్ పరిశ్రమ నుంచి ఐటీ, రియల్ ఎస్టేట్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆతిథ్యం వంటి ఇతర వ్యాపార విభాగాలకు గ్రూప్ కార్యకలాపాలను విస్తరించారు. విల్లీస్ కార్పొరేషన్, మిత్సుబిషి, ఇంటర్నేషనల్ హార్వెస్టర్, యునైటెడ్ టెక్నాలజీస్, బ్రిటీష్ టెలికం తదితర అనేక ఇతర ప్రపంచ దిగ్గజ సంస్థలతో వ్యాపార సంబంధాలను ఏర్పరచడంలో అతను కీలక పాత్ర పోషించారు. అక్టోబరు 9వ తేదీ 1923న సిమ్లాలో జన్మించిన కేశుబ్, అమెరికా పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలోని వార్టన్‌లో గ్రాడ్యుయేట్ చేసి, 1947లో మహీంద్రా అండ్ మహీంద్రాలో చేరారు. 1963లో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. స్టీల్ ట్రేడింగ్ కంపెనీ నుండి 15.4 బిలియన్ డాలర్ల వరకూ ఆయన పర్యవేక్షణలో గ్రూప్ వివిధ రంగాలకు విస్తరించింది. మహీంద్రా బోర్డులో డైరెక్టర్లలో ఒకరిగా 64 సంవత్సరాలు కొనసాగిన కేశుబ్ మహీంద్రా 2012లో గ్రూప్ పగ్గాలను అయన మేనల్లుడు, అప్పటి వైస్ చైర్మన్, ఎండీ ఆనంద్ మహీంద్రాకు అప్పగించారు.

నైతిక విలువలకు పెద్దపీట

'నైతిక విలువలకు, సూత్రాలకు కట్టుబడి ఉన్న అత్యున్నత వ్యక్తిత్వం ఆయనది. నీతి, విలువలు, మంచి కార్పొరేట్ పరిపాలనకు సంబంధించి మా వ్యవస్థాపకుల వారసత్వాన్ని సంరక్షించడానికి ముందుండి నాయకత్వం వహించారు. చురుకైన వ్యాపార నైపుణ్యతకు ఆయన ప్రతీక. మహీంద్రా భారీ విస్తరణకు ఈ నైపుణ్యత దోహదపడింది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆయన అనుసరించిన విధానాలు ఆయనను ప్రపంచ స్థాయి బిజినెస్ ఐకాన్‌గా మలచడమే కాకుండా, అందరిలో ఆయన పట్ల ప్రేమాభిమానాలు, గౌరవ మర్యాదలు పెరగడానికి దారితీశాయి' అని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు.

'డిఫాల్ట్' చార్జీల వడ్డింపుపై ఆర్‌బీఐ ఆదేశాలు



ముంబై: రుణాలు డిఫాల్ట్ అయిన కస్టమర్లపై బ్యాంకులు అదనపు వడ్డీ, చార్జీలు విధించి దాన్ని అసలుకు కలిపే విధానానికి చెక్ పెట్టేలా రిజర్వ్ బ్యాంక్ ప్రతిపాదనలు చేసింది. జరిమానాగా వడ్డించే చార్జీల పరిమాణం అనేది డిఫాల్ట్ అయిన మొత్తానికి అనుగుణంగా మాత్రమే ఉండాలని సహేతుక రుణ విధానాలపై విడుదల చేసిన ఒక సర్క్యులర్ ముసాయిదాలో పేర్కొంది. తీసుకున్న రుణాన్ని రుణగ్రహీత సక్రమంగా తిరిగి చెల్లించేలా చూడటమే జరిమానాల ప్రధాన ఉద్దేశ్యమని, వాటిని ఆదాయ వనరుగా బ్యాంకులు భావించరాదని సూచించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
13-4-2023	
విశాఖ	420-00
చిత్తూరు	428-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	385-00
విజయవాడ	385-00
రిటైల్ ధర (డజను)	66.00
12-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	363-00
వరంగల్	365-00
రిటైల్ ధర	4.25

టీసీఎస్.. భేష్

- క్యూ4 నికర లాభం రూ. 11,392 కోట్లు
- మొత్తం ఆదాయం రూ. 59,162 కోట్లు
- కొత్తగా 10 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2022–23లో లాభం రూ. 42,147 కోట్లు

> మరోసారి పటిష్ట ఫలితాలు ప్రకటించినందుకు సంతృప్తిగా ఉన్నాం. మా సర్వీసులకున్న డిమాండును ఆర్డర్‌బుక్ ప్రతిఫలిస్తోంది. రిటైల్, కన్జూమర్, లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ విభాగాలు 13–12 శాతం వృద్ధిని సాధించాయి. బీఎఫ్ఎస్ఐ 9 శాతంపైగా పుంజుకుంది.
>
> – రాజేష్ గోపీనాథన్, సీఈవో, టీసీఎస్



2022–23 క్యూ4 ఆర్థిక ఫలితాలను వెల్లడిస్తున్న సంస్థకు కాబోయే ఎండీ, సీఈవో కృతివాసన్, (ఎడమ వ్యక్తి), ప్రస్తుత ఎండీ, సీఈవో రాజేష్ గోపినాథన్

ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల నంబర్‌వన్ దేశీ దిగ్గజం టీసీఎస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ4(జనవరి–మార్చి)లో నికర లాభం 15 శాతం ఎగసి రూ. 11,392 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 9,959 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం బలపడి రూ. 59,162 కోట్లకు చేరింది. అంతక్రితం రూ. 50,591 కోట్ల ఆదాయం నమోదైంది. రూ. 41,440 కోట్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను ఆర్జించినట్లు కంపెనీ వెల్లడించింది.

పూర్తి ఏడాదికి

మార్చితో ముగిసిన గతేడాదికి టీసీఎస్ 10 శాతం అధికంగా రూ. 42,147 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం 18 శాతం వృద్ధితో రూ. 2,25,458 కోట్లను తాకింది. కాగా.. కొత్త సీఈవో, ఎండీగా ఎంపికైన కె.కృతివాసన్ ప్రస్తుత సీఈవో రాజేష్ గోపీనాథన్ నుంచి జూన్1న బాధ్యతలు స్వీకరించనున్నట్లు టీసీఎస్ పేర్కొంది.

ఆర్డర్ బుక్ జోరు

గతేడాది ఆర్డర్‌బుక్ 34.1 బిలియన్ డాలర్లకు చేరినట్లు టీసీఎస్ వెల్లడించింది. క్యూ4లో 10 బిలియన్ డాలర్లు జమైనట్లు తెలియజేసింది. చరిత్రాత్మక స్థాయిలో భారీ డీల్స్ సాధించినట్లు పేర్కొంది. 10 కోట్లకుపైగా డాలర్ల క్లయింట్ల సంఖ్య 60కు చేరింది. బ్యాంకింగ్ రంగం సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ ఉత్తర అమెరికా నుంచి 15 శాతంపైగా వృద్ధి సాధించినట్లు పేర్కొంది.

ఇతర హైలైట్స్

- షేరుకి రూ. 24 తుది డివిడెండ్ ప్రకటించింది.
- నిర్వహణ లాభ మార్జిన్లు 24.1 శాతం నుంచి 24.5 శాతానికి బలపడ్డాయి.
- నికర మార్జిన్లు సైతం 18.7 శాతం నుంచి 19.3 శాతానికి మెరుగుపడ్డాయి.
- క్యూ4లో నికరంగా 821మందిని, పూర్తిఏడాదిలో 22,600 మందిని జమ చేసుకుంది.
- మొత్తం సిబ్బంది సంఖ్య 6,14,795ను తాకింది. దీనిలో మహిళల వాటా 35.7 శాతం.
- ఉద్యోగ వలసల రేటు 20.1%గా నమోదైంది.
- ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) 40,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించనుంది.

ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు ఎన్ఎస్ఈలో 1 శాతం బలపడి రూ. 3,246 వద్ద ముగిసింది.

ఏడువారాల గరిష్టానికి సూచీలు

- సెన్సెక్స్ 235 పాయింట్లు ప్లస్
- 17,800 స్థాయి పైకి నిఫ్టీ
- ఎనిమిదోరోజూ కొనసాగిన ర్యాలీ
- ఐటీ, ఫార్మా, ఆటో షేర్లకు డిమాండ్



ముంబై: ఐటీ, ఫార్మా, ఆటో షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు ఎనిమిదో రోజూ పరుగులు తీశాయి. యూరప్ మార్కెట్ల నుంచి పటిష్ట సంకేతాలు, విదేశీ పెట్టుబడుల నిరంతర రాక, రూపాయి ర్యాలీ అంశాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లు ఒకశాతం వరకు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 60,438 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 235 పాయింట్ల లాభంతో 60,393 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17,826 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని చేరింది. ఆఖరికి 90 పాయింట్లు బలపడి 17,812 వద్ద నిలిచింది. ఈ ముగింపు ఇరు సూచీలకు 7 వారాల గరిష్టం. ఎఫ్ఎంసీజీ, యుటిలిటీ, క్యాపిటల్ గూడ్స్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,906 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.225 కోట్ల షేర్లను అమ్మేశారు. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను నిర్ణయించే యూఎస్ రిటైల్ ద్రవ్యల్బోణ డేటా వెల్లడి ముందు అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఐటీ దిగ్గజ కంపెనీ టీసీఎస్ నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెప్పించవచ్చనే అంచనాలతో ఈ షేరుతో పాటు ఈ సెక్టార్ షేర్లన్నింటికి డిమాండ్ నెలకొంది. ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, ఎంఫసిస్ షేర్లు 2–1% బలపడ్డాయి.
- మార్చి ఎగుమతి అమ్మకాలు పెరగడంతో దివీస్ ల్యాబ్స్ 10% బలపడి రూ.3212 వద్ద నిలిచింది.
- ఇన్వెస్టర్ల సంపదగా బీఎస్ఈలో రూ.1.15 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. గత ఎనిమిది రోజుల్లో సెన్సెక్స్ 2,779 పాయింట్లు, నిఫ్టీ 860 పాయింట్లు చొప్పున పెరిగాయి.

డివిడెండ్ ప్రకటించిన మోల్డ్‌టెక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యాకేజింగ్ రంగంలో ఉన్న మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ 2022–23 ఏడాదిగాను రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ. 4 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇంజనీరింగ్ సర్వీసుల్లో ఉన్న మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ 2022–23 సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై 100% మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మే 11లోగా డివిడెండ్ చెల్లించనున్నట్టు ఇరు కంపెనీలు బుధవారం ప్రకటించాయి.

ఎస్ఐ వీరనారాయణ తీరుపై హైకోర్టు న్యాయవాదుల నిరసన

సాక్షి, అమరావతి: హైకోర్టు న్యాయవాది జి.వెంకటేశ్వర్లుపై తిరుపతి జిల్లా, బాలాయపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ పి.వీరనారాయణ దాడికి పాల్పడడాన్ని హైకోర్టు న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు భోజన విరామ సమయంలో హైకోర్టు ఎదురుగా సమావేశమై సబ్ ఇన్‌స్పెక్టర్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయవాదిపై దాడి చేసిన సబ్ ఇన్‌స్పెక్టర్ వీరనారాయణపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా ఎస్పీకి లేఖ రాయాలని న్యాయవాదుల సంఘం కార్యవర్గం తీర్మానించింది.

సూర్యుడు భగభగ

సాక్షి, అమరావతి: సూర్యుడి ప్రతాపంతో బుధవారం ప్రజలు తారెత్తిపోయారు. తీవ్రమైన ఎండలతో బయటకు రావడానికే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేసవిలో తొలిసారి బుధవారం సుమారు 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం గమనార్హం. 13 మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాలులు వీచినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అనకాపల్లి జిల్లాలో 6 మండలాలు, కాకినాడ జిల్లాలో 4, ఎన్టీఆర్, విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఒక్కొక్క మండలంలో ఉష్ణోగ్రతల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది. ఉదయం 8 గంటల నుంచే మొదలైన ఎండ సాయంత్రం నాలుగు గంటల వరకు ఉండడంతో ప్రజలు బయట తిరగడానికి ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి జిల్లాలో సాయంత్రం వర్షం పడింది. అక్కడ మూడురోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. గురువారం కూడా అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల తీవ్రత కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు

ప్రధాన కేంద్రాల్లో మంగళవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	43.8	26.2
రాజమహేంద్రవరం	42.5	28.0
కర్నూలు	42.5	24.8
నంద్యాల	42.2	21.4
ఏలూరు	42.0	26.0
విజయవాడ	42.0	26.0
మార్కాపురం	42.0	25.0
విశాఖపట్నం	40.2	27.2
నెల్లూరు	39.2	26.0
కడప	39.1	20.8
శ్రీకాకుళం	39.0	24.0
కాకినాడ	37.9	24.7
విజయనగరం	37.0	27.0



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మొబైల్‌కు అతికించిన స్టిక్కర్‌ను చూపిస్తున్న మహిళ



శ్రీకాకుళం జిల్లా పోలేరులో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు



విశాఖ జిల్లా ఆనందపురంలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న సుబ్బారెడ్డి, పక్కన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వైఎస్సార్ జిల్లా బద్వేలులో ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ప్రతి ఇంటా విశ్వాసం

'జగనన్నే మా భవిష్యత్తు' ఆరో రోజు కార్యక్రమానికి విశేష స్పందన

ప్రభుత్వం చేసిన మేలును గుర్తు చేస్తున్న జనం

- ఇదివరకెన్నడూ ఇలా మంచి జరగలేదని స్పష్టీకరణ
- అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ముల నుంచి ప్రశంసలు
- 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ నినాదాలు
- మద్దతుగా ఐదు రోజుల్లో 37 లక్షల మంది మిస్డ్ కాల్స్



నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని పాతూరులో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చింతలపాలెంలో స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. బుధవారం ఆరవ రోజు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఇదివరకెన్నడూ లేని రీతిలో గత 46 నెలలుగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు, సుపరిపాలన ద్వారా మేలు చేశారంటూ అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ములు ప్రశంసించారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా అమలు చేయకుండా తమను మోసం చేశారని అన్ని వర్గాల ప్రజలు మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తూ తాము పెట్టుకున్న నమ్మకాన్ని సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారని కొనియాడారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అని నినదించారు. మళ్లీ వైఎస్ జగనే అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ప్రజా మద్దతు పుస్తకంలో తమ అభిప్రాయాలను నమోదు చేయించి, రసీదు తీసుకున్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్స్ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను అడిగి మరీ తీసుకుని ఇంటి తలుపులకు, మొబైల్ ఫోన్‌లకు అతికించుకుని అభిమానాన్ని చాటుకున్నారు.

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఈ నెల 7న ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ఐదో రోజు ముగిసేటప్పటికి అంటే మంగళవారానికి వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 37 లక్షల కుటుంబాలకు చెందిన అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ములు 82960 82960 మిస్డ్ కాల్స్ ఇచ్చారు. అన్ని వర్గాల నుంచి ప్రభుత్వానికి మద్దతు వెల్లువెత్తుతుండటం సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనకు దర్పణంగా నిలుస్తోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. టీడీపీ సహా ఇతర ప్రతిపక్షాలు సంప్రదాయక ఓటర్లుగా భావించే కుటుంబాల నుంచి కూడా వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు లభిస్తుండటం విశేషం.

కేసులకు భయపడితే పోరాటం చేయలేం

- రోడ్ షోలో చంద్రబాబు
- జూనియర్ ఎన్టీఆర్ ఫొటోలు వద్దన్న మాజీమంత్రి కొల్లు రవీంద్ర



పటమట (విజయవాడ తూర్పు)/మచిలీపట్నం టౌన్: కేసులకు భయపడితే సీఎం వైఎస్ జగన్‌పై పోరాడలేమని, కేసులతో ఏం పీకుతారని టీడీపీ అధినేత ఎస్.చంద్రబాబు నూరిపోశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన వివిధ ప్రాంతాల్లో మాట్లాడారు. అన్నిచోట్లా వైఎస్సార్ సీపీని దుర్భాషలాడటం, సీఎం వైఎస్ జగన్‌ను వ్యక్తిగతంగా విమర్శించటం పరుష పదజాలంతోనే సాగింది. 10 రూపాయలు ఇస్తూ.. 100 రూపాయలు లాక్కుంటున్న జగన్, వైసీపీ నేతల దుర్మార్గాలు, దోపిడీ, కబ్జాలు చూశాక కూడా వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుంటారా అంటూ దూషించారు. బిడ్డల భవిష్యత్ బాగుండాలంటే, జీవితాలు సంతోషంగా ఉండాలంటే తక్షణమే వైఎస్సార్ సీపీ జెండాను కృష్ణా నదిలో పడేసి, టీడీపీ జెండా పట్టుకోండన్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి చేసి.. విజయవాడలో గూండాయిజం, రౌడీయిజం చేస్తున్న వారి తోకలు కత్తిరిస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఈ మధ్య ఇంటింటికీ జగన్ స్టిక్కర్లు అతికిస్తున్నారని, ఇళ్ల గోడలపై రాయాలన్నా, ఎలాంటి కరపత్రాలు, బొమ్మలు అతికించాలన్నా ఇంటి యజమానుల అనుమతి తప్పనిసరి అన్నారు. ఎలాంటి అనుమతి తీసుకుని వలంటీర్లు జగన్ స్టిక్కర్లు ప్రజల ఇళ్ల గోడలపై అతికిస్తున్నారని ప్రశ్నించారు.

పీక్కుంటూనే ఉండండి

'ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి వేధిస్తున్న సీఎం వైఎస్ జగన్ ఏం పీక్కుంటారు. నాపైన కూడా చాలా కేసులు పెట్టారు. ఇంకా పెడుతున్నారు. ఎన్ని కేసులు పెడితే పెట్టుకోమంటున్నా.. పీక్కుంటూనే ఉండమంటున్నా. నాకు సభ్యత ఉంది కాబట్టే హద్దులు మీరి వ్యక్తిగతంగా పోవడం లేదు' అని చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడలో ఫ్యాక్షన్ రాజకీయాలు సాగనివ్వమని, రమేశ్ యాదవ్ టీడీపీలో చేరడం ద్వారా ఒక స్ఫూర్తి ఇచ్చాడని అన్నారు. వైఎస్సార్‌సీపీ వల్ల రాష్ట్రానికి నష్టమని, సమాజానికి చేటని ముందే పసిగట్టి తెలుగుదేశం జెండా కప్పుకున్నాడన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే, వైసీపీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టామని నోటి కొచ్చినట్టు మాట్లాడారని చంద్రబాబు విమర్శించారు.

జూనియర్ ఎన్టీఆర్ ఫొటోలొద్దు

మచిలీపట్నంలో రోడ్ షోకు వస్తున్న ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు జూనియర్ ఎన్టీఆర్ ఫొటోలతో నగరంలోని పలు ప్రాంతాలకు నుంచి అభిమానులు తరలివచ్చారు. రాత్రి 7.30 గంటల సమయంలో మూడు స్తంబాల సెంటర్ వద్ద డీజే పాటలకు జూనియర్ ఎన్టీఆర్ ఫొటోలతో అభిమానులు రాగా, అక్కడే ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర జూనియర్ ఎన్టీఆర్ చిత్రపటాలను ప్రదర్శించవద్దని అడ్డుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ చిత్రపటాలను ప్రదర్శిస్తే తప్పేంటని యువకులు ప్రశ్నించినా.. లెక్క చేయకుండా లాక్కొని పక్కన పడేశారు. కొల్లు రవీంద్ర ఆదేశాలతో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులందరినీ పార్టీ కార్యకర్తలు పక్కకు తోసుకువెళ్లారు. తమ అభిమాన నటుడు చిత్రపటాన్ని లాక్కోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన అభిమానులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

గ్రామీణులకు నాణ్యమైన విద్యా బోధన

- ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నరసింహారావు
- ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ దరఖాస్తుకు ఈ నెల 24 వరకు గడువు



ప్రవేశాల పోస్టర్లు విడుదల చేస్తున్న నరసింహారావు, ఒబేదుల్లా, అప్పారావు, మల్లేశ్వర్

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా హాస్టల్ వసతితో కూడిన నాణ్యమైన విద్యను అందించడంలో గురుకుల విద్యాలయాలు అగ్రస్థానంలో ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) కార్యదర్శి ఆర్.నరసింహారావు చెప్పారు. గుంటూరు నగరం కొరిటెపాడులోని సంస్థ ప్రధాన కార్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలతో ఏర్పాటు చేసిన సమాచార పోస్టర్లు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 10 జూనియర్ కళాశాలలు, నాగార్జున సాగర్‌లోని బాలుర డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మే 20న అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో నిర్వహించనున్న ఏపీఆర్‌జేసీ డీసీ సెట్–2023కు దరఖాస్తు చేసేందుకు గడువు ఈ నెల 24న ముగియనుందని తెలిపారు. రాష్ట్రంలోని 50 గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి తొలిసారిగా ఏపీఆర్ఎస్ సీఏటీ–2023 పేరుతో మే 20న అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే 12 మైనార్టీ గురుకుల పాఠశాలలు, మూడు మైనార్టీ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా మే 15 నుంచి నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలు రాసేందుకు ఈ నెల 24లోపు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉప కార్యదర్శి హెచ్ఎండీ ఒబేదుల్లా, అప్పారావు, డాక్టర్ పి.వి.మల్లేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఢిల్లీ రెసిడెంట్ కమిషనర్‌గా ఆదిత్యనాథ్ దాస్‌కు అదనపు బాధ్యతలు

- తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీకి సౌరభ్‌గౌర్ బదిలీ

సాక్షి, అమరావతి: తాజాగా చేసిన ఐఏఎస్ బదిలీల్లో స్వల్ప మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్‌గా నియమితులైన సౌరభ గౌర్‌ను తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖకు బదిలీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌కు ఢిల్లీ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆరోగ్యశ్రీ' కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

సాక్షి, అమరావతి: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలోని మూడో ఫ్లోర్‌లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఎయిర్ కండీషనర్ కాలిపోయి దట్టమైన పొగ అలముకుంది. వెంటనే ఉద్యోగులు బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలు చెలరేగకుండా చర్యలు తీసుకున్నారు. ట్రస్ట్ కార్యకలాపాలకు ఎటువంటి అవాంతరం ఏర్పడలేదని కార్యనిర్వహణాధికారి ప్రసాదరావు తెలిపారు.

వాణిజ్య శాఖలో జేసీల బదిలీ

సాక్షి, అమరావతి: వాణిజ్య పన్నుల శాఖలో పలువురు జాయింట్ కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్ గుల్జార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం డివిజన్1 జాయింట్ కమిషనర్‌గా ఓ.ఆనంద్‌ను బదిలీ చేశారు. ఆర్థిక శాఖలో డిప్యూటీ కార్యదర్శి అభిషిక్త్ కిషోర్‌ను విజయవాడ-1 డివిజన్ జాయింట్ కమిషనర్‌గా, ఎన్‌ఫోర్స్‌మెంట్-ఐటీ స్పెషల్ కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించారు. వీరితోపాటు బీ నాగార్జునరావు (విజయనగరం), డి.శ్రీలక్ష్మి (ఏలూరు), జీ కల్యాణ(కడప), కే నాగేంద్ర కుమార్ (సీసీఎస్‌టీ), కే రఘునాథ్ రెడ్డి (సీసీఎస్‌టీ), పి.రామకోటేశ్వరరావు (సీసీఎస్‌టీ), విశాఖపట్నం-2 డిప్యూటీ కమిషనర్‌గా కే అపర్ణను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎద్దుల పోటీలు చట్ట విరుద్ధం

- హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా, రేమట గ్రామంలో శ్రీశ్రీశ్రీ గోకరామయ్య స్వామి ఉరుసు సందర్భంగా ఎద్దుల పోటీలు (బండలాగుడు) నిర్వహించేందుకు హైకోర్టు అనుమతి నిరాకరించింది. ఎద్దుల పోటీలు జంతుహింస చట్ట నిబంధనల పరిధిలోకి వస్తాయని, ఈ చట్టం కింద ఎద్దుల పోటీలు నిర్వహించడానికి వీల్లేదన్న ప్రభుత్వ న్యాయవాది (హోం-2) చైతన్య వాదనతో హైకోర్టు ఏకీభవించింది. చట్టం అనుమతించని దానిని తాము అనుమతించలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. అంతేకాక సుప్రీంకోర్టు ఆదేశాలకు సైతం విరుద్ధమంది. అయితే పౌరాణిక నాటకం ప్రదర్శనకు మాత్రం హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి ఉత్తర్వులు జారీ చేశారు. ఉరుసు సందర్భంగా నిర్వహించతలపెట్టిన ఎద్దుల పోటీలు, పౌరాణిక నాటకం ప్రదర్శనకు పోలీసులు అనుమతిని నిరాకరించడాన్ని సవాలు చేస్తూ కప్పా పెద్ద వెంకన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

హరీశ్‌రావు అవాకులు

- ఏపీలో ఏమీ లేదంటూ తొలుత రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- దానిపై ఏపీ మంత్రులు స్పందిస్తే మండిపాటు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణ మంత్రి హరీశ్‌రావు మరోసారి నోరు పారేసుకున్నారు. తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బీఆర్ఎస్ గురించి ఆంధ్రప్రదేశ్ ప్రజలు చర్చించుకోకుండా చవకబారు విమర్శలకు దిగారు. ఏపీలో పథకాలే లేవన్నట్లు పని గట్టుకుని మాట్లాడటం వెనుక రాజకీయ అజెండా మేరకే ఏపీపై విమర్శలు చేసినట్లు స్పష్టమవుతోంది. 'ఆంధ్రప్రదేశ్‌లో ఏమీ లేదు.. తెలంగాణలో ఎన్నో పథకాలున్నాయి.. అందువల్ల మీరు ఇక్కడే ఓటు నమోదు చేయించుకోండి' అని మంగళవారం ఆంధ్ర కూలీలను ఉద్దేశించి హరీష్ రావు తొలుత వ్యాఖ్యలు చేశాకే ఏపీ మంత్రులు స్పందించారు. దీనిపై బుధవారం సంగారెడ్డి జిల్లా జోగిపేట్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి హరీశ్.. ఆంధ్రా మంత్రులు అనవసరంగా తమ జోలికి రావద్దని వ్యాఖ్యానించారు. 'తెలంగాణలో కల్యాణలక్ష్మి ఉంది. షాదీముబారక్ ఉంది. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమా, 26 మెడికల్ కాలేజీలు, 56 లక్షల ఎకరాల్లో వరి పంట, కాళేశ్వరం ప్రాజెక్టు.. ఇలా ఎంతో ఉంది' అంటూ చెప్పుకొచ్చారు. ఈ లెక్కన తెలంగాణ కంటే రెండు రెట్లు ఎక్కువగానే ఏపీలో సంక్షేమాభివృద్ధి పథకాలు కొనసాగుతున్నాయని తెలిసీ.. మరీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం.. దానిపై ఏపీ మంత్రులు స్పందిస్తే మళ్లీ వారిపై నోరు పారేసుకోవడం చూస్తుంటే ముమ్మాటికీ రాజకీయ కోణమే కనిపిస్తోంది.

ఎక్కువ మార్కులొచ్చిన జవాబులే పరిగణనలోకి..



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పదో తరగతి విద్యార్థులకు మేలు జరిగేలా పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరైనా విద్యార్థి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నిర్దేశిత ప్రశ్నల సంఖ్య కన్నా ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు రాసి ఉంటే.. వాటిలో ఎక్కువ మార్కులు వచ్చిన సమాధానాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ విద్యార్థి మొత్తం మార్కులను నిర్ణయించనున్నారు. తక్కువ మార్కులు వచ్చిన ప్రశ్నల జవాబులను తీసివేయనున్నారు. ఈ మేరకు తాజాగా పాఠశాల విద్యాశాఖ ప్రొసీడింగ్స్ విడుదల చేసింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 3 నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నెల 18వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.

19 నుంచి మూల్యాంకనం

ఈ నెల 19నుంచి 26వ తేదీ వరకు విద్యార్థుల సమాధాన పత్రాల మూల్యాంకన చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూల్యాంకన ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ పలు మార్గదర్శకాలతో కూడిన ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లా కేంద్రాల్లో (పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, నంద్యాల జిల్లా కేంద్రాలు మినహా) మూల్యాంకనకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు మార్గదర్శకాలతో కూడిన బుక్‌లెట్లను కూడా పాఠశాల విద్యాశాఖ అందించింది. ఆయా జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలన్నిటినీ ఏర్పాటు చేసే బాధ్యతను ఆయా జిల్లాల విద్యా శాఖాధికారులకు అప్పగించింది. మూల్యాంకనం సందర్భంగా అందులో పాల్గొనే సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులను తాజా ప్రొసీడింగ్స్‌లో కమిషనర్ వివరించారు. వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిన బాధ్యత డీఈవోలదేనని స్పష్టం చేశారు.

పొరపాట్లు జరిగితే చర్యలే

- పరీక్ష ఫలితాల వెల్లడి అనంతరం అభ్యర్థులకు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశం, ఫొటోస్టాట్ కాపీలను అందించడం వంటివి ఉన్నందున మూల్యాంకనంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందునుంచే జాగ్రత్తలు తీసుకోవాలి.
- రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ల సమయంలో ఏ విధమైన మార్పులు చేయాల్సి వచ్చినా అందుకు వరుసగా స్పెషల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- పొరపాట్లు చేసిన వారిపై నిబంధనల ప్రకారం పెనాల్టీ సహా క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటారు.
- మూల్యాంకనాన్ని ఎలాంటి పొరపాట్లు, ఇతర అవాంఛిత అంశాలకు తావులేని విధంగా ప్రశాంతంగా ముగించేందుకు డీఈవోలు చర్యలు తీసుకోవాలి.
- జిల్లాస్థాయి పరిశీలకులు మూల్యాంకన కేంద్రాలను తొలి రెండు రోజులు తప్పనిసరిగా సందర్శించి తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలి.

మార్గదర్శకాలు ఇవీ

- మూల్యాంకనంలో పాల్గొనే అసిస్టెంట్ ఎగ్జామినర్లు రోజుకు 40 సమాధానాల పత్రాలను మాత్రమే మూల్యాంకన చేయాలి
- అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకన చేసే సమాధాన పత్రాలన్నిటినీ స్పెషల్ అసిస్టెంట్లు పూర్తిగా పరిశీలన చేసి మార్కులను లెక్కించాలి.
- పరీక్ష రాసిన అభ్యర్థి నిర్దేశిత సంఖ్యకు మించి ప్రశ్నలకు సమాధానాలు రాశాడా అన్న అంశాన్ని స్పెషల్ అసిస్టెంట్లు గమనించాలి.
- ఒకవేళ నిర్దేశిత సంఖ్యకు మించి ప్రశ్నలకు సమాధానం రాసి ఉంటే.. వాటిని మూల్యాంకనం చేసి మార్కులు వేశారా? లేదా అన్న విషయాన్ని కూడా పరిశీలన చేయాలి.
- అదనంగా రాసిన ప్రశ్నల సమాధానాలను అసిస్టెంట్ ఎగ్జామినర్ మూల్యాంకన చేసి మార్కులు ఇచ్చినట్టయితే ఎక్కువ మార్కులు వచ్చిన సమాధానాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని విద్యార్థికి నిర్దేశిత ప్రశ్నల సంఖ్య మేర మార్కులను కేటాయించాలి. తక్కువ మార్కులు వచ్చిన ప్రశ్నల సమాధానాలను పరిహరించాలి.
- అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకన చేసిన సమాధాన పత్రాల్లోని కనీసం 20 ఆన్సర్ స్క్రిప్టులను ఆయా కేంద్రాల్లోని చీఫ్ ఎగ్జామినర్లు పరిశీలించాలి. రోజులో మొత్తంగా 60 వరకు ఆన్సర్ స్క్రిప్టులను పరిశీలన చేయాలి.
- అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు మూల్యాంకన పూర్తయిన రెండు సమాధానాల పత్రాలను పరిశీలించాలి.
- అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకన చేసిన సమాధాన పత్రాల్లో డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ ప్రతి రోజూ కనిష్టంగా 45 పత్రాలను పరిశీలన చేయాలి.
- అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకనం చేసిన సమాధాన పత్రాల్లో క్యాంప్ ఆఫీసర్ ప్రతి రోజూ కనిష్టంగా 20 పత్రాలను పరిశీలించాలి.

రుషికొండపై అనుమతికంటే తక్కువ విస్తీర్ణంలోనే నిర్మాణాలు

- హైకోర్టుకు నివేదిక సమర్పించిన ఎంవోఈఎఫ్ జాయింట్ కమిటీ

సాక్షి, అమరావతి: విశాఖపట్నం రుషికొండపై రిసార్ట్ ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా చేపడుతున్న నిర్మాణాల విస్తీర్ణం కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) ఇచ్చిన అనుమతుల కన్నా తక్కువ విస్తీర్ణంలోనే ఉందని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్) నేతృత్వంలోని జాయింట్ కమిటీ తేల్చింది. 19,967.97 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 7 బ్లాకుల్లో రిసార్ట్‌లను నిర్మించుకునేందుకు సీఆర్‌జెడ్ అనుమతులు ఇచ్చిందని, అయితే పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) మాత్రం 15,364 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 4 బ్లాకుల నిర్మాణం మాత్రమే చేపడుతోందని జాయింట్ కమిటీ హైకోర్టుకు నివేదించింది. కొండ ప్రాంతం మొత్తం 61 ఎకరాలు కాగా.. అందులో 5.18 ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు సీఆర్‌జెడ్ అనుమతులు ఇచ్చిందని తెలిపింది. ఏపీటీడీసీ 5.18 ఎకరాల కన్నా తక్కువ విస్తీర్ణంలోనే నిర్మాణాలు చేస్తోందని స్పష్టం చేసింది. ల్యాండ్ స్కేప్, హార్డ్ స్కేప్ కోసం 4.70 ఎకరాలు వినియోగిస్తోందని తెలిపింది. ల్యాండ్ స్కేప్, హార్డ్ స్కేప్ పనులు ఇంకా మొదలు పెట్టలేదంది. వేంగి, కళింగ, గజపతి, విజయనగర బ్లాకుల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని, వీటికోసం భూమిని వినియోగించుకునే పద్ధతులను ఏపీటీడీసీ మార్చిందని తెలిపింది. కొన్ని బ్లాకులను సీఆర్‌జెడ్, సీఎఫ్ఈ (కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) అనుమతి ఇచ్చిన విస్తీర్ణం కన్నా తక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తుండగా, కొన్ని బ్లాకులను అదనపు విస్తీర్ణంలో నిర్మిస్తున్నారని వివరించింది.చోళ, పల్లవ బ్లాకుల నిర్మాణాన్ని పూర్తిగా ఉపసంహరించారని తెలిపింది.

కమిటీ ఏర్పాటునకు ఆదేశాలిచ్చిన ధర్మాసనం

విశాఖపట్నం జిల్లా యండాడ గ్రామంలోని సర్వే నంబరు 19 పరిధిలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇవ్వడం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ (ఎంవోఈఎఫ్) అనుమతులకు, విశాఖపట్నం పట్టణ ప్రాంతాభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమంటూ జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ గత ఏడాది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఇదే అంశంపై విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ కూడా పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారించిన సీజే ధర్మాసనం.. రుషికొండ తవ్వకాలపై సర్వే చేసి నివేదిక ఇచ్చేందుకు బాధ్యతాయుతమైన అధికారి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖను ఆదేశించిన విషయం విదితమే. హైకోర్టు ఆదేశాల మేరకు ఎంవోఈఎఫ్ ఒక జాయింట్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ గత నెల 13న రుషికొండను, నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించి నివేదిక తయారు చేసింది. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వ న్యాయవాది బుధవారం మెమో రూపంలో హైకోర్టు ముందుంచారు. ఈ నివేదికపై లిఖితపూర్వక సమాధానం ఇచ్చేందుకు గడువు కావాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కె.ఎస్.మూర్తి హైకోర్టును కోరారు. అంగీకరించిన హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

విద్యుత్ కోతలేకుండా సరఫరాకు పటిష్ట చర్యలు

ఇంధనశాఖ అధికారులకు సీఎస్ ఆదేశం

సాక్షి, అమరావతి: ప్రస్తుత వేసవిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మెరుగు పర్చుకునేందుకు ప్రణాళికాబద్ధంగా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఇంధనశాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. అవసరాలకు తగ్గట్టుగా డిమాండ్ మేరకు విద్యుత్ సమకూర్చుకోవాలని, కోతలు విధించడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఆయన బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఇంధన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ నెలకు సంబంధించి రానున్న 18 రోజుల్లో భారీ విద్యుత్ డిమాండ్ ఉంటుందని, కొరత లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి వడగాడ్పులు నమోదవుతాయన్న ఐ.ఎం.డి. అంచనాల నేపథ్యంలో ఈ వేసవిలో రోజువారీ విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా 240 నుంచి 250 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం ఉందొచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ట్రాన్స్‌కో లోడ్ ఫోర్‌కాస్టింగ్ సిస్టం ద్వారా మరుసటి రోజు విద్యుత్ డిమాండ్ ఎంత ఉంటుందో ముందురోజే అంచనా వేసుకుని ఆ మేరకు సరఫరాకు అవసరమైన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేసుకుంటున్నట్లు చెప్పారు. ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో జేఎండీ పృధ్వీతేజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంగతి చూసుకో చాలు

హరీశ్‌రావు వ్యాఖ్యలపై మంత్రి బొత్స కౌంటర్

- ఏపీకి వస్తే ఏం జరుగుతుందో చూపిస్తాం: మంత్రి కారుమూరి
- ప్రాంతీయ ఉన్మాదులు అలాగే మాట్లాడతారు: మంత్రి అప్పలరాజు
- సంక్షేమ పథకాలు హరీశ్‌కు కనబడటం లేదా: ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



సాక్షి, అమరావతి: తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యలపై ఏపీ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ విషయాలపై మాట్లాడటానికి హరీశ్‌రావు ఎవరని, ముందు తెలంగాణ సంగతి చూసుకుంటే ఆయనకు మంచిదని హితవు పలికారు. బుధవారం రాష్ట్ర సచివాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఎలా పాలిస్తున్నామో ఏపీ ప్రజలకు తెలుసన్నారు. రాజకీయం కోసమే హరీశ్‌రావు అలా మాట్లాడి ఉంటారని అభిప్రాయపడ్డారు. కాగా, చంద్రబాబు రాజకీయ ఉనికి కోసమే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు జీవితంలో ఇది పేటెంట్ అని చెప్పుకోవడానికి ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. వైఎస్సార్, వైఎస్ జగన్ పేటెంట్ పథకాలు చాలా ఉన్నాయని, రాష్ట్రాన్ని సమర్థవంతంగా పాలించడంతో పాటు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్నారన్నారు.

సవాల్ విసిరిన కారుమూరి



ఏపీకి వస్తే రాష్ట్రంలో ఏం జరుగుతోందో చూపిస్తామని మంత్రి హరీశ్‌రావుకు పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సవాల్ విసిరారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ.. 'ధనిక రాష్ట్రమైన తెలంగాణను మీ చేతిలో పెడితే ఏం చేశారో తెలియదా' అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో వర్షమొస్తే ఇళ్ల మీద నుంచి నీళ్లు వెళ్తున్నాయని, చిన్నపాటి వర్షం వచ్చినా హైదరాబాద్ కొలాప్స్ అవుతోందని, హైదరాబాద్‌ను ఘోరంగా చేశారని ఎద్దేవా చేశారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ కన్నా చాలా మేలైన పరిస్థితులు ఏపీలో ఉన్నాయన్నారు. తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా తగలేస్తోందో అక్కడి ప్రతిపక్షాలు ఎలుగెత్తి చాటుతున్నాయని, ముందు వారికి సమాధానం చెప్పుకోవాలని హరీశ్‌రావుకు సూచించారు.

వాళ్లు ప్రాంతీయ ఉన్మాదులు: మంత్రి అప్పలరాజు



పోలాకి: ఆంధ్రాపై విద్వేషాలు రగిలించిన ప్రాంతీయ ఉన్మాదులు ఏపీపై అవాకులు, చెవాకులు మాట్లాడుతుంటారని రాష్ట్ర పశు సంవర్ధక మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పోలాకిలో బుధవారం నిర్వహించిన స్వదేశీ మైదాన మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మెజార్టీ పెట్టుబడులు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారివేనని గుర్తు చేశారు. ఇప్పటికీ నిధులు, నీళ్ల విషయంలో ఏపీ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బీఆర్ఎస్ పొరుగు రాష్ట్రాల్లో వేలు పెడతామంటే ఏపీ ప్రజలు ఊరుకోరన్నారు.

కుటుంబమంతా తెలంగాణను దోచుకుంటున్నారు



ఏపీలో అమలవుతున్న నవరత్నాలు సంక్షేమ పథకాలు తెలంగాణ మంత్రి హరీశ్ రావుకు కనబడటం లేదా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మండిపడ్డారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. హరీష్‌రావు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయన్నారు. తెలంగాణలో ప్రతిపక్షాలను ఎదుర్కోలేక ఏపీ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అల్లుడు, కూతురు, మొత్తం కుటుంబమంతా కలిసి తెలంగాణను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌ను బాగు చేసుకోలేని వారు ఏపీ గురించి మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. లాభాల్లో ఉన్న సింగరేణిని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు.

సింగపూర్ నుంచి వచ్చిన వ్యక్తికి కరోనా

- కుటుంబ సభ్యులకు పరీక్షలు.. భార్యకు పాజిటివ్
- హోం ఐసోలేషన్‌లో దంపతులు

చోడవరం రూరల్ (అనకాపల్లి జిల్లా): సింగపూర్ నుంచి వచ్చిన వ్యక్తికి విశాఖ విమానాశ్రయంలో జరిపిన కరోనా పరీక్షలో పాజిటివ్ నిర్ధారణ అయింది. వివరాల్లోకి వెళితే... అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని జన్నవరం గ్రామానికి చెందిన 33 ఏళ్ల వ్యక్తి సింగపూర్‌లో పనిచేస్తున్నాడు. సెలవు దొరకడంతో ఊరికి వచ్చాడు. ఆదివారం విశాఖ విమానాశ్రయంలో దిగిన ఆయనకు ఎయిర్‌పోర్టులో వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం అతడు మండలంలోని జన్నవరానికి, సోమవారం అత్తగారి ఊరైన శ్రీరాంపట్నం వెళ్లాడు. అయితే అతనికి కోవిడ్ నిర్ధారణ అయినట్టు మంగళవారం ఎయిర్‌పోర్టు అథారిటీ వైద్య వర్గాల నుంచి గవరవరం వైద్య కేంద్రానికి సమాచారం అందింది. దీంతో వైద్యాధికారి దమయంతీదేవి సిబ్బంది జన్నవరం, శ్రీరాంపట్నం గ్రామాలకు చేరుకుని సింగపూర్ నుంచి వచ్చిన వ్యక్తి భార్య, పిల్లలు, అత్తమామల పరీక్షలు చేశారు. వీరిలో భార్యకు మాత్రం కరోనా లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. భార్యాభర్తలిద్దరినీ జన్నవరంలో వారి గృహంలోనే ఐసోలేషన్‌లో ఉంచామని, వారికి వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి తెలిపారు. జన్నవరం, శ్రీరాంపట్నం గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని, ప్రజలు భయపడాల్సిందేమీ లేదన్నారు.

ఏపీలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేస్తాం

- క్యాడెట్లకు నిరంతర శిక్షణ కోసం 10 ఎకరాల స్థలం అవసరం
- సీఎస్ జవహర్‌రెడ్డితో భేటీలో ఎన్‌సీసీ డీజీ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్



గుంటూరులోని ఎన్‌సీసీ కార్యాలయంలో ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్

సాక్షి, అమరావతి: ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్లను ఏపీ యువత సద్వినియోగం చేసుకునేందుకు.. రాష్ట్రంలో ఎన్‌సీసీ సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ అన్నారు. ఏపీలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. బుధవారం సచివాలయంలో సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డితో ఆయన భేటీ అయ్యారు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణకు కలిపి ఒకే ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఉందని గుర్బీర్‌పాల్ సింగ్ పేర్కొన్నారు. ఏపీకి ప్రత్యేకంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేస్తామని.. అందుకు తగిన స్థలం కేటాయించాలని కోరారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రత్యేక శిక్షణా కేంద్రం ఏర్పాటు కోసం 10 ఎకరాల స్థలం అవసరముందని చెప్పారు. గుర్బీర్‌పాల్‌సింగ్ ప్రతిపాదించిన అంశాలపై స్పందించిన సీఎస్ జవహర్‌రెడ్డి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డీజీ ఎయిర్ కమాండర్ పి.మహేశ్వర్, కల్నల్‌లు శ్రీనివాస్, వివేక్, స్టాఫ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రుషిరాజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో బాలికలకు 40 శాతం రిజర్వేషన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్‌సీసీలో ప్రాతినిధ్యం పెంచేందుకు బాలికలకు 40 శాతం రిజర్వేషన్ విధానాన్ని అమలు పరుస్తున్నట్లు గుర్బీర్‌పాల్ సింగ్ తెలిపారు. బుధవారం కృష్ణనగర్‌లోని గుంటూరు గ్రూప్ ఎన్‌సీసీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్యాడెట్లు, అధికారులకు జ్ఞాపికలు బహూకరించారు.

బడ్జెట్ నియంత్రణ నుంచి సడలింపులు

- జీతభత్యాలు,, పెన్షన్లు, గౌరవ వేతనాలకు మినహాయింపు
- 2023 – 24 బడ్జెట్ విడుదలపై ఆర్థిక శాఖ మార్గదర్శకాలు జారీ

సాక్షి, అమరావతి: జీతభత్యాలు, పెన్షన్లు, గౌరవ వేతనాలకు బడ్జెట్ నియంత్రణ నుంచి సడలింపు ఇస్తున్నట్లు ఆర్థికశాఖ తెలిపింది. వైఎస్సార్ పెన్షన్ కానుక, హోంగార్డులు, అంగన్‌వాడీ వర్కర్లు, వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది వేతనాలతో పాటు ఎక్స్‌గ్రేషియా, అత్యవసరాలకు బడ్జెట్ నియంత్రణ నుంచి సడలింపు ఇచ్చినట్లు పేర్కొంది. వైఎస్సార్ పెన్షన్ కానుకకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రతీ నెలా లబ్ధిదారుల వివరాలతో అందచేసిన ప్రతిపాదనల మేరకు బడ్జెట్ నిధులు విడుదల చేస్తామని వెల్లడించింది. ఈమేరకు 2023-24 బడ్జెట్ నిధుల విడుదలకు సంబంధించి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ బుధవారం మార్గదర్శకాలు జారీ చేశారు. వివిధ పనుల బిల్లుల చెల్లింపులకు సంబంధించి బడ్జెట్ కేటాయింపుల మేరకు విడుదల ఉత్తర్వులతో సంబంధం లేకుండా అనుమతించవచ్చని తెలిపింది. తగినంత బడ్జెట్ కేటాయింపులు లేకుండా సంబంధిత బిల్లులను అప్‌లోడ్ చేయడానికి వీల్లేదని, బడ్జెట్ కేటాయింపులు లేని పనులను చేపట్టకూడదని స్పష్టం చేసింది.

పాలమూరు–రంగారెడ్డికి నీటి కేటాయింపులు చట్టవిరుద్ధం

- తెలంగాణ జారీ చేసిన జీవోను రద్దు చేయండి
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఏపీ సర్కార్ వినతి

సాక్షి, అమరావతి: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీలను కేటాయిస్తూ తెలంగాణ సర్కార్ జారీ చేసిన ఉత్తర్వులు(జీవో) రద్దు చేసి దిగువ రాష్ట్రమైన తమ రైతుల హక్కులను పరిరక్షించాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించిన బచావత్ ట్రిబ్యునల్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు ఎలాంటి కేటాయింపులు చేయలేదని గుర్తుచేసింది. కేటాయింపులే లేని ప్రాజెక్టుకు నీటిని కేటాయిస్తూ తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని కోరింది. కాగా దీని పై తెలంగాణ సర్కార్ అభ్యంతరం వ్యక్తం చేసింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేయలేదని, కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను కోరింది. రెండు రాష్ట్రాల వాదనలు విన్న ట్రిబ్యునల్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల వివాదాన్ని అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి పరిష్కరించుకోవాలంటూ 2016లో సుప్రీం కోర్టు ఆదేశించటాన్ని ప్రస్తావించింది. దీనిపై ఏపీ ప్రభుత్వం స్పందిస్తూ ఆ వివాదాన్ని పరిష్కరించే అధికారం అపెక్స్ కౌన్సిల్‌కు లేదని స్పష్టం చేసింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటిని కేటాయిస్తూ తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీవోను రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్ లొకేటరీ అప్లికేషన్(ఐఏ)పై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తాళపత్ర సభ్యులుగా ఏర్పాటైన ట్రిబ్యునల్ బుధవారం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ కౌన్సిల్ జయదీప్ గుప్తా, తెలంగాణ సర్కార్ తరఫున సీనియర్ అడ్వొకేట్ సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాటాగా నిర్దేశించిన 811 టీఎంసీలను ప్రాజెక్టుల వారీగా కేటాయించిందని ఏపీ సీనియర్ కౌన్సిల్ జయదీప్ గుప్తా పేర్కొన్నారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు సుప్రీం కోర్టు డిక్రీతో సమానమని, దాన్ని పునఃసమీక్షించడం చట్టవిరుద్ధమని వాదించారు. దీనిపై గురువారం కూడా వాదనలు వింటామని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ప్రకటించారు.

అరుదైన ట్యూమర్‌కు విజయవంతంగా సర్జరీ

- గుంటూరు జీజీహెచ్ వైద్యుల ఘనత
- రోగి కడుపులో డీజే జిస్ట్ ట్యూమర్
- నాలుగేళ్లుగా నరకయాతన
- ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి..
- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్



ఆపరేషన్ ప్రక్రియలో పాల్గొన్న వైద్యులు, ఆపరేషన్ చేయించుకున్న శామ్‌సన్‌జాన్‌సునీల్

గుంటూరు మెడికల్: మెడికల్ జర్నల్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం రెండు కేసులు మాత్రమే నమోదైన అత్యంత అరుదైన ట్యూమర్‌ను గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ వైద్యులు గుర్తించారు. ఎంతో క్లిష్టమైన ఆపరేషన్‌ను జనరల్ సర్జరీ రెండో యూనిట్ వైద్యులు విజయవంతంగా చేసి రోగి ప్రాణాలను కాపాడారు. ఆస్పత్రిలో బుధవారం మీడియాకు ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన నేలటూరి శామ్‌సన్‌జాన్‌సునీల్ మంచంపై నుంచి లేవలేని విధంగా ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం అతడిని విజయవాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. వైద్యులు తక్షణమే అతడికి రక్తం ఎక్కించి ఆరోగ్యం కొంచెం మెరుగుపడ్డాక వైద్య పరీక్షలు నిర్వహించి.. కడుపు కింది భాగంలో జిస్ట్ అనే కణితి ఉన్నట్లు నిర్ధారించారు. సర్జరీ కోసం ఓ కార్పొరేట్ ఆస్పత్రిని సంప్రదించినా లాభంలేక గుంటూరు జీజీహెచ్‌కు మార్చి 14న రోగిని తీసుకొచ్చారు. రిపోర్టులు పరిశీలించి.. చిన్నపేగు డ్యూడెనమ్, జెజునమ్ జంక్షన్ దగ్గర అత్యంత అరుదైన జిస్ట్ ట్యూమర్ ఉన్నట్లు గుర్తించామని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. చిన్నపేగు మొదటి భాగంలో గ్యాస్ట్రో ఇంటస్టీనల్ స్ట్రోమల్ ట్యూమర్ (జిస్ట్) ఇప్పటివరకు మెడికల్ జర్నల్స్‌లో రెండు మాత్రమే నమోదైనట్టు తెలిపారు. ఈ సమస్యకు ఏ విధంగా ఆపరేషన్ చేయాలనే విషయాలు ఎక్కడా పేర్కొనలేదని, రెండో యూనిట్ జనరల్ సర్జరీ వైద్యులంతా దీని గురించి చర్చించి ధైర్యంగా మార్చి 25న ఆపరేషన్ చేశారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.10 లక్షల వరకూ తీసుకునే ఈ సర్జరీని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తి ఉచితంగా చేశారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతో పాటు వైద్యులు చలం, నాగసంతోష్, వంశీధర్, అనూష, వేణుగోపాల్, కోటి, మత్తు వైద్యులు మహేషబాబు, ఆనందబాబు, అలేఖ్య, కీర్తి, రాఘవ, కవిత పాల్గొన్నట్టు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943